

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



గురువారం | 11-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 103 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి ఉ. 10.04 తదుపరి షష్ఠి; నక్షత్రం: పుబ్బ మ. 1.04 తదుపరి ఉత్తర వర్జ్యం: రా. 9.11-10.59, దుర్ముహూర్తం: ఉ. 10.10-11.02 , మ. 3.22-4.14; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 5.51; సూర్యాస్తమయం: 6.49 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బిజినెస్

వరంగల్ ● గురువారం 11 జూలై 2024

ఆర్ఎస్ బ్రదర్స్ ఆషాఢం సేల్



హైదరాబాద్: వస్త్రాల రిటైలింగ్‌లో అగ్రగామి సంస్థల్లో ఒకటైన ఆర్ఎస్ బ్రదర్స్ ఆషాఢం సేల్స్‌ను ప్రకటించింది. ఇందులో భాగంగా 70 శాతం తగ్గింపు ధరలకే "కేజీ సేల్స్" నిర్వహిస్తున్నామని, వస్త్రాభిమానులను ఈ ఆఫర్ విశేషంగా ఆకర్షిస్తున్నదని ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. మహిళలు చూపుతున్న ఈ అభిమానాన్ని దృష్టిలో ఉంచుకుని వైవిధ్యభరితమైన కొత్త స్టాక్‌ను తమ స్టోర్లలో ప్రతీ రోజూ విక్రయానికి పెడుతున్నట్టు వెల్లడించింది. అలాగే రాబోయే పర్వదినాలు, శుభకార్యాలను దృష్టిలో ఉంచుకుని కంచి పట్టు చీరలను సొసైటీ ధరలకే విక్రయిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ డెబిట్/క్రెడిట్ కార్డులపై ఈఎంఐ సదుపాయం సైతం అందిస్తున్నామని, రూ.5000 వరకు తక్షణ డిస్కౌంట్ కూడా ఇస్తున్నామని పేర్కొన్నారు.

టర్మ్ పాలసీలు మరింత ప్రియం

ప్రీమియం 10 శాతం వరకు పెంచిన కంపెనీలు



న్యూఢిల్లీ: జీవితానికి జరగరానిది ఏమైనా జరిగితే ఆదుకునే టర్మ్ పాలసీలు మరింత ప్రియంగా మారాయి. కొన్ని బీమా కంపెనీలు ఇప్పటికే ఈ పాలసీల ప్రీమియాన్ని పది శాతం వరకు పెంచేశాయి. మిగతా బీమా కంపెనీలూ త్వరలో ఇదే బాట పడతాయని పరిశ్రమ వర్గాల అంచనా. ఆరుపదుల వయసు దాటిన వారి టర్మ్ పాలసీల ప్రీమియం మరింత ప్రియంగా మారనుంది. బీమా కంపెనీల వార్షిక ప్రీమియం వసూళ్లలో టర్మ్ పాలసీల ప్రీమియం వాటా ఐదు శాతం మాత్రమే. అయినా బీమా కంపెనీలు ఈ పాలసీల ప్రీమియం పెంచేయడం విశేషం.

కంపెనీల వారీగా: హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, మ్యాక్స్ లైఫ్, బజాజ్ అలయెన్స్, టాటా ఏఐఏ కంపెనీలు ఇప్పటికే తమ టర్మ్ పాలసీల ప్రీమియం 10 శాతం వరకు పెంచాయి. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ కంపెనీ 60 ఏళ్ల వయసు పైబడిన వారి టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ ప్రీమియాన్ని 10 శాతం వరకు పెంచింది. మ్యాక్స్ లైఫ్ కంపెనీ కూడా అన్ని వయసుల వారి టర్మ్ పాలసీల ప్రీమియాన్ని ఒకటి నుంచి ఆరు శాతం వరకు పెంచింది. టాటా ఏఐఏ అన్ని వయసుల వారి టర్మ్ పాలసీల ప్రీమియాన్ని మూడు నుంచి 10 శాతం పెంచింది. ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ కూడా త్వరలో తన టర్మ్ పాలసీల ప్రీమియాన్ని మూడు నుంచి ఐదు శాతం పెంచబోతున్నట్టు సమాచారం.

ఎందుకంటే?

- పెరిగిన ద్రవ్యోల్బణానికి అనుగుణంగా టర్మ్ పాలసీల ప్రీమియాన్ని సర్దుబాటు చేయాల్సి రావడం.
- రిస్క్ కవరేజి ఎక్కువగా ఉండే టియర్- 2 కవరేజిలు పెరిగిపోవడం.
- రీ-ఇన్సూరెన్స్ ప్రీమియంలు కూడా పెరిగిపోవడం.

సామ్‌సంగ్ గెలాక్సీ రింగ్

- తొలిసారిగా స్మార్ట్ రింగ్స్ విభాగంలోకి సంస్థ
- గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, ఫ్లిప్ 6 ఫోన్ల లాంచ్



ప్యారిస్: దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్ దిగ్గజం సామ్‌సంగ్ ప్యారిస్‌లో నిర్వహించిన అన్‌ప్యాక్డ్ కార్యక్రమంలో గెలాక్సీ రింగ్‌ను లాంచ్ చేసింది. తద్వారా కంపెనీ స్మార్ట్ రింగ్‌ల విభాగంలోకి ప్రవేశించింది. ఈ స్మార్ట్ రింగ్ ద్వారా వ్యక్తులు తమ గుండె పనితీరు, నిద్ర, వ్యాయామాలను.. మహిళలైతే తమ రుతు కాలచక్రాన్ని సైతం ట్రాక్ చేసుకునే వీలుంటుంది. 2.3 గ్రాములు, 3 గ్రాముల సైజులో ఉండే ఈ రింగ్ మూడు రంగుల్లో లభిస్తుంది. 10 ఏటీఎం వాటర్ రెసిస్టెన్స్, టైటానియమ్ గ్రేడ్ 5 ఫినిష్‌తో కూడిన ఈ రింగ్ సింగిల్ చార్జ్‌తో ఏడు రోజుల పాటు పనిచేస్తుందని కంపెనీ తెలిపింది. దీని ప్రారంభ ధర 399 డాలర్లు. భారత మార్కెట్‌లో స్మార్ట్ రింగ్ రేటు, ఎప్పటి నుంచి అందుబాటులోకి తేనున్న విషయాల్ని మాత్రం ఇంకా వెల్లడించాల్సి ఉంది.

సామ్‌సంగ్ ఈ కార్యక్రమంలో గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, ఫ్లిప్ 6 ఫోన్లతోపాటు గెలాక్సీ వాచ్ 7, గెలాక్సీ వాచ్ 'అల్ట్రా'ను, గెలాక్సీ బడ్స్ 3, 'బడ్స్ ప్రో' ను సైతం లాంచ్ చేసింది. స్నాప్‌డ్రాగన్ 8 జెనరేషన్ 3 చిప్‌సెట్, 7.6 అంగుళాల 120 హెట్జ్ ఏఎమ్ఓఎల్ఈడీ డిస్‌ప్లేతో కూడిన గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6 బేస్ వేరియంట్ (256 జీబీ ర్యామ్) ధర రూ.1,64,999. 512జీబీ రేటు రూ.1,76,999. ఒక టీబీ వేరియంట్ ధర రూ.2,00,999గా ఉంది. గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 6లో 256జీబీ వేరియంట్ ధరను కంపెనీ రూ.1,09,999గా నిర్ణయించింది. తన కొత్త ఉత్పత్తుల ప్రీ- బుకింగ్‌ను బుధవారం నుంచి ప్రారంభించిన సామ్‌సంగ్.. ఈనెల 24 నుంచి విక్రయాలు ప్రారంభమవుతాయని వెల్లడించింది.

మార్కెట్లో లాభాల స్వీకరణ

80000 దిగువకు సెన్సెక్స్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం సరికొత్త గరిష్ఠాల వద్ద ట్రేడింగ్ ఆరంభించినప్పటికీ ఇన్వెస్టర్లు మెటల్, ఐటీ, ఆటో షేర్లలో పెద్దఎత్తున లాభాల స్వీకరణకు దిగడంతో భారీగా నష్టపోయాయి. ఫెడ్ రేట్ల తగ్గింపుపై అనిశ్చితి పెరగడం కూడా మార్కెట్లో ట్రేడింగ్ సెంటిమెంట్‌ను బలహీనపరిచింది. సెన్సెక్స్ 129.72 పాయింట్ల లాభంతో సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయి 80,481.36 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. భారీగా ప్రాఫిట్ బుకింగ్ జరగడంతో సూచీ ఒకదశలో 915.88 పాయింట్లు క్షీణించి 79,435.76 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఆఖరి గంటలో జరిగిన కొనుగోళ్లతో సూచీ కాస్త కోలుకున్నప్పటికీ, 426.87 పాయింట్ల నష్టంతో 79,924.77 వద్ద ముగిసింది. దాంతో సూచీ 80,000 కీలక స్థాయిని చేజార్చుకున్నట్లైంది. నిఫ్టీ సైతం సరికొత్త రికార్డు స్థాయి 24,461.05 వద్ద ట్రేడింగ్‌ను ఆరంభించినప్పటికీ.. ఒకదశలో 291.4 పాయింట్లు పతనమైంది. చివరికి 108.75 పాయింట్ల నష్టంతో 24,324.45 వద్ద స్థిరపడింది.

- అమ్మకాల హోరులో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1.22 లక్షల కోట్లు తగ్గి రూ.450.05 లక్షల కోట్లకు (5.39 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. ఉదయం సెషన్‌లో సూచీల భారీ నష్టాల కారణంగా మార్కెట్ క్యాప్ కూడా 7 లక్షల కోట్ల వరకు పతనమైంది.

అదానీ కంపెనీలో అంబానీకి వాటా

న్యూఢిల్లీ: భారత కుబేరుడు ముకేశ్ అంబానీ.. రెండో అత్యంత ధనికుడైన గౌతమ్ అదానీ కంపెనీలో స్వల్ప వాటాను చేజిక్కించుకున్నారు. అదానీ పవర్ లిమిటెడ్ అనుబంధ విభాగమైన మహాన్ ఎనర్జెన్ లిమిటెడ్‌లో (ఎంఈఎల్) 5 కోట్ల షేర్లను రూ.50 కోట్లకు అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ కొనుగోలు చేసింది. తద్వారా ఎంఈఎల్‌లో రిలయన్స్‌కు 26 శాతం వాటా దక్కింది. ఈ డీల్‌లో భాగంగానే రెండు కంపెనీల మధ్య 20 ఏళ్ల కాలానికి పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ కుదిరింది. ఎంఈఎల్‌కు మధ్యప్రదేశ్‌లో ఉన్న 600 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్.. రిలయన్స్‌కు పారిశ్రామిక అవసరాల కోసం విద్యుత్ సరఫరా చేయనుంది.

గ్లెన్‌మార్క్ లైఫ్ సైన్సెస్ నుంచి వైదొలగనున్న గ్లెన్‌మార్క్ ఫార్మా

గ్లెన్‌మార్క్ లైఫ్ సైన్సెస్‌లో తనకున్న 7.84 శాతం వాటా కూడా విక్రయించడం ద్వారా కంపెనీ నుంచి పూర్తిగా వైదొలగనున్నట్లు గ్లెన్‌మార్క్ ఫార్మా బుధవారం వెల్లడించింది. ఈనెల 11, 12 తేదీల్లో ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన ఈవాటా షేర్లను, ఒక్కొక్కటీ రూ.810 చొప్పున విక్రయించనున్నట్లు తెలిపింది. అనగా, ఈ డీల్ విలువ రూ.778 కోట్లుగా ఉండనుంది.



కెనరా బ్యాంక్ రూ.1838 కోట్ల డివిడెండ్

బెంగళూరు: ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కె.సత్యనారాయణ రాజు 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.1838 కోట్ల చెక్కును కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు అందచేశారు. ఇది బ్యాంకు ఆర్థిక స్వస్థతలోని శక్తికి, వాటాదారుల సొమ్ముకు విలువ కల్పించడంలో కట్టుబాటుకు దర్పణం పడుతుందని ఈ సందర్భంగా రాజు అన్నారు.

మరో మూడు బ్యాంకులు కూడా...

మరో మూడు బ్యాంకులు కూడా ఆర్థికమంత్రికి డివిడెండు చెక్కులు అందచేశాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) మేనేజింగ్ డైరెక్టర్ దేవదత్త చంద్ రూ.2514.22 కోట్ల చెక్కును అందచేశారు. ఇండియన్ బ్యాంక్ రూ.1193.45 కోట్లు, బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.935.44 కోట్లు డివిడెండ్‌గా చెల్లించాయి. వీటితో పాటు ఎగ్జిమ్ బ్యాంక్ కూడా రూ.252 కోట్ల చెక్కు అందించింది.

హైదరాబాద్‌లో మెడ్‌ట్రానిక్స్ గ్లోబల్ ఐటీ సెంటర్

హైదరాబాద్: మెడికల్ టెక్నాలజీ రంగంలోని మెడ్‌ట్రానిక్స్ హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను (ఎంఈఐసీ) ప్రారంభించింది. తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి డి.శ్రీధర బాబు, అమెరికన్ కాన్సల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, కంపెనీ సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాబోయే మూడు నుంచి ఐదు సంవత్సరాల కాలంలో ఈ సెంటర్‌పై 6 కోట్ల డాలర్లు ఇన్వెస్ట్ చేయనున్నామని కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, సీఐఓ రష్మీ కుమార్ తెలిపారు.

ఎస్‌బీఐ రూ.10 వేల కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బాండ్ల ద్వారా రూ.10,000 కోట్లు సమీకరించినట్లు ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ బుధవారం వెల్లడించింది. 15 ఏళ్ల కాల పరిమితితో కూడిన ఈ బాండ్లపై ఏటా రూ.7.36 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. మౌలిక సదుపాయాలు, అందుబాటు గృహాల నిర్మాణ రంగ సంస్థలకు దీర్ఘకాలిక రుణాలందించేందుకు ఈ నిధులను వినియోగించనున్నట్లు ఎస్‌బీఐ స్పష్టం చేసింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,250 ▲	67,200 ▲	98,500 ▼
ముంబై	72,620 ▲	66,520 ▲	91,790 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

11వ తేదీ			
హైదరాబాద్	530	విజయవాడ	555
వరంగల్	532	గోదావరి	555
చిత్తూరు	573	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	105	విజయవాడ	113
వరంగల్	105	గుంటూరు	113
కరీంనగర్	105	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	129
కర్నూలు	105	నెల్లూరు	129
విశాఖపట్నం	105	అనంతపురం	113
గోదావరి	113		

వచ్చే మార్చి నాటికి 50 స్టోర్లు టార్గెట్

- రివర్ ఈవీ సీఈఓ అరవింద్ మణి




హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విద్యుత్ స్కూటర్ల తయారీ సంస్థ రివర్ వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో 50 స్టోర్ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం బెంగళూరులో రెండు స్టోర్లు నిర్వహిస్తున్న ఆ కంపెనీ బుధవారం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో తొలి స్టోర్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా కంపెనీ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ అరవింద్ మణి మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఈవీలకు మంచి డిమాండు ఉన్నదని, అందుకే బెంగళూరు వెలుపల తొలి స్టోర్‌ను ఇక్కడ ప్రారంభించామని చెప్పారు. ఈ సందర్భంగా 30 స్కూటర్లను కస్టమర్లకు అందించామని ఇక్కడ 500 ఈవీలకు ఆర్డర్ చేతిలో ఉన్నదని తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న స్టోర్లలో మరో మూడు హైదరాబాద్‌లో ఉంటాయని, అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, విజయవాడ, విశాఖపట్టణం నగరాల్లో కూడా స్టోర్లు ప్రారంభించాలనుకుంటున్నామని తెలిపారు. తమ విద్యుత్ స్కూటర్ ఇండీ ఎక్స్ షోరూమ్ ధర హైదరాబాద్‌లో రూ..1,38,000 అని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం బెంగళూరులో తమ ఫ్యాక్టరీ ఉన్నదంటూ, 2026 నాటికి మరో ఫ్యాక్టరీ ఏర్పాటు చేసే యోచన ఉన్నదని, అందుకోసం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా కొన్ని రాష్ట్రాలు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు.

టాటా, మహీంద్రా ఎస్‌యూవీ ధరలు తగ్గింపు

న్యూఢిల్లీ: డిమాండును ఉద్దీపింపచేయడం కోసం టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా వివిధ ఎస్‌యూవీల ధరను తగ్గించాయి. తమ ప్రధాన ఎస్‌యూవీల్లో హారియెర్ ప్రారంభ ధరను రూ.14.99 లక్షలకు, సఫారీ ధరను రూ.15.49 లక్షలకు తగ్గించడంతో పాటు వివిధ ఎస్‌యూవీ వేరియెంట్లపై రూ.1.4 లక్షల మేరకు అదనపు ప్రయోజనాలు అందిస్తున్నట్టు టాటా మోటార్స్ తెలిపింది. మహీంద్రా ఎక్స్‌యూవీ 700 ఎX7 ధరను రూ.2 లక్షల మేరకు తగ్గించడంతో ఇప్పుడది రూ.19.49 లక్షలకు దిగివచ్చింది.

స్పోర్ట్స్



గంభీర్ 'ప్యాకేజీ' ఎంత?

న్యూఢిల్లీ: ఈనెలలో జరిగే శ్రీలంక పర్యటన నుంచి భారత జట్టు కొత్త కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు చేపట్టనున్నాడు. అయితే జీతభత్యాలకు సంబంధించి గంభీర్, బీసీసీఐ ఇంకా ఓ నిర్ణయానికి రాలేదని తెలిసింది. 'ప్యాకేజీ'కంటే కూడా రాబోయే మూడేళ్లలో తనకు ఎదురవనున్న సవాళ్లు, వాటిని అధిగమించే క్రమంలో ఏర్పాటు చేసుకోవాల్సిన సహాయ సిబ్బందిపైనే గౌతీ ప్రస్తుతం దృష్టి సారించినట్టు సమాచారం. గంభీర్‌ను టీమిండియా హెడ్ కోచ్‌గా నియమిస్తున్నట్టు బీసీసీఐ కార్యదర్శి జై షా మంగళవారం ప్రకటించిన విషయం విదితమే. గంభీర్ శాలరీ ఎంతో ఇతమిత్థంగా ఖరారు కాకున్నా..అతడికి ముందు పనిచేసిన రవిశాస్త్రి, ద్రవిడ్‌లు మాదిరే ఉండనున్నట్టు బోర్డు వర్గాలు వెల్లడించాయి. ఇక..తన సహాయ సిబ్బందిగా అభిషేక్ నాయర్ (అసిస్టెంట్ కోచ్), ఎల్. బాలాజీ లేదా వినయ్ కుమార్ (బౌలింగ్ కోచ్), మునీష్ బాలి (ఫీల్డింగ్ కోచ్)ని గంభీర్ ఎంపిక చేసుకోనున్నట్టు సమాచారం. మునీష్ ప్రస్తుతం మహిళల జట్టు ఫీల్డింగ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు.

కుర్రాళ్లు.. అదే జోరు

వరుసగా రెండో విజయం
- రాణించిన గిల్, రుతురాజ్
- తిప్పేసిన సుందర్
- మూడో టీ20లో జింబాబ్వే చిత్తు



గిల్ (49 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 66)



వాషింగ్టన్ సుందర్ (4-0-15-3)

హరారే: సమష్టిగా రాణించిన భారత యువ జట్టు.. జింబాబ్వే టూర్‌లో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. శుభ్‌మన్ గిల్ (49 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 66), రుతురాజ్ గైక్వాడ్ (28 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 49) బ్యాట్‌తో అదరగొట్టగా.. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' వాషింగ్టన్ సుందర్ (4-0-15-3) బంతితో ప్రత్యర్థి వెన్నువిరిచాడు. ఫలితంగా బుధవారం జరిగిన మూడో టీ20లో భారత్ 23 పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. 5 టీ20ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యం సాధించింది. ఇరుజట్ల మధ్య నాలుగో మ్యాచ్ శనివారం జరగనుంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 182/4 స్కోరు చేసింది. సికందర్ రజా, ముజరబాని చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (36), కెప్టెన్ గిల్ జట్టుకు శుభారంభాన్నిచ్చారు. టీ20 వరల్డ్‌కప్‌లో బెంచ్‌కే పరిమితమైన జైస్వాల్.. ఇక్కడ ఆరంభం నుంచే దూకుడైన బ్యాటింగ్ చేయడంతో పవర్‌ప్లే ముగిసేసరికి టీమిండియా 55/0తో మెరుగైన స్థితిలో నిలిచింది. అయితే, జైస్వాల్‌ను రజా క్యాచవుట్ చేయడంతో.. తొలి వికెట్‌కు 67 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. గత మ్యాచ్‌లో సెంచరీ సాధించిన అభిషేక్ శర్మ (10) ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. కానీ, ఆ తర్వాత వచ్చిన రుతురాజ్.. జింబాబ్వే బౌలర్ల పనిబట్టాడు. గిల్‌తో కలసి మూడో వికెట్‌కు 44 బంతుల్లో 72 పరుగుల భాగస్వామ్యంతో జట్టుకు భారీ స్కోరు అందించాడు. అర్థ శతకం సాధించిన గిల్‌తోపాటు గైక్వాడ్‌ను ముజరబాని పెవిలియన్ చేర్చాడు. అయితే, సంజూ శాంసన్ (12 నాటౌట్), రింకూ సింగ్ (1 నాటౌట్) జట్టు స్కోరును 180 మార్క్ దాటించారు. ఛేదనలో జింబాబ్వే ఓవర్లన్నీ ఆడి 159/6 స్కోరుకే పరిమితమైంది. అవేశ్ ఖాన్ (2/39), సుందర్ దెబ్బకు 7 ఓవర్లలో 39/5తో పీకల్లోతు కష్టాల్లోపడ్డ జింబాబ్వేను డియాన్ మేయర్స్ (65 నాటౌట్) ఆదుకొనే ప్రయత్నం చేశాడు. క్లైవ్ మడండి (37)తో ఆరో వికెట్‌కు 77 రన్స్ జోడించిన మేయర్స్.. మసకద్జా (18 నాటౌట్) జతగా 43 పరుగుల భాగస్వామ్యంతో చివర్లో పోరాడాడు. ప్రపంచకప్ జట్టు సభ్యులు జైస్వాల్, శాంసన్, దూబే జట్టులోకి రావడంతో.. జితేష్, పరాగ్, సుదర్శన్ బెంచ్‌కే పరిమితం కావాల్సి వచ్చింది.

స్కోరుబోర్డు

భారత్: జైస్వాల్ (సి) బ్రయన్ (బి) రజా 36, గిల్ (సి) రజా (బి) ముజరబాని 66, అభిషేక్ (సి) మరుమణి (బి) రజా 10, రుతురాజ్ (సి) మధెవెరె (బి) ముజరబాని 49, శాంసన్ (నాటౌట్) 12, రింకూ సింగ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు: 8; **మొత్తం: 20 ఓవర్లలో 182/4; వికెట్ల పతనం:** 1-67, 2-81, 3-153, 4-177; **బౌలింగ్:** బెన్నెట్ 1-0-15-0, ఎన్‌గరవ 4-0-39-0, చతారా 3-0-30-0, ముజరబాని 4-0-25-2, రజా 4-0-24-2, మసకద్జా 3-0-25-0, మధెవెరె 1-0-19-0.

జింబాబ్వే: మధెవెరె (సి) అభిషేక్ (బి) అవేశ్ 1, మరుమణి (సి) దూబే (బి) ఖలీల్ 13, బెన్నెట్ (సి) బిష్ణోయ్ (బి) అవేశ్ 4, మేయర్స్ (నాటౌట్) 65, రజా (సి) రింకూ (బి) సుందర్ 15, క్యాంప్‌బెల్ (సి/సబ్) పరాగ్ (బి) సుందర్ 1, క్లైవ్ మడండి (సి) రింకూ (బి) సుందర్ 37, మసకద్జా (నాటౌట్) 18, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 20 ఓవర్లలో 159/6; వికెట్ల పతనం:** 1-9, 2-19, 3-19, 4-37, 5-39, 6-116; **బౌలింగ్:** ఖలీల్ 4-0-15-1, అవేశ్ 4-0-39-2, బిష్ణోయ్ 4-0-37-0, సుందర్ 4-0-15-3, అభిషేక్ 2-0-23-0, దూబే 2-0-27-0.

దటీజ్ ద్రవిడ్!

2.50 కోట్లు చాలు

నజరానాలో సగం తగ్గించుకున్న మాజీ కోచ్



న్యూఢిల్లీ: *తానాడే రోజుల్లో 'జెంటిల్మన్'గా ప్రశంసలందుకున్న క్రికెటర్ రాహుల్ ద్రవిడ్. రిటైరై కోచ్‌గా కొనసాగిన తర్వాతా అదే శైలిని కొనసాగించి దటీజ్ ద్రవిడ్ అనిపించుకున్నాడు. టీ20 ప్రపంచ కప్ విజేతగా నిలిచిన టీమిండియాకు బీసీసీఐ ప్రకటించిన రూ. 125 కోట్ల నజరానాలో హెడ్ కోచ్‌గా ద్రవిడ్ రూ. 5 కోట్లు అందుకోవాల్సి ఉంది. ఇక బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లకు రూ. 2.50 కోట్ల చొప్పున బోనస్‌గా ఖరారు చేశారు. అయితే బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లతో సమానంగా తనకు రూ. 2.50 కోట్లు చాలని బీసీసీఐకి ద్రవిడ్ తెలియజేశాడు. తద్వారా తన వ్యక్తిత్వాన్ని అతడు చాటుకున్నాడు. 2018లోనూ ద్రవిడ్ ఇలాంటి నిర్ణయమే తీసుకున్నాడు. ఆ ఏడాది భారత జట్టు అండర్-19 ప్రపంచ కప్ గెలుచుకుంది. అప్పట్లో యువ జట్టు కోచ్‌గా ద్రవిడ్‌కు రూ. 50 లక్షల రివార్డు ప్రకటించారు. ఇతర సహాయ సిబ్బందికి రూ. 20 లక్షల చొప్పున, క్రికెటర్లకు రూ. 30 లక్షల చొప్పున ప్రకటించారు. అయితే తనకు, ఇతర సహాయ సిబ్బందికి బోనస్ విషయంలో భేదం వద్దని ద్రవిడ్ అప్పుడు కూడా బోర్డుకు స్పష్టంజేశాడు. దాంతో బోనస్‌ను సవరించిన బీసీసీఐ.. ద్రవిడ్ సహా సహాయ సిబ్బందిలో ఒక్కొక్కరికి రూ. 25 లక్షలు అందజేసింది. ఇదీ ద్రవిడ్ వ్యక్తిత్వం అంటూ క్రికెట్ ఫ్యాన్స్, నెటిజన్లు అతడికి జేజేలు పలుకుతున్నారు.*



రాష్ట్రపతి భవన్‌లో బుధవారం షట్లర్ సైనా నెహ్వాల్‌తో కలిసి బ్యాడ్మింటన్ ఆడుతున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

జొకో మరో అడుగు

సెమీఫైనల్లో సెర్బియా స్టార్ ● రిబకినాతో క్రెజికోవా ఢీ



వింబుల్డన్

లండన్: ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ ట్రోఫీని ఎనిమిదోసారి అందుకొనే దిశగా వెటరన్ స్టార్ నొవాక్ జొకోవిచ్ మరో అడుగు వేశాడు. ఈ సెర్బియా వీరుడు పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో అడుగుపెట్టాడు. 9వ సీడ్ అలెక్స్ డిమినార్‌తో జొకో క్వార్టర్‌ఫైనల్లో తలపడాల్సి ఉంది. అయితే తుంటి గాయంతో ఆస్ట్రేలియా ఆటగాడు డిమినార్ మ్యాచ్‌కు ముందే వైదొలిగాడు. దాంతో 25వ సీడ్ ముస్సేటితో శుక్రవారం జరిగే సెమీస్‌లో జొకో తలపడతాడు. మరో క్వార్టర్స్‌లో ముస్సేటి 3-6, 7-6(5), 6-2, 3-6, 6-1తో 13వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్‌ను కంగుతినిపించాడు. మహిళల సింగిల్స్‌లో 4వ సీడ్ ఎలెనా రిబకినా, 31వ సీడ్ క్రెజికోవా సెమీస్‌లో అమీతుమీకి సిద్ధమయ్యారు. క్వార్టర్‌ఫైనల్స్‌లో రిబకినా 6-3, 6-2తో 21వ సీడ్ స్విటోలినాను చిత్తు చేయగా, క్రెజికోవా 6-4, 7-6 (4)తో 13వ సీడ్ ఒస్టాపెంకోకు షాకిచ్చింది. మహిళల మరో సెమీఫైనల్లో అన్‌సీడెడ్ డొనా వెకిక్, 7వ సీడ్ జాస్మిన్ పౌలినీ తలపడతారు.

అట్కిన్సన్ విజృంభణ

- వెస్టిండీస్ 121 ఆలౌట్

లార్డ్స్: ఇంగ్లండ్ పేసర్ గస్ అట్కిన్సన్ అరంగేట్ర టెస్ట్‌లోనే అదరగొట్టాడు. అతడు ఏడు (7/45) వికెట్లతో చెలరేగడంతో ఇంగ్లండ్‌తో బుధవారం మొదలైన తొలి టెస్ట్‌లో వెస్టిండీస్ 121 రన్స్‌కే కుప్పకూలింది. మికైల్ (27), కావెమ్ హాడ్జ్ (24), అథనజె (23) మోస్తరుగా ఆడారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన ఇంగ్లండ్ తొలి రోజు ఆట ముగిసేసరికి 3 వికెట్లకు 189 రన్స్ చేసింది. క్రాలే (76), పోప్ (57) అర్ధసెంచరీలు చేశారు. రూట్ (15), బ్రూక్ (25) క్రీజులో ఉన్నారు.

'పారిస్'లో బ్యాడ్మింటన్ బృందానికి మెంటార్‌గా ప్రకాశ్ పడుకోన్

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడే భారత బ్యాడ్మింటన్ బృందానికి లెజెండరీ షట్లర్ ప్రకాశ్ పడుకోన్ మెంటార్‌గా వ్యవహరించనున్నాడు. దీంతో ప్రకాశ్ కూడా జట్టు వెంట పారిస్ వెళ్తాడని భారత బ్యాడ్మింటన్ సమాఖ్య బుధవారం తెలిపింది.



భళా.. అర్జెంటీనా

- కోపా కప్ తుదిపోరుకు మెస్సీసేన
- సెమీస్‌లో కెనడాపై 2-0తో గెలుపు

ఈస్ట్ రూథర్‌ఫర్డ్ (యూఎస్): కోపా అమెరికా కప్ ఫుట్‌బాల్‌లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా టైటిల్ నిలబెట్టుకునేందుకు అడుగుదూరంలో నిలిచింది. బుధవారం తెల్లవారుజామున జరిగిన సెమీఫైనల్లో మెస్సీ బృందం 2-0తో కెనడాను చిత్తుచేసి ఫైనల్‌కు దూసుకెళ్లింది. కెప్టెన్ మెస్సీ 51వ నిమిషంలో గోల్ కొట్టి తన జట్టును గెలిపించాడు. మెస్సీకిది కెరీర్‌లో 109వ అంతర్జాతీయ గోల్. అంతకుముందు అల్వారెజ్ (22వ) జట్టుకు తొలి గోల్ అందించాడు. గత 9 ఎడిషన్లలో అర్జెంటీనాకు ఇది ఏడో ఫైనల్. ఉరుగ్వే, కొలంబియా మధ్య జరిగే రెండో సెమీస్ విజేతతో అర్జెంటీనా ఫైనల్లో తలపడనుంది.

ఫైనల్లో స్పెయిన్

ఫ్రాన్స్‌పై 2-1తో గెలుపు

యూరో కప్

మ్యూనిచ్: సూపర్ ఫామ్‌లో ఉన్న స్పెయిన్.. యూరో ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. మంగళవారం రాత్రి జరిగిన తొలి సెమీఫైనల్ పోరులో స్పెయిన్ 2-1తో ఫ్రాన్స్‌ను ఓడించింది. టోర్నీలో ఇంత వరకు ఒక్క ఫీల్డ్ గోల్ కూడా నమోదు చేయని ఫ్రెంచ్ జట్టు 9వ నిమిషంలోనే ఖాతా తెరిచి ప్రత్యర్థికి షాకిచ్చింది. ఎంబప్పే కొట్టిన క్రాస్‌ను రండల్ కోలో మువాని హెడర్ ద్వారా గోల్ చేయడంతో ఫ్రాన్స్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. వెంటనే తేరుకొన్న స్పెయిన్.. ఫ్రాన్స్ గోల్ పోస్టుపై దాడుల ఉధృతిని పెంచి ఫలితం సాధించింది. 21వ నిమిషంలో స్ట్రయికర్ లామిన్ యమల్ కళ్లు చెదిరే గోల్‌తో స్కోరు 1-1తో సమం చేసింది. దీంతో యూరో కప్ చరిత్రలో గోల్ చేసిన పిన్న వయస్కుడిగా 16 ఏళ్ల యమల్ రికార్డు సృష్టించాడు. ఇది జరిగిన నాలుగు నిమిషాలకే డాని ఓమ్లో మరో గోల్ చేసి స్పెయిన్‌ను 2-1 ఆధిక్యంలో నిలిపాడు. పెనాల్టీ ఏరియాలో ఓమ్లో కొట్టిన క్రాస్ ఫ్రాన్స్ డిఫెండర్ జులెస్ కాలికి తగిలి గోల్‌లో పడింది. దీన్ని తొలుత ఓన్ గోల్‌గా ప్రకటించినా.. ఆ తర్వాత ఓమ్లో పేరిట మార్చారు. ఇక, సెకండాఫ్‌లో ఇరుజట్లు గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించినా సఫలం కాలేకపోయాయి. చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకొన్న స్పెయిన్ అజేయంగా టైటిల్ ఫైట్‌కు చేరుకొంది.



ఎంబప్పే





www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



గురువారం | 11-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 103 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి ఉ. 10.04 తదుపరి షష్ఠి; నక్షత్రం: పుబ్బ మ. 1.04 తదుపరి ఉత్తర వర్జ్యం: రా. 9.11-10.59; దుర్ముహూర్తం: ఉ. 10.10-11.02 , మ. 3.22-4.14; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 5.51; సూర్యాస్తమయం: 6.49 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గరిష్ఠ పరిహారం!

జాతీయ రహదారులకు భూసేకరణలో మానవీయ కోణంతో వ్యవహరించండి

రైతులకు వీలైనంత ఎక్కువ మొత్తం దక్కేలా చూడండి

వారితో కలెక్టర్లే నేరుగా మాట్లాడాలి.. ఆర్‌ఆర్‌ఆర్ మొత్తానికి ఒకే నంబరు

వెంటనే త్రైపాక్షిక ఒప్పందం చేసుకోండి

ప్రత్యామ్నాయ భూములిచ్చి అటవీ భూములు తీసుకోండి

జాతీయ రహదారులపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

'నాగ్‌పూర్-విజయవాడ'లో సర్వీస్ రోడ్లు, అండర్‌పాస్‌లు నిర్మించాలి: భట్టి

2 నెలల్లో 'హైదరాబాద్-విజయవాడ' విస్తరణ పనులు: ఎన్‌హెచ్‌ఏఐ

పద్మశ్రీ గ్రహీతలకు సీఎం సన్మానం..ఒక్కొక్కరికి 25 లక్షల చెక్కు అందజేత

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులకు భూమి సేకరించే విషయంలో మానవీయ కోణంతో వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. తరతరాలుగా భూమినే నమ్ముకొని బతుకుతున్న రైతులకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. పరిహారం విషయంలో రాజీ పడొద్దని సూచించారు. భూ సేకరణలో నిబంధనల ప్రకారం పరిహారం ఎంత ఎక్కువగా వస్తే, అంత మొత్తం రైతులకు దక్కేలా చూడాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు. భూములు కోల్పోయే రైతులతో కలెక్టర్లే నేరుగా మాట్లాడి, వారిని ఒప్పించాలని చెప్పారు. తెలంగాణలో 'జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)' పరిధిలో రహదారుల నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలపై బుధవారం సచివాలయంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రానికి మంజూరైన జాతీయ రహదారులకు భూ సేకరణ ఎందుకు ఆలస్యమవుతోందని సీఎం ప్రశ్నించారు. ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధరలు తక్కువగా ఉండడం, మార్కెట్ ధరలు ఎక్కువగా ఉండడంతో భూములిచ్చేందుకు రైతులు ముందుకు రావడం లేదని కలెక్టర్లు తెలిపారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) దక్షిణ భాగం, ఉత్తర భాగాలకు ఒకే నంబరు కేటాయించాలని కేంద్ర మంత్రి గడ్కరీని కోరగా, సూత్రప్రాయంగా అంగీకరించారని రేవంత్ చెప్పారు. దానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ విషయంలో తొలుత రాష్ట్రం, కేంద్ర ప్రభుత్వం, ఎన్‌హెచ్‌ఏఐ మధ్య త్రైపాక్షిక ఒప్పందం

మిగతా 11వ పేజీలో...


సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కొత్త డీజీపీ జితేందర్

డీజీపీగా జితేందర్

హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రవిగుప్తా 9

సీవీ ఆనంద్‌కు విజిలెన్స్ అదనపు బాధ్యతలు

గంటల వ్యవధిలో 3 జీవోలు.. త్వరలో మరికొన్ని బదిలీలు

డ్రగ్స్, సైబర్ నేరాలపై ఉక్కుపాదం.. 'ఆంధ్రజ్యోతి'తో డీజీపీ

సెక్షన్ 125 కింద ముస్లిం మహిళలూ భరణానికి అర్హులే

సీఆర్పీసీలోని ఆ సెక్షన్ మతాలకు అతీతమైంది

భరణం దయతో ఇచ్చేది కాదు.. అది వివాహిత మహిళల హక్కు

చరిత్రాత్మక తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు

భార్య ఆర్థికంగా స్వతంత్రంగా ఉండాలి

ఆ బాధ్యత భర్తదే.. తన ఆర్థిక వనరులను ఆమెకు అందుబాటులో ఉంచాలి

ఉమ్మడి ఖాతా.. భార్యకు ఏటీఎం యాక్సెస్

తీర్పులో జస్టిస్ బీవీ నాగరత్న వ్యాఖ్యలు

1985 నాటి షాబానో కేసును గుర్తుచేసిన తీర్పు

ఆ తీర్పుకు భిన్నంగా 1986లో రాజీవ్ సర్కారు చేసిన చట్టం ఈ కేసులో వర్తించదని స్పష్టీకరణ



ముస్లిం మహిళల భరణానికి సంబంధించి సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పును వెలువరించింది! భర్త నుంచి భరణం కోరే హక్కును భార్యకు కల్పించే సీఆర్పీసీ సెక్షన్ 125 మతంతో సంబంధం లేకుండా వివాహితలందరికీ వర్తిస్తుందని.. ట్రిపుల్ తలాఖ్ ద్వారా చట్టవిరుద్ధంగా విడాకులు పొందిన ముస్లిం మహిళలు ఈ సెక్షన్ కింద భరణం కోరవచ్చని స్పష్టం చేసింది!! "భరణం.. వివాహితల హక్కు.. దాతృత్వం కాదు" అని తేల్చిచెప్పింది. ఈ సెక్షన్ కింద భరణం కోరే హక్కు ముస్లిం మహిళలకు కూడా ఉందంటూ 1985లో సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వగా.. కొందరు సంప్రదాయవాదుల ఒత్తిళ్లకు లొంగిపోయి 1986లో రాజీవ్‌గాంధీ సర్కారు ఆ తీర్పునకు భిన్నంగా ముస్లిం మహిళల భరణానికి సంబంధించి ఒక చట్టం తెచ్చిన సంగతి తెలిసిందే. ఆ చట్టం ప్రకారం మాత్రమే ముస్లిం మహిళలు భరణం కోరాలనే వాదనను సుప్రీంకోర్టు తన తాజా తీర్పులో తోసిపుచ్చింది. సీఆర్పీసీలోని లౌకికమైన, మతపరంగా తటస్థమైన సెక్షన్ 125ను ఈ కేసులో ఆ చట్టం ప్రభావితం చేయలేదని తేటతెల్లం చేసింది.

న్యూఢిల్లీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): భర్త నుంచి భరణం కోరే హక్కును భార్యకు ఇచ్చే సీఆర్పీసీ సెక్షన్ 125 దేశంలోని వివాహితలు అందరికీ మతాతీతంగా వర్తిస్తుందని తేల్చిచెప్పింది. 2019నాటి 'ముస్లిం విమెన్ (ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్ ఆన్ మ్యారేజ్) యాక్ట్‌కు విరుద్ధంగా.. ముమ్మారు తలాఖ్ చెప్పడం ద్వారా భార్యకు విడాకులు ఇస్తే.. భార్య ఆ చట్టంతోపాటు, ఈ సెక్షన్ ద్వారా కూడా భరణం కోరవచ్చని స్పష్టం చేసింది. తెలంగాణకు చెందిన మహ్మద్ అబ్దుల్ సమద్ అనే వ్యక్తి దాఖలు చేసిన అప్పీలుపై విచారణ జరిపి ఈ చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. అబ్దుల్ సమద్ తన భార్యకు 2017లో ముస్లిం పర్సనల్ లా ప్రకారం విడాకులు ఇచ్చారు. దీంతో ఆమె.. సీఆర్పీసీ సెక్షన్ 125 కింద భర్తతో తనకు భరణం

మిగతా 10వ పేజీలో...



వీడియో కాన్ఫరెన్స్‌లో విచారణకు

హాజరవుతా

ఆరోగ్యం కుదుటపడే వరకు నేను స్వదేశానికి రాలేను 12

బీపీ, గుండె సమస్యలు పెరిగాయి

వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఉన్నా..

ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు

ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు చేస్తున్న అధికారులకు ఈ-మెయిల్

జడ్జి, కుటుంబ సభ్యుల పేర్లు ఎలా వెల్లడిస్తారు?

ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో మీడియా తీరుపై హైకోర్టు అభ్యంతరం 12



అనుసూయ.. ఇక అనుకతిర్ సూర్య

తన పేరును, లింగాన్ని పురుషుడిగా మార్చుకున్న మహిళా ఐఆర్‌ఎస్ అధికారి

దేశ సివిల్ సర్వీసెస్‌లోనే తొలిసారి

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): దేశ సివిల్ సర్వీసెస్ చరిత్రలో తొలిసారిగా.. ఓ ఐఆర్‌ఎస్ ఆఫీసర్ ప్రభుత్వ రికార్డుల్లో తన పేరును, లింగాన్ని మార్పించుకున్నారు. తమిళనాడులోని చెన్నైకి చెందిన 2013 బ్యాచ్ ఐఆర్‌ఎస్ ఆఫీసర్ ఎం.అనుసూయ.. కొంతకాలంగా హైదరాబాద్‌లోని 'కస్టమ్స్ ఎక్సైజ్ అండ్ సర్వీస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (సీఈఎస్‌టీఏటీ)' చీఫ్ కమిషనర్ కార్యాలయంలో జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఇకపై తనను పురుషుడిగా

మిగతా 10వ పేజీలో...

ప్రణీత్ హన్మంతు అరెస్ట్

బెంగళూరులో అదుపులోకి తీసుకున్న తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో 9

ఆదాయపన్ను చెల్లిస్తే 'మాఫీ' ఉండదు!

రాజకీయ నేతలు, ప్రభుత్వ ఉద్యోగులకు కూడా అంతే

చిన్న, సన్నకారు రైతులకే రుణమాఫీ

ఐటీ రిటర్నులు దాఖలు చేసినవారికీ పథకం వర్తింపు

రైతు రుణమాఫీ మార్గదర్శకాలపై కొనసాగుతున్న కసరత్తు

ముఖ్యమంత్రి కార్యాలయంలో ఐటీ చెల్లింపుదారుల జాబితా



హైదరాబాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ మార్గదర్శకాలపై కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఆదాయపు పన్ను చెల్లింపుదారులను, రాజకీయ నాయకులను, ప్రభుత్వ ఉద్యోగులను పథకం నుంచి మినహాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసే రైతులు, చిరు ఉద్యోగులకు మాత్రం రుణమాఫీ వర్తింపజేయాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో విధివిధానాలు ఖరారుచేసి, ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపారు. ఈ నివేదికలో పలురకాల ప్రతిపాదనలను వ్యవసాయశాఖ అధికారులు పొందుపరిచినట్లు సమాచారం. రాష్ట్రంలో ఆదాయ పన్ను చెల్లిస్తున్నవారు ఎంతమంది? పన్ను చెల్లించకపోయినా ఐటీ రిటర్నులు దాఖలు చేస్తున్నవారెందరు? అనే వివరాలకోసం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసిన విషయం విదితమే! ఆ వివరాలు ఢిల్లీ నుంచి

మిగతా 11వ పేజీలో...

పదెకరాల పరిమితి.. కౌలురైతుకూ భరోసా

ఐటీ రిటర్న్స్ దాఖలు చేసిన వారికి, రేషన్ కార్డు లేనివారికీ ఇవ్వాలి

రైతుభరోసా విధివిధానాలపై ఖమ్మం వర్క్‌షాప్‌లో రైతుల సూచనలు

అభిప్రాయ సేకరణ జరిపిన మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటి 11

అనాథలా మారిన హైదరాబాద్

జీహెచ్‌ఎంసీ, జలమండలిలో నిధుల లేమి

వీధి దీపాల ఏర్పాటుకైనా డబ్బులు లేవు

రేవంత్‌రెడ్డి పాలనలో ఇదీ పరిస్థితి

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శలు 12

రైల్వే ప్రాజెక్టుల ప్రగతిపై సమీక్ష



ఏ సమస్యకైనా చర్చలే పరిష్కారం



శాంతిస్థాపనకు మేం సహకరిస్తాం

ఆస్ట్రియా చాన్స్‌లర్ నెహామర్, ప్రధాని మోదీ సంయుక్త ప్రకటన 10

ఇరుదేశాల సంబంధాల బలోపేతానికి పటిష్ఠ ప్రణాళిక: మోదీ

రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి స్థాపనలో భారత కీలకం: నెహామర్



చిన్నారులు చనిపోతుంటే నిర్లక్ష్యమా?

వీధి కుక్కల దాడులపై నిపుణుల కమిటీ వేయండి: హైకోర్టు

జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ కాదు.. మురికివాడలపై దృష్టిపెట్టాలని వ్యాఖ్య

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడుల్లో ముక్కుపచ్చలారని చిన్నారులు చనిపోతుండడంపై హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు ఏం చర్యలు తీసుకోవాలన్న అంశంపై నిపుణుల కమిటీ వేయాలని రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీకి ఆదేశాలు జారీచేసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటే రాష్ట్రమంతటా పరిష్కారం లభించినట్లేనా? అని ప్రశ్నించింది. సామాన్యుల ఆవాసాలు, మురికివాడలపైనా దృష్టి పెట్టాలని సూచించింది. ఈ అంశాన్ని ఓ వ్యాజ్యంలా కాకుండా మానవీయకోణంలో చూడాల్సిన అవసరం ఉందని పేర్కొంది. గత ఏడాది ఫిబ్రవరి 19న

మిగతా 12వ పేజీలో...

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మాస్కోలో మోదీ

ప్రధానమంత్రి నరేంద్రమోదీ మూడోసారి అధికారం చేపట్టాక, తన తొలివిదేశీ పర్యటనకు ఇరుగుపొరుగుదేశాలను కాక, రష్యాను ఎంచుకున్నారు. ఈమారు ఆయన మన చిరకాల ఆప్తమిత్రదేశంలో తొలిగా కాలూనడం బాగున్నది కానీ, అందుకు ఆయన ఎంచుకున్న సమయం కొన్ని సమస్యలు తెచ్చిపెట్టింది. ప్రధాని మోదీపర్యటన ఉభయ దేశాల సంబంధాలను మరో దశకు తీసుకుపోయిన మాట వాస్తవం. ప్రపంచరాజకీయాలను ప్రభావితం చేసే పర్యటనగా దీనిని అభివర్ణిస్తూ, రష్యా విడుదల చేసిన సుదీర్ఘ ప్రకటన చూసినప్పుడు ఆ దేశం ఎంత సంతోషించిందో అర్థమవుతుంది.

రష్యాలో భారతప్రధాని ఉన్న సమయంలో, ఉక్రెయిన్ రాజధాని కీవ్ మీద రష్యా అమానుషమైన దాడి చేసింది. జూన్ 8న జరిగిన దాడుల్లో నలభైఐదుమందికి పైగా మరణించారు. ఓ పిల్లల ఆస్పత్రిమీద జరిగిన దాడి రష్యాను అప్రదిష్టపాల్జేసింది. ఈ అకృత్యానికి తాను కారణం కాదని, ఉక్రెయిన్ మిసైల్ విఫలం చెందినందువల్లే ఈ దారుణం జరిగిందని రష్యా దబాయించింది కానీ, రెండేళ్ళుగా రష్యా యుద్ధరీతులను గమని స్తున్నవారికి అందులో నిజానిజాలు తెలియకపోవు. డెబ్బయ్ ఐదేళ్ళక్రితం అమెరికా ప్రోద్బలం మేరకు ఆవిర్భవించిన 'నార్త్ అట్లాంటిక్ ట్రీటీ (నాటో)' కూటమి వజ్రోత్సవ సమావేశాలు వాషింగ్టన్‌లో మొదలవుతున్న నేపథ్యంలో, రష్యా అంత తీవ్రస్థాయిలో ఈ జూన్ 8 దాడులకు తెగబడిందని అంటారు. ఆ సమావేశంలో సభ్యదేశాలన్నీ ఉక్రెయిన్‌కు అందించాల్సిన దీర్ఘకాలిక సాయం, చేయాల్సిన న్యాయం గురించి చర్చించడంతో పాటు, ఏటా నలభైబిలియన్ డాలర్ల మిలటరీ సాయం గురించి నిర్ణయం తీసుకోవలసి ఉంది. మరోపక్కన అదేరోజు, ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ వార్సాలో పర్యటిస్తూ, పోలెండ్‌తో ఒక మహత్తర రక్షణ ఒప్పందాన్ని కుదర్చుకున్నారు. ఉక్రెయిన్ గగనతలంలోకి వచ్చిన రష్యా డ్రోన్లను, క్షిపణులకు కూల్చివేసేందుకు నాటో సభ్యదేశంగా పోలెండ్‌కు ఈ ఒప్పందం అధికారాన్నిస్తోంది. ఈ రెండు పరిణామాలమీదా రష్యా తన ఆగ్రహాన్ని, నిరసనను ఈ వైమానికదాడుల ద్వారా ప్రకటించిన సందర్భంలోనే ప్రధాని నరేంద్రమోదీ ఆ దేశంలో పర్యటించడం విశేషం. పౌర స్థావరాలమీద దాడులతో రష్యా తన దుర్మార్గాన్ని ప్రదర్శించిన ఈ సందర్భాన్ని, మోదీ పర్యటనను కలగలిపి ఉక్రెయిన్ అధ్యక్షుడు ఎంతో తెలివిగా వాడుకున్నారు. ధ్వంసమైన ఆస్పత్రి ఫోటోలను ట్విటర్‌లో పోస్టుచేస్తూ అతిపెద్ద ప్రజాస్వామ్యదేశాధినేత ఓ అత్యంత క్రూరుడైన నేరగాడిని ఆలింగనం చేసుకున్న ఆ ఘటన అంటూ పుతిన్-మోదీ ఆలింగనం దృశ్యాన్ని ఉటంకించారు. రష్యా– ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడానికి తెరవెనుక ఎటువంటి యత్నాలు జరుగుతున్నాయో తెలియదు కానీ, మోదీ పర్యటన ఆ శాంతియత్నాలకు తీవ్ర విఘాతమని జెలెన్‌స్కీ ఆక్షేపించారు.

రష్యాతో యుద్ధం మొదలైన తరువాత జెలెన్‌స్కీ భారతదేశాన్ని నేరుగా తప్పుబట్టడం ఇదే తొలిసారి. గతనెలలో స్విట్జర్లాండ్ ఆధ్వర్యంలో ఒక శాంతి సదస్సు జరిగినప్పుడు భారతదేశం నామమాత్రంగా ఓ చిన్న స్థాయి అధికారిని పంపి సంయుక్త ప్రకటనమీద సంతకం చేయడానికి కూడా నిరాకరించిన విషయం తెలిసిందే. ఆదినుంచీ ఈ యుద్ధం విషయంలో రష్యాను విమర్శించేందుకు భారతదేశం ఎన్నడూ సిద్ధపడలేదు. ఐక్యరాజ్యసమితిలో రష్యా వ్యతిరేక తీర్మానాల సందర్భంలో కూడా ఓటింగ్‌కు గైర్హాజరైంది. కానీ, అమెరికా తదితర పాశ్చాత్యదేశాల అహాన్ని సంతృప్తిపరచాల్సి వచ్చినప్పుడల్లా యుద్ధనీతి గురించి, సామాన్యుల ప్రాణాలపరిరక్షణగురించి, దేశ సార్వభౌమత్వం గురించి నాలుగుమాటలు అంటూండటం ఉన్నదే.

ఇప్పుడు పుతిన్-మోదీ గాఢాలింగనంపై ఉక్రెయిన్ అధ్యక్షుడు తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చిన నేపథ్యంలో, రష్యా అధ్యక్షుడితో మోదీ మరో నాలుగుమాటలు గట్టిగా చెప్పినట్టుగా భారతవిదేశాంగశాఖ కార్యదర్శి ప్రకటన తెలియచేస్తోంది. పిల్లల ఆస్పత్రిపై జరిగిన దాడిని ఖండించడం, పసిపిల్లలు బలికావడంమీద ఆవేదన వెలిబుచ్చడం, సమస్యకు పరిష్కారం చర్చలే తప్ప యుద్ధక్షేత్రం కాదని పునరుద్ఘాటించడం ఇత్యాదివి అనేకం అందులో ఉన్నాయి. సమస్యకు చర్చల ద్వారానే ముగింపు పలకాలి, అందుకు భారతదేశం తనవంతు సాయం చేయడానికి సిద్ధంగా ఉంది అని మోదీ అన్నప్పుడు పుతిన్ ఎంతో శ్రద్ధగా విన్నారట. యుద్ధానికి తెరదించేందుకు వీలుకల్పించే కొన్ని ఆసక్తికరమైన మార్గాలు ఈ చర్చల సందర్భంగా ముందుకు వచ్చాయనీ, సంక్షోభ నివారణకు మోదీ చేస్తున్న ప్రయత్నాలపట్ల పుతిన్ కృతజ్ఞతలు తెలియచేశారని కూడా వార్తలు వచ్చాయి. ఉక్రెయిన్ యుద్ధం ఆరంభమైన తరువాత రష్యాలో మోదీ కాలూనడం ఇదే తొలిసారి. ఈ పర్యటన ఆ యుద్ధం ముగింపు దిశగా ఉపకరిస్తే అంతకంటే సంతోషించాల్సిందేమీ లేదు.

రాహుల్ అన్నట్టు రామాలయ ఉద్యమం ఓడిందా?



సొంత ప్రతాపం కొంత ఉంటే, జబ్బలు ఎంత చరుచుకున్నా ఒక అందం. అరువు బలం మీద ఆధారపడి, అంతా తమ ప్రతాపం అంటేనే వికారం. మొదటికే మోసం వచ్చినా, మూడోసారి మహాప్రసాదమని మురిసిపోతున్న ప్రధాని మోదీ గురించి కాదు. ఉట్టిని మాత్రమే కొట్టి, స్వర్గం దక్కిందని సంబరపడుతున్న 'బాలక్' రాహుల్ గురించి. పొత్తు ఉంటే ఉండొచ్చు కానీ, అయోధ్యలో గెలిచింది తను కాదు, తన పార్టీ కాదు. అయినా, అద్వానీ ఆరంభించిన రామాలయ ఉద్యమాన్ని తాము అయోధ్యలో ఓడించామని రాహుల్ గాంధీ చెబుతున్నారు. అదే మాదిరిగా, ఇంకో మూడేళ్లలో గుజరాత్‌లో కూడా బీజేపీని ఓడిస్తామని సవాల్ చేస్తున్నారు. ఉద్యమ స్థలంలో గెలిచినట్టే, మోదీ స్వరాష్ట్రంలోనూ గెలుస్తామని ఆయన ఉద్దేశం కావచ్చు. గుజరాత్‌లో ఆ కర్తవ్యం నెరవేర్చే మిత్రపక్షమేదో?

అయోధ్యలో సమాజ్ వాదీ పార్టీ అభ్యర్థి అవదేశ్ సింగ్ పాసీ విజయం నిస్సందేహంగా ఒక విశేషమే. ఉధృతంగా ఉన్న భావావేశాన్ని కాదని, నిత్యజీవన సమస్యలు పైచేయి అయిన ఎన్నిక అది. ఒక వైచిత్రి, జనరల్ సీటులో ఒక దళిత అభ్యర్థి, సవర్ణ ప్రత్యర్థులను ఓడించి గెలవడంలో ఒక కవితా న్యాయం కూడా ఉండవచ్చు. కానీ, అయోధ్య అన్నది రామాలయ ఉద్యమంలో కీలకమయిన స్థలం, గమ్యం తప్ప, అదే సర్వస్వం కాదు. రామజన్మభూమి ఉద్యమం అన్నది ఒక ప్రయాణం. సుమారు నాలుగుదశాబ్దాల ప్రయాణం. దాదాపు దేశమంతటా, ఆ ప్రయాణం సాగింది. దాని ప్రభావాలు, పర్యవసానాలు దేశమంతటికీ వ్యాపించి ఉన్నాయి. అయోధ్యలో బీజేపీ ఓడిపోయినంత మాత్రాన, ఆ ఉద్యమం ఓడినట్టు కాదు.

ఆ ఉద్యమ ప్రభావం రాజకీయరంగంలో ఇంతకు మునుపులా ఉండకపోవచ్చు. క్షీణించవచ్చు. లేదా, అది సాధించదలచుకున్న ఫలితాలు సాధించుకున్నది కనుక, అందులో నుంచి రాగలిగిన ఫలసాయం అందింది కనుక, ఇకపై అది ఒక జ్ఞాపకంగా మాత్రమే మిగిలిపోవచ్చు. భావావేశాలు ఉపశమించవచ్చును కానీ, భావాలు మిగిలే ఉంటాయి, లోలోపలికి ఇంకి ఉంటాయి. సమాజం ఆలోచనల్లో, ఎంపికల్లో, వ్యవహారసరళిలో అవి పనిచేస్తూనే ఉంటాయి. రేపు, మథుర, కాశీ స్థలాల్లో అదే రకమైన ప్రయత్నాలు మొదలయితే, అయోధ్య జ్ఞాపకం కూడా దానికి ప్రేరణ అవుతుంది.

ఒకనాటి ఘనభారతం మధ్యయుగాలలో విదేశీయుల, ముఖ్యంగా ముస్లిముల, ఆక్రమణలకు లోనై భంగపడిందని, ఆ కుంగుబాటు నుంచి హిందువులను ఆత్మవిశ్వాసంలోకి ఉద్ధరించాలని, స్వాతంత్ర్యానంతరం పాలించిన ప్రభుత్వాలు అనుసరించిన విధానాలు విమత, విజాతి శ్రేణులను బుజ్జగిస్తూ వచ్చాయని, మతజాతీయత నిర్మాణం ద్వారా ధర్మాన్ని, దేశాన్ని పటిష్ఠం చేయాలని విశ్వసించే ఆలోచనల, ఆచరణలలో భాగమే రామమందిర ఉద్యమం. బాబ్రీమసీదు విధ్వంసం కానీ, ఆ స్థలంలో నిర్మితమైన నూతన రామాలయం కానీ గాయపడిన జాతిగౌరవానికి జరిగిన ప్రతిన్యాయంగా ఆ ఉద్యమ శ్రేణులు భావిస్తాయి. బాబర్ ద్వారా ఒకనాటి రామజన్మభూమి ఆలయం ధ్వంసమైందన్న వివాదం చరిత్రకు, పురాతత్వ శాస్త్రానికి సంబంధించినది. కాగా, ఆధునిక కాలంలో వలస ఆలోచనావిధానం, సామ్యవాదులు, ఉదారవాదుల వల్ల భారతీయ భావధార, సంస్కృతి అణగారిపోతున్నాయని, విమతస్థుల నుంచి మెజారిటీ మతస్థులకు ప్రమాదం పొంచి ఉన్నదని తీవ్ర జాతీయవాదం అనుకుంటుంది. ఈ చారిత్రక, సమకాలిక కథనాలు సమన్వయంతో సాగి, ఆ ఆలోచనలకు విస్తృతమైన మద్దతు కూడగట్టాయి. ఇంకా అనేక ఇతర అనుబంధ కారణాలు కూడా పనిచేసి, 1984లో రెండు లోక్‌సభ స్థానాలు మాత్రమే గెలుచుకున్న బీజేపీని, 2014లో 282 స్థానాల విజయానికి చేర్చింది. ఇప్పుడు ఈ స్థానాలు దిగువకు పడిపోయినంత మాత్రాన, దేశమంతటా ప్రజలలో జీర్ణించుకుపోయిన ఆలోచనలు పలచబడినట్టు కాదు.

> బీజేపీ సొంతంగా మెజారిటీ దక్కించుకోలేకపోయిందన్న విషయానికి రాహుల్ కొంతకాలం విశ్రాంతి ఇవ్వడం మంచిది. దాని మీద ఇప్పటికే చాలా మాట్లాడారు. ఇక చాలు. కాంగ్రెస్, ఇండియా కూటమిలోని ఇతర పక్షాలు, ఈ ఎన్నికల్లో నిరూపించిన విషయమేమిటంటే, నరేంద్రమోదీని బలహీనపరచడం అసాధ్యమేమీ కాదని. తన విజయం బేషరతుదేమీ కాదని, తాను అజేయుడేమీ కాదని నరేంద్రమోదీ కూడా తెలుసుకునే ఉంటారు. తమ విజయాలను మరింత ముందుకు తీసుకుపోవడానికి ప్రతిపక్ష కూటమి, తన అపజయాన్ని అధిగమించడానికి మోదీ ప్రయత్నించాలి.

లౌకిక వాదం అంటే చెరో బుజ్జగింపు, చెరొక బెదిరింపు అని కాంగ్రెస్ అప్పటికీ ఇప్పటికీ నమ్ముతుంది. షాబానో కేసులో ముస్లిం మతవాద, సామాజిక ఛాందసులను మెప్పించడానికి చట్టసవరణ చేసిన రాజీవ్ గాంధీ, దానికి సమతూకం కింద నిద్రావస్థలో ఉన్న అయోధ్య వివాదాన్ని నిద్రలేపారు. రామాలయ ఉద్యమానికి ఘనతను అద్వానీకి ఇచ్చారు కానీ, రాహుల్ తండ్రికి కూడా ఆ కీర్తిలో వాటా ఉంది. 1986 నుంచి మొదలై, కరసేవలు, రథయాత్రలు, ప్రభుత్వ పతనాలు, కూల్చివేతలు, కోర్టు కేసులు, పేలుళ్లు, ఘర్షణలు, రైలుబోగీ దగ్ధాలు, దారుణ ఊచకోతలు, ఈ వివాదం దారిలో మైలురాళ్లుగా ఉన్నాయి. సుమారు నాలుగువేల మంది సంబంధిత హింసాకాండలో చనిపోయారు. ఇంతటి తగవునూ న్యాయస్థానాలు భూమి తగాదాగా భావించి, తోచిన విధంగా పరిష్కరించాయి. ఈ కల్లోల ప్రయాణం చివర రామాలయ నిర్మాణం ఒక పక్షానికి ఘన విజయమే. ఒక ఆరాటం నెరవేరింది. పోరాటం ముగిసింది. ఫైజాబాద్ ఎన్నికలో బీజేపీ గెలవనంత మాత్రాన, ఉద్యమమే ఓడిపోయిందని ఎట్లా అంటారు?

రాహుల్ గాంధీ ఏదో పొరపాటు మాట్లాడాడని కాదు, పొరపాటు అవగాహనతో ఉన్నారన్నది సమస్య ఎన్నికల విజయాలు, సైద్ధాంతిక విజయాలని, తాము అధికారంలోకి రావడమే ప్రజలకు విముక్తి అని ఆయన అనుకుంటే, ఇప్పుడు పెరుగుతున్న జనాభిమానం ఎంతో కాలం నిలవదు. కొద్దిపాటి విజయాలనే, అతిగా ఊహించుకుని ప్రగల్భించడం రాజకీయాలలో వివేకం అనిపించుకోదు. మోదీ పరివారం తనను 'పప్పు' అని గేలిచేసినప్పుడు, 'పప్పు' లాగా, ఇప్పుడు 'బాలకుడ'ని తీసిపారేస్తున్నప్పుడు, నిజంగానే బాల్యచాపల్యంతోను రాహుల్ గాంధీ ఉన్నారేమో అనిపిస్తోంది. పిల్లవాడేమీ కాదు, సాంకేతికంగా చూస్తే యువకుడూ కాదు, కానీ, రాహుల్ గాంధీలో పరవళ్లు తొక్కే ఉత్సాహం ఉన్నమాట నిజం. ఆ ఉత్సాహం కొన్నిసార్లు అత్యుత్సాహంగా వ్యక్తమై, వెక్కిరింతలకు ఆస్కారం ఇస్తోంది. బీజేపీ హేళనలు వినోదం కోసం రూపొందించినవి కావు. వాటి వెనుక చాలా అర్థముంది. అసమర్థుడని చెప్పడానికి పప్పు అన్న మాటను ఉపయోగించారు. ఇటీవలి రాహుల్‌ను చూశాక, ఆ మాటకు కాలం చెల్లిందని అర్థమైంది. అందుకని, కొత్తగా అపరిపక్వుడనే అర్థంలో 'బాలక్'ను ప్రయోగిస్తున్నారు. ఆయన ఆలోచనలు, మాటలు ఇట్లాగే కొనసాగితే, మోదీ కాదు, ప్రజలు కూడా ఆయనను బాలకుడనే అనుకుంటారు.

లోక్‌సభలో మాట్లాడుతూ, శివుడి బొమ్మను ప్రదర్శిస్తూ, సర్వమతాల్లోని అభయముద్ర గురించి వివరిస్తున్నప్పుడు, రాహుల్ గాంధీ ప్రయత్నం, తపన నచ్చినట్టుగా, అందులోని విషయం ఆకట్టుకోలేదు. మతాలకు, ముఖ్యంగా హిందూ మతానికి తాను వ్యతిరేకిని కాదని చెప్పుకోవడంతో పాటు, మతబోధనలలో నుంచి హింసాద్వేషాలను వ్యతిరేకించడమనే చట్రంలో ఆయన మాట్లాడారు. ఇంతగా ప్రయాసపడీ, ప్రసంగం చివరలో మాట్లాడిన మాటలు ప్రభుత్వపక్షానికి ఆయుధాలు అందించాయి. రాహుల్ తప్పుగా మాట్లాడారని కాదు. ప్రత్యక్ష ప్రసారాలు చూసినవారందరికీ తెలుసు, ఆయన హిందువులందరినీ హింసావాదులు అనలేదు. హిందువులమని చెప్పుకునే వారు, హింసను ఆచరిస్తున్నారంటూ, తాను ఆ మాటలను బీజేపీని, ఆర్ఎస్ఎస్‌ను దృష్టిలో పెట్టుకుని అంటున్నానని చెప్పారు. ప్రకటనలో వివాదం తొంగిచూస్తున్నప్పుడు, ఆ మాటల చివరలో ఉన్న వివరణను ఎవరు పట్టించుకుంటారు? రాహుల్ హిందువులను అందరినీ ఉద్దేశించి ఆ మాటలు అన్నారన్న వాదన బిగ్గరగా వినిపించసాగింది. అనుభవజ్ఞుడైన, పరిపక్వత కలిగిన నాయకుడు తప్పుగా మాట్లాడకపోవడమే కాదు, తప్పుగా వ్యాఖ్యానించడానికి ఆస్కారం కూడా ఇవ్వకూడదు. ఆ నాటి రాహుల్ ప్రసంగం దేశవ్యాప్తంగా చాలామందిని ఆకట్టుకుంది, కానీ, ఆ ఆకర్షణ ముందు తాము చిన్నబోకుండా, ఈ హింసావివాదం బీజేపీని రక్షించింది.



▪ కె. శ్రీనివాస్

సందర్భం

బీజేపీ సొంతంగా మెజారిటీ దక్కించుకోలేకపోయిందన్న విషయానికి రాహుల్ కొంతకాలం విశ్రాంతి ఇవ్వడం మంచిది. దాని మీద ఇప్పటికే చాలా మాట్లాడారు. ఇక చాలు. కాంగ్రెస్, ఇండియా కూటమిలోని ఇతర పక్షాలు, ఈ ఎన్నికల్లో నిరూపించిన విషయమేమిటంటే, నరేంద్రమోదీని బలహీనపరచడం అసాధ్యమేమీ కాదని. తన విజయం బేషరతుదేమీ కాదని, తాను అజేయుడేమీ కాదని నరేంద్ర మోదీ కూడా తెలుసుకునే ఉంటారు. తమ విజయాలను మరింత ముందుకు తీసుకుపోవడానికి ప్రతిపక్ష కూటమి, తన అపజయాన్ని అధిగమించడానికి మోదీ ప్రయత్నించాలి. ఎవరు పొరపాట్లు చేసినా, అవి వారి అవకాశాలను దెబ్బతీస్తూ పోతాయి. ద్వేషపు సంతలో ప్రేమ దుకాణాన్ని తెరుస్తున్నామని చెప్పిన రాహుల్ గాంధీ, జోడో యాత్రలలోను, పార్లమెంటులోను, ఎన్నికల ప్రచారంలోను మెరుపు ప్రచారం కాకుండా, క్షేత్రస్థాయిలో తమ పార్టీ యంత్రాంగం చేత సామరస్య, సోదరత్వ కృషి చేయించాలి. రాహుల్ నీతివచనాలు ఒక తీరుగా, కాంగ్రెస్ నేతల ఆచరణలు మరొక రీతిగా ఉంటే, బాలక బిరుదు పోయి, ద్వంద్వత్వ విమర్శలు ఎదురవుతాయి. ఇప్పటికే, రాహుల్ మాట, కాంగ్రెస్ చేత గురించిన ప్రచారం ఢిల్లీలో బలంగానే మొదలయింది.

> అయోధ్య అన్నది రామాలయ ఉద్యమంలో కీలకమయిన స్థలం, గమ్యం తప్ప, అదే సర్వస్వం కాదు. రామజన్మభూమి ఉద్యమం అన్నది ఒక ప్రయాణం. సుమారు నాలుగుదశాబ్దాల ప్రయాణం. దాదాపు దేశమంతటా, ఆ ప్రయాణం సాగింది. దాని ప్రభావాలు, పర్యవసానాలు దేశమంతటికీ వ్యాపించి ఉన్నాయి. అయోధ్యలో బీజేపీ ఓడిపోయినంత మాత్రాన, ఆ ఉద్యమం ఓడినట్టు కాదు.

జనాభాతో పేదరికమా, పేదరికం వల్ల జనాభానా?

1951లో భారతదేశ జననాల రేటు వెయ్యికి 47 శాతం ఉండగా మరణాల రేటు 44 శాతంగా ఉన్నది. క్రమంగా ప్రస్తుతానికి ఈ జననాల రేటు 16.1 శాతానికి మాత్రమే తగ్గగా మరణాల రేటు ఆరు శాతానికి తగ్గింది. ఫలితంగా 1956లో 36 కోట్లుగా ఉన్న జనాభా 2023 ఏప్రిల్ నాటికి నూట నలభై రెండు కోట్లకు చేరుకున్నది. చైనా జనాభాను సైతం మించిపోయిందని అనేక భయాలు కలుగుతున్నాయి.

బ్రిటిష్ వారు అనుసరించిన విధానాల వలన ఈ దేశం ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా ఎంతో కృశించిపోయింది. 1834లో విలియం బెంటింగ్ బ్రిటిష్ వారి పాలన చూసి "ప్రపంచ వాణిజ్య చరిత్రలో ఇంతటి విషాదమైనది మరేదీ కానరాదు" అని వ్యాఖ్యానించారు. అందుకే స్వాతంత్ర్యం వచ్చే నాటికి 70 శాతం ప్రజలు నిరుద్యోగులుగా ఉండిపోవడమే గాక పేదరికం, ఆకలి చావులతో దేశం సతమతమవుతున్నది.



> ప్రపంచ అభివృద్ధి నివేదిక ప్రకారం– ఉత్పత్తి చేసే సంతానానికి ఖర్చు ఉండదు కానీ ఉత్పత్తి చేసిన సంతానం సంపాదించి పెడుతుంది అనే భావన ప్రజల్లో ప్రబలంగా ఉన్నట్లు వెల్లడైంది. ఈ భావనలో మార్పు రావాలి. నారు పోసిన వాడు నీరు పోయక పోతాడా లాంటి నమ్మకాల నుండి ప్రజలు బయటపడేందుకు ప్రభుత్వం జనాభా విద్యను అందించాలి.

సగటు మనిషి రోజుకు తీసుకునే ఆహార పదార్థాల వలన ఎంత శక్తి లభించాలో అన్ని క్యాలరీల శక్తి లభించనప్పుడు వారు పేదరికంలో ఉన్నారని ఒక నిర్వచనం ఉన్నది. కానీ యుఎన్ఓ నిర్వచనం ప్రకారం ఎంతైతే విద్య, వైద్యం, మంచి నీటి సదుపాయాలు, ఆహార పదార్థాలు, సాంఘిక సౌకర్యాలు, సమాచార సదుపాయాలు లభించాలో అంతమేరకు పొందని వాళ్ళు కూడా పేదరికంలో ఉన్నట్లే. ఈ నేపథ్యంలో 2023 CMIE (సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ) నివేదిక ప్రకారం పారిశ్రామిక దేశాలు విద్యకు 5.6 శాతం కేటాయిస్తే ఇండియాలో ఆ కేటాయింపు 2.2 శాతం మాత్రమే ఉంది. పారిశ్రామిక దేశాల్లో అక్షరాస్యత 97.11 శాతం ఉండగా ప్రస్తుతం మనదేశంలో అక్షరాస్యత శాతం 76.32 శాతం మాత్రమే. పారిశ్రామిక దేశాలలో డాక్టర్ – పేషెంట్ నిష్పత్తి, ఉదాహరణకు, ఆస్ట్రియాలో 1:196, చిలీలో 1:176 గా ఉన్నది. కానీ ఇండియాలో ఇది 1:834 గా ఉన్నది. సామాజిక భద్రతా సౌకర్యాల పైన కొరియా తన జీడీపీలో 13.5 శాతం ఖర్చు చేస్తుండగా, మన దేశం ప్రస్తుతం 8.2 శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నది. పారిశ్రామిక దేశాలలో తలసరిగా తీసుకునే ఆహార పదార్థాల ద్వారా రోజుకు 3400 కేలరీల శక్తి లభిస్తుండగా మన దేశంలో 2029 క్యాలరీల శక్తి మాత్రమే లభిస్తున్నది. అంతేగాక పారిశ్రామిక దేశాలలో నూటికి 95 మంది మహిళలు అక్షరాస్యులుగా ఉండగా, స్వాతంత్ర సిద్ధించి ఏడు దశాబ్దాలు గడిచినప్పటికీ మన దేశంలో 70.3 శాతం మంది మహిళలు మాత్రమే అక్షరాస్యులుగా ఉన్నారు. మొత్తమ్మీద అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చుకున్నప్పుడు భారతదేశంలో ఇప్పటికీ పేదరికమే తాండవిస్తున్నది.

'ది మిత్ ఆఫ్ పాపులేషన్ కంట్రోల్' అనే పుస్తకంలో దాని రచయిత మహమూద్ మందాని "జనాభా వల్ల ప్రజలు పేదరికంలో లేరు, పేదరికం వల్ల జనాభా ఎక్కువ ఉన్నది" అంటారు ("People are not poor because they are many. They are many because they are poor"). వర్ధమాన దేశాలలో జనాభా ఎక్కువగా ఎందుకు పెరుగుతుందన్న అంశాన్ని తీసుకుని ఇద్దరు అమెరికన్ పరిశోధకులు దక్షిణ కొరియా, శ్రీలంక, కొలంబోలలో పరిశీలించగా ఈ దేశాలలో ఆదాయ అసమానతలు ఎక్కువగా ఉండడం, ఉపాధి అవకాశాలు లేకపోవడం, భూమి సక్రమంగా పంపిణీ కాకపోవడం, మహిళల స్థితిగతుల్లో మార్పు లేకపోవడం, ఆరోగ్య శిశు సంరక్షణ చర్యలు ఎక్కువగా అందకపోవడమే జనాభా పెరుగుదలకు కారణమవుతున్నదని వెల్లడైంది.

జనాభాను తగ్గించాలంటే విద్య, వైద్యం తదితర రంగాల్లో ఉన్న వెనుకబాటుతనాన్ని పారిశ్రామిక దేశాల్లో మాదిరిగా మన దేశంలో కూడా తగ్గించాలి. వ్యవసాయ రంగంలో 1969లో భారతీయ శాస్త్రవేత్త ప్రశాంత చంద్ర మహలనోబిస్ పరిశీలన ప్రకారం ఆరు కోట్ల ఎకరాల మిగులు భూమి ఉన్నట్లు అంచనా. అయితే భూసంస్కరణ చట్టాలు రూపొందించి డెబ్బై ఏళ్ళు అవుతున్నప్పటికీ ప్రభుత్వాలు ఇప్పటివరకు పంచిన భూమి కేవలం 44.45 లక్షల ఎకరాలు మాత్రమే. ప్రపంచ అభివృద్ధి నివేదిక ప్రకారం– ఉత్పత్తి చేసే సంతానానికి ఖర్చు ఉండదు కానీ ఉత్పత్తి చేసిన సంతానం సంపాదించి పెడుతుంది అనే భావన ప్రజల్లో ప్రబలంగా ఉన్నట్లు వెల్లడైంది. ఈ భావనలో మార్పు రావాలి. నారు పోసిన వాడు నీరు పోయక పోతాడా లాంటి నమ్మకాల నుంచి ప్రజలు బయటపడేందుకు ప్రభుత్వం జనాభా విద్యను అందించాలి.

ఒక విధంగా చూసినప్పుడు జనాభాను గురించి అంతగా బాధపడాల్సిన అవసరం కూడా లేదు. ఎందుకంటే ప్రపంచీకరణ వల్ల ప్రపంచ దేశాలకు సాంకేతిక జనాభా అవసరం పెరుగుతున్నది. మన దేశంలో 29 సంవత్సరాల సగటు వయసు ఉన్నవారు 47 కోట్ల మంది ఉన్నారు. వారు ఎక్కడైనా పనిచేయవచ్చు. మన దేశానికి నిధులు తరలించవచ్చు. కొన్ని లెక్కల ప్రకారం ప్రస్తుతం ఎన్నారై యువకులు సంవత్సరానికి 7 లక్షల కోట్ల రూపాయలు భారతదేశానికి పంపుతున్నారు. అందుకే భవిష్యత్తులో జనాభా ఒక వరంగానూ మారవచ్చు. ముందుగా పేదరికం తగ్గించే అంశాన్ని మన ప్రభుత్వాలు గమనంలోకి తీసుకుంటే అన్ని సమస్యలూ చక్కబడతాయి.

○ పొందూరు ప్రభాకర్ రావు
అర్థశాస్త్ర నిపుణులు

(నేడు ప్రపంచ జనాభా దినోత్సవం)

రిజిస్ట్రేషన్ చార్జీల విధానాన్ని ఇలా మార్చండి!

తెలంగాణ ప్రభుత్వం భూములు, ఇండ్లు, ప్లాట్స్ ధరలను అధిక రిజిస్ట్రేషన్ టాక్స్ కోసమని పెంచేందుకు కమిటీని ఏర్పాటు చేసింది. అయితే ఇప్పటికీ వంద శాతం రిజిస్ట్రేషన్‌లు మార్కెట్ ధర ప్రకారం జరగడం లేదు. చాలా వరకు లావాదేవీల్లో నగదు చేతులు మారుతోంది. దీనికి రెండు కారణాలు ఉన్నాయి. మొదటి కారణం రిజిస్ట్రేషన్ చార్జెస్, స్టాంపు డ్యూటీలు కలిపి ఏడు శాతం వరకు ఉండడం. రెండవ కారణం అమ్మకాలు జరిగినప్పుడు దీర్ఘకాల మూలధన లాభాల టాక్స్ కేంద్ర ప్రభుత్వం ద్వారా 20 శాతం వరకు ఉండడం.

ఆస్తుల అమ్మకాల లావాదేవీల్లో అమ్మకం దారు, కొనుగోలుదారు మధ్యన సేల్ అగ్రిమెంట్ జరుగుతుంది. వీటిలో నిజమైన మార్కెట్ ధరలు, ఆ ధర ఎప్పుడు ఏ విధంగా ఎన్ని కిస్తులలో అందజేయాలో పేర్కొనబడుతుంది. కానీ రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఇచ్చే టైటిల్ డీడ్‌లో మాత్రం ప్రభుత్వ రేటు ప్రకారమే ఉంటుంది. దీని ద్వారా నల్లధనం చాలా మంది కొనుగోలు, అమ్మకం దారులకు ఇష్టం లేకున్నా వారు రిస్క్ తీసుకుని నల్లధనంగా పరిగణింపబడే నగదు మార్పిడి చేసుకోవలసి వస్తోంది. తద్వారా నల్లధనం పెరిగేందుకు ప్రభుత్వ విధానాలే కారణాలవుతున్నాయి.

ఈ సమస్యలను పరిష్కరించాలంటే మార్కెట్ ధరకే రిజిస్ట్రేషన్ చేసి రిజిస్ట్రేషన్ చార్జెస్, స్టాంప్ డ్యూటీని ఒక శాతం చేస్తే అప్పుడు ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుంది గాని తగ్గదు. ఉదాహరణకి ఒక ఆస్తి ధర కోటి రూపాయలు ఉంటే దాన్ని రిజిస్ట్రేషన్ ఆఫీసు ధర 10 లక్షలు. దానిమీద ఏడు శాతం అంటే 70 వేల రూపాయలు ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ చార్జెస్ స్టాంప్ డ్యూటీ ద్వారా అందుతున్నాయి. అదే నిజమైన ధర కోటి రూపాయలకు కనుక ఒక శాతం తోని రిజిస్ట్రేషన్ చేయించుకుంటే ప్రభుత్వానికి లక్ష రూపాయలు వస్తాయి. అమ్మకందారులు వారికి వచ్చిన డబ్బులు నగదు రూపంలో కాకుండా బ్యాంకులో వేసుకోవచ్చు తిరిగి వారే మళ్లీ వేరే ఆస్తులు కొనేందుకు కానీ లేక 20 శాతం దీర్ఘకాలిక మూలధన లాభాల మీద టాక్స్ కట్టి మిగతా డబ్బుని తెల్ల ధనంగా బాహాటంగా వాడుకోవచ్చు. అయితే ఈ దీర్ఘకాలిక లాభాల టాక్స్ కూడా 20 శాతం మరీ ఎక్కువగా ఉంది. దీనిని కూడా రెండు లేదా మూడు శాతానికి కేంద్ర ప్రభుత్వం తగ్గించాలి. పైన సూచించిన విధాన మార్పులు చేపడితే ప్రభుత్వాలకు ఆదాయాలు పెరగడంతో పాటు నల్లధనం తగ్గి బ్యాంకులోకి ఎక్కువ నగదు చేరి ఆర్థిక వ్యవస్థకు ఎంతో దోహద పడుతుంది.

– డాక్టర్ ఎంహెచ్ ప్రసాదరావు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

సంకల్పరాహిత్యమే కులగణనకు ఏకైక అడ్డంకి!

కులగణన, ఓబీసీ రిజర్వేషన్ల పెంపు 2024 లోక్‌సభ ఎన్నికలలో జాతీయ అంశాలుగా మారాయి. కాంగ్రెస్ తన మేనిఫెస్టోలోని ఐదు న్యాయాలలోని 'హిస్సెదారు' న్యాయంలో కులగణన, రిజర్వేషన్ల పెంపుపై స్పష్టమైన హామీ ఇవ్వడమే కాకుండా వాటిని జాతీయ ప్రాధాన్యత గల అంశాలుగా ఎన్నికలలో ప్రచారం చేసింది. అధికార బీజేపీ కూడా తాము రిజర్వేషన్లు రద్దు చేయం అనీ, వాటికి వ్యతిరేకం కాదు అనీ వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది.

నిజానికి కులగణన డిమాండ్ 1950 నుంచి ఉన్నదే. బ్రిటిష్ పాలనలో 1881 నుంచి 1931 వరకు ప్రతి పదేళ్ళకు ఒకసారి జరిగే జనాభా గణనలో కులాలవారీగా జనాభా లెక్కలు సేకరించారు. మన నిజాం రాష్ట్రంలో కూడ సెన్సస్‌తో పాటు కులగణన జరిగింది. కాని 1951 సెన్సస్‌లో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఓబీసీల కులగణనకు సమ్మతించలేదు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆ డిమాండ్ కొనసాగుతూనే ఉంది. ఈ మధ్య జాతీయ ప్రాధాన్యత గల అంశంగా మారింది. ఎస్సీ ఎస్టీలకు సంబంధించి రాజ్యాంగ నిబంధనల మేరకు కులగణన తప్పనిసరి. అందుకే కులగణన జరిపి వారి జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ రంగాల్లో ఎస్సీలకు 1947 నుంచి, ఎస్టీలకు 1950 నుంచి రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. ఓబీసీలకు సంబంధించి సుప్రీమ్ కోర్టు తీర్పు 'బాలాజి వర్సెస్ స్టేట్ ఆఫ్ మైసూరు' తీర్పు 1962 ప్రకారం రిజర్వేషన్లు 50 శాతం మించకుండా, 'మండల్' కమిషన్ నివేదిక ప్రకారం ఉద్యోగాలలో 27 శాతం 1993 నుంచి, కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలలో 93వ రాజ్యాంగ సవరణ ద్వారా 2006 నుంచి కల్పిస్తున్నారు.

ఇంతకూ కులగణన వలన జరిగే లాభాలేమిటి? కులగణన వలన మాత్రమే ఓబీసీ కులాలకు సమానత్వం, సామాజిక న్యాయం సాధ్యమవుతాయి. వారి సామాజిక, విద్యా ఆర్థిక వెనుకబాటుతనం తేటతెల్లమవుతుంది. దానికనుగుణంగా ప్రణాళికలు రచించి వారి అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేయటానికి వీలు ఏర్పడుతుంది. కులగణన ఈ దేశానికి ఒక దశనూ దిశనూ నిర్దేశిస్తుంది. దేశ ప్రగతికి దిక్సూచిగా మారుతుంది. సామాజిక న్యాయానికి బాటలు వేస్తుంది.

సాధారణంగా జనాభా లెక్కలు నిర్వహణను 'సెన్సస్ చట్టం 1948' ప్రకారం కేంద్ర ప్రభుత్వం జరుపుతుంది. ఆ సెన్సస్‌లో ఎస్సీలు, ఎస్టీలకు సంబంధించి ఆర్టికల్ 330, 332, 335ల ప్రకారం కులగణన జరుగుతుంది. అలాగే కేంద్ర ప్రభుత్వం అనుకుంటే రాబోయే సెన్సస్‌లో ఓబీసీ కులగణన చేయవచ్చు. సెన్సస్ ఫార్మాట్ మార్చి, కార్యనిర్వాహక ఆదేశాలు ఇస్తూ, అవసరమైతే చట్టం చేసి కులగణన చేయవచ్చు. కాని అన్ని రాజకీయపార్టీలు అగ్రవర్ణాల ఆధీనంలో ఉండి ఓబీసీ వర్గాలు ఎదగకుండా ఉండేందుకు కులగణనను అడ్డుకుంటున్నాయి.

ఇక రాష్ట్రం విషయానికి వస్తే కాంగ్రెస్ పార్టీ తమ కామారెడ్డి డిక్లరేషన్‌లో అధికారంలోకి వచ్చాక ఆరు నెలల్లోనే బీసీ కులగణన చేసి, బీసీ కమిషన్ నివేదిక ప్రకారం రిజర్వేషన్లను పెంచుతామని ప్రకటించింది. అలాగే స్థానిక సంస్థలలో ప్రస్తుతం ఉన్న 23 శాతం రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని ప్రకటించింది. సెన్సస్ చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వమే సెన్సస్ చేయాలి. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం 'కలెక్షన్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఏక్ట్ 2008' క్రింద కుల సర్వే చేయవచ్చు. ఇప్పటికే బిహారు, ఆంధ్ర, ఒరిస్సా, కర్ణాటక రాష్ట్రాలు కుల సర్వే చేశాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కులగణనపై అసెంబ్లీ తీర్మానం చేయడమే గాక, కులగణనకు 150 కోట్లు కేటాయిస్తూ మార్చి 15, 2024న జీవో నెం.26 జారీ చేసింది.

నిజానికి కేంద్రం 2019లో తాను అనుకున్నదే తడవుగా 103వ రాజ్యాంగ సవరణ చేసి ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించింది. ఫలితంగా ఇడబ్ల్యూయస్ అభ్యర్థుల మెరిట్, ఓబీసీ మెరిట్ కంటె తక్కువ ఉన్నప్పటికీ ఉద్యోగాలకు ఎంపిక అవుతున్నారు. అదే చిత్తశుద్ధి ఓబీసీలపై చూపించి కులగణన చేసి రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పెంచవచ్చు.

కులగణన చేయడానికి చాలా సమయం పడుతుంది. సకాలంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరపకుంటే కేంద్ర ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లు రావు అని బీసీల మైండ్ సెట్ మార్చే ఒక వితండ ప్రచారం ఈ మధ్య ప్రారంభమైంది.

> 2014 ఆగస్టు 19న రాష్ట్రమంతటా ఒకే రోజున 94 అంశాలపై సమగ్ర కుటుంబ సర్వే చేశారు. ఈ సర్వే వివరాలన్నీ కంప్యూటరైజ్ అయి ఉన్నాయి. వాటి ఆధారంగా తగు సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేసి, గ్రామస్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చి, స్మార్ట్ ఫోన్ల ద్వారా డాటా సేకరించి, రెండు నెలలలో సర్వే పూర్తి చేయవచ్చు.



నిజానికి కులగణన చేయడానికి పెద్ద సమయం అవసరం లేదు. 2014 ఆగస్టు 19న రాష్ట్రమంతటా ఒకే రోజున 94 అంశాలపై సమగ్ర కుటుంబ సర్వే చేశారు. ఈ సర్వే వివరాలన్నీ కంప్యూటరైజ్ అయి ఉన్నాయి. వాటి ఆధారంగా తగు సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేసి, గ్రామస్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చి, స్మార్ట్ ఫోన్ల ద్వారా డాటా సేకరించి, రెండు నెలలలో సర్వే పూర్తి చేయవచ్చు.

ఇక స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయానికి వస్తే ఎస్సీ ఎస్టీలకు వారి జనాభా ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తారు. ఇక ఓబీసీ రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీం కోర్టు 2010లో కృష్ణమూర్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో 3 పరీక్షల సూత్రాన్ని ప్రతిపాదించింది. 1) ఒక స్వతంత్ర కమిషన్ వేసి బీసీలు రాజకీయంగా వెనుకబడి ఉన్నారు అనే విషయంలో ప్రామాణిక సాక్ష్యాలు సేకరించాలి. 2) స్థానిక సంస్థల వారీగా ఎంత రిజర్వేషన్ ఉండాలో ఆ కమిషన్ సూచించాలి. 3) ఎస్సీ ఎస్టీల రిజర్వేషన్ కలుపుకుని ఆ రిజర్వేషన్ 50 శాతాన్ని మించకూడదు.

1994 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రాష్ట్రంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఉండేవి. కానీ కొత్తగా వచ్చిన పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం ఈ విధంగా ఉన్నాయి: 1) గ్రామ పంచాయతీ వార్డ్ మెంబర్లలో 23.59శాతం, సర్పంచ్‌లకు 22.78శాతం, ఎంపీటీసీలకు 17.87శాతం, జడ్పీటీసీలకు 16.98శాతం మాత్రమే ఉన్నాయి. అలాగే మున్సిపాల్టీలలో 29.55శాతం, మున్సిపల్ కార్పోరేషన్లలో 33.46శాతం, జీహెచ్ఎంసీలో 33.33శాతం ఉన్నాయి. దీనివలన బీసీలు తీవ్రంగా నష్టపోయారు. జీహెచ్ఎంసీలో 41శాతం ఓబీసీలకు రిజర్వేషన్ ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ, గత ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా ఇవ్వలేదు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 243డి (6) ప్రకారం పంచాయతీరాజ్ సంస్థలలో అలాగే 243టి (6) ప్రకారం మున్సిపల్ సంస్థలలో రిజర్వేషన్లు కల్పిస్తారు. ఎంత శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలనే అంశం రాష్ట్రాలకు వదిలివేస్తారు. కానీ సుప్రీం కోర్టు 50శాతం సీలింగ్ విధించింది.

ఓబీసీలకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు పెంచాలంటే ఒక స్వతంత్ర కమిషన్ ద్వారా కులగణన చేసి అసెంబ్లీలో అందుకు అనుకూలంగా చట్టం చేసి, కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసి రాజ్యాంగంలో 9వ షెడ్యూల్లో చేర్పించాలి. తమిళనాడులో ఈ విధంగానే చేసి బీసీలకు విద్య, ఉద్యోగ రంగాలలో 50శాతం రిజర్వేషన్లు కల్పించారు.

ఈ దేశ పాలనలో అణచి వేయబడిన వర్గాలకు భాగస్వామ్యం కల్పించాలంటే పైన తెలిపినట్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పకుండా చర్యలు తీసుకోవాలి. అప్పుడే వారు ఈ దేశంలో ఒక సగటు పౌరునిగా సగర్వంగా జీవించడానికి అవకాశం ఏర్పడుతుంది. వారి సాధికారత సాధ్యమౌతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే విధంగా తగు చర్యలు తీసుకుని బడుగు బలహీన వర్గాల సాధికారతకు బాటలు వేయాలని ఆశిస్తున్నాము.

◆ టి. చిరంజీవులు
రిటైర్డ్ ఐఏఎస్



'స్థానికం'పై ఆశలు

పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికలపై స్పష్టత కోసం ఎదురుచూపు

- సీఎం రేవంత్ తాజా ప్రకటనతో ఆశావహుల ప్రయత్నాలు
- ప్రస్తుత పంచాయతీ రిజర్వేషన్లపై సర్కారు పునరాలోచన
- సంక్షేమ పథకాలు చేరువేత, చేరికలపై కసరత్తు
- స్థానిక సంస్థల్లో పాగా వేసేందుకు కాంగ్రెస్ పావులు
- ఇప్పటికే ప్రత్యేక పాలనలోకి పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లు

హనుమకొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే స్థానిక సంస్థలకు ఎన్నికలను నిర్వహిస్తామని పాలమూరు సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికల్లో పోటీకి ఆసక్తి చూపుతున్న నాయకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కానీ ఎన్నికల నిర్వహించే సమయంపై స్పష్టత రాకపోవడంతో వారంతా సర్కారు ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. గత ఫిబ్రవరి 1న సర్పంచుల పదవీ కాలం ముగిసింది. జూలై 4వ తేదీతో జిల్లా, మండల పరిషత్ చైర్మన్ల పదవీ కాలం ముగిసింది. దీంతో ఇవి ప్రత్యేకాధికారుల పాలనలోకి వెళ్లాయి. ఈ క్రమంలో ఎన్నికలు నిర్వహించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు. ఆ దిశగా అధికారులకు కూడా ఎలాంటి సంకేతాలు ఇవ్వలేదు. కిందటిసారి ఎన్నికలు జరిగినప్పుడు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్లు పదేళ్లపాటు కొనసాగాలని చట్టాన్ని తీసుకువచ్చింది. దీనిపై ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందోనన్న ఉత్కంఠ కనిపిస్తుండగా.. పాలమూరు సభలో సీఎం చేసిన ప్రకటన నేపథ్యంలో యంత్రాంగం కూడా త్వరలోనే గ్రామ పంచాయతీ, ప్రాదేశిక రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల నిర్వహించేందుకు కసరత్తు ప్రారంభించబోతున్నట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ తరపున రంగంలోకి దిగాలనుకుంటున్న స్థానిక నేతలు తమ ప్రయత్నాలు చేసుకుంటున్నారు.



సంక్షేమ పథకాలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలే అయింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చీరాగానే లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. దీంతో కోడ్ అమలులోకి రావడంతో పల్లెలు, పట్టణాల్లో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సంక్షేమ పథకాలు ఇంకా పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. వాటి ఫలాలు క్షేత్ర స్థాయిలో అన్ని వర్గాల ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణులకు పూర్తిగా అందుబాటులోకి రాలేదు. ఆరు గ్యారంటీల కింద చేపట్టిన సంక్షేమ పథకాలు కూడా పూర్తిగా అమలులోకి రాలేదు. వాస్తవానికి లోక్‌సభ ఎన్నికలకన్నా ముందే పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది.

కానీ లోక్‌సభ ఎన్నికల వల్ల వీటి నిర్వహణ ఆలస్యమైంది. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. ప్రస్తుతం పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికలపై దృష్టి సారించే విషయంలో ప్రభుత్వం అంతసానుకూలంగా లేదని, పరిపాలన ఇప్పుడిప్పుడే గాడిన పడుతున్నందు వల్ల ఎన్నికలకు ఇంకా సమయం పడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కానీ సీఎం రేవంత్ మాత్రం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపడంతోపాటు, వారిలో నిరాశ ఆవహించకుండా ఉండేందుకు త్వరలోనే ఎన్నికల నిర్వహణ ఉంటుందని ప్రకటించారన్న చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో మరో ఆరు నెలల తర్వాతే స్థానిక, ప్రాదేశిక సంస్థల ఎన్నికలు ఒకదాని తర్వాత ఒకటిగా వరుసగా నిర్వహిస్తారన్న ప్రచారం జరుగుతోంది.

జడ్పీటీసీలు, ఎంపీటీసీలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 71 జడ్పీటీసీ, 1,030 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో ప్రస్తుతం 7 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. అవి హసన్‌పర్తి, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్, వేలేరు, ధర్మసాగర్, ఐనవోలు జిల్లాల పునర్విభజన ఫలితంగా ఐదు మండలాలు ఆత్మకూరు, శాయంపేట, దామెర, పరకాల, నడికూడ ఈ జిల్లా పరిధిలోకి వచ్చాయి. దీంతో హనుమకొండ జిల్లాలో జడ్పీటీసీ స్థానాల సంఖ్య 12కు పెరగనున్నది. జిల్లాలో ఎంపీటీసీ స్థానాలు 86 ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా పరిధిలో ప్రస్తుతం 16 జడ్పీటీసీలు ఉన్నాయి. ఏడాది కిందట మండలాల పునర్విభజనతో రెండు మండలాలు సీరోలు, ఇనుగుర్తి వచ్చి చేరాయి. దీంతో ఈ జిల్లాలో మొత్తం జడ్పీటీసీల సంఖ్య 18కి చేరనున్నది. ఎంపీసీ స్థానాలు 198 ఉన్నాయి. జనగామ జిల్లాలో 12 జడ్పీటీసీలు, 141 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రస్తుతం 11 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. కొంతకాలం కిందట పునర్విభజనతో గోరికొత్తపల్లి వచ్చి చేరింది. దీంతో ఈ జిల్లాలో జడ్పీటీసీల సంఖ్య 12కు చేరనున్నది. ఎంపీటీసీ స్థానాలు 106 ఉన్నాయి. ములుగు జిల్లాలో 9 జడ్పీటీసీలు ఉన్నాయి. ఎంపీటీసీలు 87. వరంగల్ జిల్లాలో 16 జడ్పీటీసీలు, 412 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి.

ఆరు నెలల తర్వాత..

మొన్నటివరకు మెజారిటీ జిల్లా పరిషత్, మండల పరిషత్తు చైర్మన్ పదవులు బీఆర్ఎస్ చేతిలో ఉన్నాయి. హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జడ్పీ చైర్మన్లుగా బీఆర్ఎస్ నుంచి ప్రాతినిథ్యం వహించారు. జడ్పీటీసీ సభ్యులు కూడా ఆ పార్టీ పక్షాన ఎక్కువ మంది గెలిచారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల క్రమంలో కొన్ని జిల్లాల్లో జడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. పదవులపై ఆశలు పెట్టుకున్న చాలామంది నేతలు.. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటికే ఆ పార్టీలో ఉన్న పాత నేతలు సైతం పదవులపై ఆశలు పెంచుకున్నారు. ఈ క్రమంలో ఇప్పటికిప్పుడు ప్రాదేశిక ఎన్నికలు నిర్వహిస్తే టికెట్ల కేటాయింపు వంటి పరిణామాలు కాంగ్రెస్ పార్టీకి ఒకింత ఇబ్బంది తెచ్చిపెట్టే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే మెజారిటీ స్థానాలను గెలుచుకునే అవకాశాలు అంతగా లేవు. పరోక్షంగా బీఆర్ఎస్‌కే లాభపడే అవకాశాలు ఉన్నాయి. దీంతో పాటు బీజేపీ కూడా జోరుమీద ఉన్నది. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేసే దిశగా ఆ పార్టీ అధినాయత్వం పావులు కదుపుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటింగ్ 30 శాతం వరకు పెరిగింది. లోక్‌సభ ఎన్నికల్లో సైతం ఇదే ట్రెండ్ కొనసాగింది. ఈ పరిస్థితుల్లో ప్రాదేశిక ఎన్నికలకు ఇప్పటికిప్పుడు పోకపోవడమే మంచిదనే అభిప్రాయంలో కాంగ్రెస్ అధినాయకత్వం ఉంది.

వేచి చూడాల్సిందేనా?

తమ పదవులు కొనసాగిస్తారనే ఆశ కొందరిలో ఉంది. కానీ కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు మాత్రం ప్రత్యేకాధికారులను తమకు అనుకూలంగా మలచుకొని స్థానిక, ప్రాదేశిక సంస్థల్లో పాగా వేయాలని భావిస్తున్నారు. ఈ లోగా జడ్పీ, మండల పరిషత్తు చైర్మన్లలో చాలామంది కాంగ్రెస్‌లోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రభుత్వం స్థానిక, ప్రాదేశిక ఎన్నికల అంశాన్ని అక్టోబరు వరకు వేచి చూసే ధోరణిలో ఉండే అవకాశం లేకపోలేదు. మరో వైపు ముఖ్యమంత్రి కూడా జిల్లాల పర్యటన చేపట్టి పార్టీని పటిష్ఠం చేసేందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులతో కలిసి సమీక్షలు నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారు.

భూసేకరణ పరిహారంలో మానవీయతతో వ్యవహరించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

హనుమకొండ కలెక్టరేట్, జూలై10: రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణలో బాధితులకు చెల్లించే పరిహారం విషయంలో మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎన్‌హెచ్ఎఐ మెంబర్ అనిల్ చౌదరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి రీజినల్ రింగ్ రోడ్డు మంచిర్యాల - వరంగల్ - ఖమ్మం-విజయవాడ కారిడార్ భూసేకరణ పురోగతిపై ఎదురవుతున్న సమస్యలపై సంబంధిత జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు వల్ల శాశ్వతంగా భూములు కోల్పోయే వారికి పరిహారం గరిష్టస్థాయిలో ఉండేవిధంగా చూడాలన్నారు. జాతీయ రహదారుల నిర్మాణంలో ఎదురవుతున్న వివిధ సమస్యలపై దృష్టిసారించి తక్షణం వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెలాఖరులోగా పూర్తి వివరాలతో పాటు ప్రతిపాదనలను సమర్పించాలని ముఖ్యమంత్రి కలెక్టర్లను ఆదేశించారు.

హనుమకొండ కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఈ కారిడార్ హనుమకొండ జిల్లాలో 30 కిలోమీటర్లు ఉందని, 141 మందికి పాస్ అవార్డు చేశామన్నారు. ధరల వ్యత్యాసం వల్ల రైతులు భూమి ఇచ్చేందుకు ముందుకు రావడం లేదన్నారు. ఆగస్టు రెండోవారానికల్లా ఆర్బిట్రేషన్, ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, డీఎఫ్‌వో లావణ్యతో పాటు ఇతర అధికారులు వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.



హనుమకొండ కలెక్టరేట్ నుండి వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, పోలీస్ కమిషనర్, ఇతర అధికారులు

గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, అందుకుగాను మహిళలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తున్నదని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం డీఆర్‌డీఏ, మెప్మా, వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఉన్న మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఈ యేడు రూ.133కోట్లు ఖర్చు పెట్టినట్లు తెలిపారు. త్వరలోనే మహిళలకు మీ సేవా కేంద్రాలు, డెయిరీ ఫామ్‌లు పెట్టిస్తామని వెల్లడించారు. మహిళా సంఘాల ద్వారా ఏకరూప దుస్తులు కుట్టించామని తెలిపారు. మహిళా సంఘాలకు ఏమేమి పథకాలు ఉన్నాయని ఈ సందర్భంగా సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జనాభా ప్రాతిపదికన యూనిట్లు ఏర్పాటు చేస్తే అవి ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. మహిళా శక్తి పథకం ద్వారా 14 పథకాలు ఉన్నాయని తెలిపారు.

మహిళా శక్తి కార్యక్రమాలను సమన్వయం చేయడానికి జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. మహిళా శక్తి కింద తయారు చేసే ఉత్పత్తులకు మంచి గుర్తింపు ఉండాలని అన్నారు. అలాగే వారంలో యూనిట్లను ఎంపిక చేయాలని, యూనిట్లకు ఎంపికైన వారికి శిక్షణ ఇచ్చి వారిని సమర్థులుగా తయారు చేయాలన్నారు. కొత్త యూనిట్లు ఆగస్టు మొదటి వారంలో ప్రారంభించాలన్నారు.

కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, డీఆర్‌డీఓ పీడీ నాగపద్మజతోపాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బేరుండా అలంకరణలో భద్రకాళి



కురుకుల్లా అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు

వరంగల్ కల్చరల్, జూలై 10: వరంగల్‌లోని భద్రకాళి ఆలయంలో అమ్మవారి శాకంబరీ నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలు బుధవారం నాటికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమాలు నిత్యాహ్నికం, క్షీరాన్న నివేదన, నీరాజన మంత్రపుష్పములతో పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో తిథిద్వయం కావడంతో అమ్మవారి దశ మహా విద్యలలోని కాళీ క్రమాన్ని అనుసరించి శోడశి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం వేళ కురుకుల్లా అలంకరణలో, సాయంత్రం బేరుండా అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శాకంబరీ నవరాత్రి ఉత్సవాల్లో భద్రకాళి మాతను కురుకుల్లా, బేరుండా అలంకరణలో భక్తులు దర్శించుకుంటే పాపాలన్నీ తొలగిపోతాయని భద్రకాళి శేషు తెలిపారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణతోపాటు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ ఈవో శేషుభారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శిథిల భవనాల గుర్తింపులో వేగం పెంచండి

- టౌన్‌ప్లానింగ్ అధికారులతో మేయర్ సుధారాణి



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూలై 10: గ్రేటర్ వరంగల్ పరిధిలో శిథిల భవనాల గుర్తింపులో వేగం పెంచాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. బుధవారం బల్దియా కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధారాణి పలు సూచనలు చేశారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రేటర్ 66 డివిజన్‌ల పరిధిలో శిథిలావస్థకు చేరుకున్న భవనాలు చాలావరకు ఉన్నాయని, వాటిని గుర్తించి ముందస్తు ప్రమాదాలను అరికట్టాలన్నారు. రాబోవు 4 నెలల కాలంలో ఎలాంటి సెల్లార్‌ల నిర్మాణాలు చేపడ్డకూడదని ఆదేశించారు. గతంలో నిర్మించిన సెల్లార్‌లలో నీరు నిలువ ఉండకుండా చూడాలని అన్నారు. అక్కడక్కడా సెల్లార్‌లలో నిలిచిన నీటిని మోటార్‌ల సహాయంతో బయటకు పంపించాలన్నారు. ఇంకా సెల్లార్‌లలో విద్యుత్‌తో నడిచే పరికరాలను వెంటనే అక్కడి నుంచి తొలగించాలన్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగంపై గీవెన్స్‌లో చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, వెంటనే పరిష్కార మార్గాన్ని చూపించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి అందనపు కమిషనర్ నిమ్మ కృష్ణారెడ్డి, సీపీ వెంకన్న, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, టీపీఎస్‌లు, టీపీబీవోలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వెంకట్రాంరెడ్డి

నగర సమగ్రాభివృద్ధికి కృషి

- కాళోజీ కళాక్షేత్రం పనులను వేగవంతం చేస్తాం..
- వేగంగా ఇన్నర్, ఔటర్ రింగ్‌రోడ్డు పనులు
- ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకుంటాం
- స్పోర్ట్స్ హబ్, మెడికల్ జోన్ల నిర్మాణానికి కృషి
- వరంగల్ కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి



రుణం కావాలంటే.. రుసుం కట్టాల్సిందే..

- మహిళా సంఘాల్లో పెచ్చుమీరుతున్న అక్రమాలు
- లీడర్లు, వీవోల కక్కుర్తితో ఇబ్బంది పడుతున్న సభ్యులు
- లోన్ కోసం కమీషన్లు, అధిక వడ్డీల వసూళ్లు
- రికవరీ పేరిట రూ.లక్షలు ఆర్జిస్తున్న ఆర్పీలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

హనుమకొండ కలెక్టరేట్, జూలై 10: మహిళలు తమ కాళ్లమీద తాము నిలబడి ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం రుణాలు అందిస్తుంటే.. దాన్ని ఆసరాగా చేసుకున్న కొంతమంది మహిళా సంఘాల లీడర్లు, వీవోలు కమీషన్ల పేరిట దోచుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇంటి అవసరాల కోసమో, పంట పెట్టుబడి కోసమో రుణం కోసం ఎదురుచూస్తున్న మహిళలకు కమీషన్ల కోతలు పెడుతున్నారు. గద్దొచ్చి కోడి పిల్లను ఎత్తుకెళ్లినట్లు డబ్బులు రాగానే మహిళా సంఘాల లీడర్లు, వీవోలు, బ్యాంకు అధికారులు.. సంఘం సభ్యుల నుంచి కమీషన్లు తీసుకుంటున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

ఆర్థిక స్వావలంబనకు..

గ్రామీణ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి 10 మంది మహిళలను కలిపి ఒక గ్రూపుగా ఏర్పాటు చేస్తారు. ఈ సంఘాలన్నీ కలిపి ఒక గ్రామంలో గ్రామ సమాఖ్య సంఘంగా ఏర్పడుతుంది. గ్రామ సమైక్య సంఘానికి ఒక లీడర్ ఉంటుంది. మహిళా సంఘాలకు సంబంధించిన గ్రూపులపై ఆ గ్రామానికి చెందిన ఒక సీఏ ఉంటుంది. సీఏ ఆధ్వర్యంలో ఖాతా బుక్కులను, తీర్మానాలను రాసి సక్రమ మార్గంలో నడిపించాల్సి ఉంటుంది. అయితే దామెర, ఆత్మకూరు మండలాల్లో ఎక్కువగా మహిళా సంఘాల లీడర్లు, వీవోలు బ్యాంక్ అధికారులతో కుమ్మక్కై సంఘంలోని సభ్యులను మోసం చేస్తున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా పరకాల నియోజకవర్గానికి దగ్గరలో ఉన్న రెండు మండలాల్లో సుమారు రూ.50లక్షల దుర్వినియోగం జరిగిందని చర్చ జరుగుతోంది. మహిళా సంఘాల్లో ఎక్కువ మంది నిరక్షరాస్యులే ఉండటంతో వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని తప్పుడు లెక్కలతో మోసం చేస్తున్నట్లు సమాచారం. ఆయా మహిళా సంఘాలకు సంబంధించిన సభ్యులకు ఈ విషయం తెలిసినప్పటికీ ముందుకు వచ్చి అక్రమాల గురించి చెబితే మళ్లీ లోను ఇస్తారో.. ఇవ్వరో.. అని భయపడుతూ ముందుకు రాలేకపోతున్నట్లు వినికిడి. ఇదేకాకుండా లోన్ ఇప్పిస్తే కూడా రూ.3వేల నుంచి రూ.5వేల వరకరు లంచం తీసుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

చెల్లించేది కొండంత..

మహిళా ఆర్థికాభివృద్ధి కోసం మహిళా సంఘాల పేరిట ఇచ్చే రుణాల్లో తీసుకున్నదానికన్నా చెల్లించేది ఎక్కువగా ఉంటోందని జిల్లా వ్యాప్తంగా పలువురు మహిళలు ఆరోపిస్తున్నారు. పావలావడ్డీ రుణం అని డబ్బులు అప్పుగా ఇచ్చి చెల్లించే క్రమంలో అధిక వడ్డీలతో వసూలు చేస్తున్నట్లుగా మహిళా సంఘాల్లోని కొంతమంది సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీ అవుతుందనే ఆశతో అవసరం లేకున్నా రుణాలు తీసుకుని చెల్లించేటప్పుడు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కమీషన్లకు కక్కుర్తి పడుతున్న మహిళా సంఘాల లీడర్లు, బ్యాంకు అధికారులు, వీవోలు రుణం పేరిట నిరుపేద మహిళలకు ఆశ చూపి ఎంతోకొంత రుణం ఇప్పించి ఆ తర్వాత కొంత నొక్కి కూడబెట్టుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆర్పీల దందా..

ఆర్పీ (రిసోర్సు పర్సన్లు) మహిళా సంఘాల పేరుతో కోట్ల రూపాయలు దోచుకున్నారనే ఆరోపణలున్నాయి. ఆర్పీలు వందలాది మహిళా సంఘాలు ఏర్పాటు చేసి బ్యాంక్ అధికారులు, మెప్మా సిబ్బందితో చేతులు కలిపి కోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడినట్లు సోషల్ ఆడిట్‌లో నిర్ధారణ అయినట్లు సమాచారం. ఐదేళ్లుగా రికవరీ చేయాలని బ్యాంక్ అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ మెప్మా సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు అంటున్నారు. మహిళా సంఘాల పేరుతో స్త్రీనిధిపై తీసుకున్న నగదును కొందరు ఆర్పీలు సభ్యుల నుంచి రికవరీ చేసి బ్యాంక్‌లో జమ చేయకుండా సొంతానికి వాడుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అంతేకాకుండా ఆర్పీలు నకిలీ మహిళా సంఘాలను సృష్టించి వాటి పేరుపై గ్రూపులు ఏర్పాటు చేసి బ్యాంకు ద్వారా లోన్ రూపంలో నగదు తీసుకున్నట్లు తెలుస్తోంది.

మునిసిపల్ పరిధిలో అక్రమాలు?

మునిసిపాలిటీ పరిధిలోని పశ్చిమ నియోజకవర్గంలోని రెడ్డికాలనీ, ఎన్జీవోస్ కాలనీ, కుమార్‌పల్లి, కాజీపేట, వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని రంగశాయిపేట, ఎస్ఆర్ఆర్ తోట, శంభునిపేట, దేశాయిపేట, కరీమాబాద్, కాశీబుగ్గ, శివనగర్, లేబర్‌కాలనీ ప్రాంతాల్లో ఆర్పీలు భారీస్థాయిలో అక్రమాలకు పాల్పడ్డట్లు చర్చ జరుగుతోంది. ఇప్పటికైనా వెంటనే అక్రమాలకు పాల్పడ్డ ఆర్పీలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వారిని విధుల నుంచి తొలగించి సొత్తు రికవరీ చేయాలని పలువురు మహిళా సంఘాల సభ్యులు అంటున్నారు.

మహిళా సంఘాలు

గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) పరిధిలో జిల్లాలో 10,161 స్వయం సహాయక సంఘాలు(మహిళా సంఘాలు), 397 గ్రామైక్య సంఘాలు, 12 మండల సమాఖ్యలు ఉన్నాయి. ఇందులో మొత్తం 1,12,803 మంది సభ్యులు ఉన్నారు. పరకాల నియోజకవర్గంలో ఉన్న ఆత్మకూరు, దామెర, నడికూడ, పరకాల మండలాల్లో మొత్తం 2,535 మహిళా సంఘాలు ఉండగా, 94 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. 27,386 మంది మహిళా సంఘాల్లో సభ్యులుగా కొనసాగుతున్నారు. అలాగే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 16,027 మహిళా సంఘాలు ఉండగా, ఇందులో 1,69,247మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. ఇందులో పరకాల నియోజకవర్గానికి సంబంధించి 545 గ్రూపులు ఉండగా 5162 మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. మునిసిపల్ పరిధిలోని 16,027 సంఘాలకు 539 మంది రీసోర్స్ పర్సన్స్(ఆర్పీలు) ఉన్నారు.

పెద్దాస్పత్రిలో హృద్రోగులకు దిక్కెవరు?

కార్డియాలజిస్టులతో కొరతతో రోగులకు తప్పని అవస్థలు

పరీక్షలు చేసే వారు లేక నిరీక్షణ

వరంగల్ మెడికల్, జూలై 10: ఉమ్మడి వరంగల్ జిల్లా అంతటికి పెద్దాస్పత్రి అయిన ఎంజీఎంలో కార్డియాలజీ విభాగం పరిస్థితి అత్యంత అధ్వాన్నంగా ఉంది. ఈ విభాగంలో ఇద్దరే కార్డియాలజిస్టులు ఉన్నారు. వారూ సకాలంలో రారు. గుండె పరీక్షలు చేసే వైద్య పరికరాలు కూడా చాలినన్ని లేవు. గుండె పనితీరును గుర్తించడంలో కీలకంగా పని చేసే టూడీ ఎకో పరికరాలు రెండే ఉన్నాయి. ఎంజీఎంకు రోజు 100 నుంచి 150 మంది హృద్రోగులు గుండె పరీక్షలు చేయించుకునేందుకు వస్తుంటారు. బుధవారం రోజు కూడా రోగులు పెద్ద సంఖ్యలో వచ్చారు. కానీ కార్డియాలజీ డాక్టర్లే లేరు. దీంతో టూడీ ఎకో పరీక్షలు చేసేవారే లేకుండా పోయారు. టూడీ ఎకో పరీక్షలు నిలిచిపోవడంతో హృద్రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోగులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పరీక్షల కోసం వార్డులో పడిగాపులు కాశారు. డాక్టర్ల జాడ లేకపోవడంతో ఆస్పత్రి అధికారులు టూడీ ఎకో పరీక్షలకు కోసం రోగులను కాకతీయ వైద్య కళాశాల ఆవరణలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి పంపించారు. రోగులు అక్కడి వెళ్లే సరికి అప్పటికే అక్కడ కార్డియాలజీ విభాగంలో టూడీ పరీక్షల కోసం రోగులు పెద్ద సంఖ్యలో వేచి ఉన్నారు. ఎంజీఎం నుంచి కూడా రోగులు రావడంతో వార్డులో రద్దీ పెరిగింది.


గుండె పరీక్షలకోసం బారులు తీరిన రోగులు

ఇప్పటికే రోగులు పెద్ద సంఖ్యలో ఉండగా ఎంజీఎం నుంచి సైతం రిఫర్ చేయడంపై సూపర్‌స్పెషాలిటీలోని డాక్టర్లు ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి పరీక్షలు చేయడానికి నిరాకరించారు. దీంతో ఇక్కడ కూడా డాక్టర్లకు, రోగుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. రోగులు, వారి వెంట వచ్చిన బంధువులు డాక్టర్లతో ఘర్షణకు దిగారు. అధికారుల తీరుపట్ల నిరసన వ్యక్తం చేశారు. ఫలితంగా ఆస్పత్రిలో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చివరికి చేసేది లేక రోగులు టూడీ ఎకో పరీక్షలు చేయించుకోకుండానే నిరాశతో వెనుదిరిగి వెళ్లాల్సి వచ్చింది. రెండు రోజుల కిందటే వరంగల్ కలెక్టర్ ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించి ఆస్పత్రి పరిస్థితిపై ఆయా విభాగాల అధిపతులతో సమీక్షించారు. ఎంజీఎంలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అయినా పరిస్థితి మారలేదు.

నగర సమగ్రాభివృద్ధికి కృషి

వరంగల్ కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, జూలై10: కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) పరిధిలోని వరంగల్ నగరంతో పాటు 180 గ్రామాలను లక్ష్యంగా చేసుకుని అభివృద్ధి చేస్తానని కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హనుమకొండ కుడా కార్యాలయంలో స్థానిక సిబ్బందితో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేసి విలేకరులతో మాట్లాడారు. వరంగల్ నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని అన్నారు. ఇప్పటి వరకే నగరంలోని కాళోజీ కళాక్షేత్రం పనులు 70 శాతం పూర్తయ్యాయని, సెప్టెంబర్ 9 వరకు పనులు పూర్తి చేసి ప్రారంభ కార్యక్రమానికి సీఎం చేతులు మీదుగా ఆవిష్కరణ చేయిస్తామన్నారు. ఇంకా ఇన్నర్, ఔటర్ రింగు రోడ్డు పనులు త్వరిత గతిన పూర్తి చేస్తామని తెలిపారు. భూములు కోల్పోయిన యజమానులకు నష్టం జరుగకుండా పరిహారంతో ఆదుకుంటామన్నారు. ఇప్పటికే సీఎం నిధుల నుంచి రూ.350కోట్లు మంజూరు అయ్యాయన్నారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు ప్రతిపాదనలు కూడా సిద్ధం చేస్తున్నామన్నారు. నగరం చుట్టుపక్కల చాలా చోట్ల కుడాకు సంబంధించిన భూములు రియల్టర్లు ఆక్రమించుకున్నారని, సర్వే ద్వారా వాటిని గుర్తించి స్వాధీనం చేసుకుంటామన్నారు.

వరంగల్ నగరం నుంచి ఇప్పటికే క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగారని, క్రీడారంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు 50 ఎకరాల్లో స్పోర్ట్స్ హబ్‌ను ఏర్పాటు చేసి అన్ని రకాల క్రీడలకు శిక్షణ ఇప్పిస్తామని ఇనగాల పేర్కొన్నారు. అక్కడక్కడా ఉన్న ఆస్పతుల ద్వారా ఇతర ప్రాంతాల రోగులు ఇబ్బందులు పడుతున్నారని, వారి సౌకర్యార్థం కుడా నిధులతో ఒకే చోట మెడికల్ జోన్‌లు ఏర్పాటు చేసి అందుబాటులో ఉంచుతామన్నారు. కుడాకు జీడబ్ల్యుఎంసీ నుంచి అద్దెల ద్వారా రూ.50కోట్లు రావాలని, ఆ ఫండ్‌తో నగరాన్ని సుందరీకరిస్తామన్నారు. కుడా పరిధిలో చాలా చోట్ల అనుమతులు లేకుండా లేఔట్ ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని, వాటిని గుర్తించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటి వరకు కుడా వెబ్‌సైట్ మూతబడి ఉందని, దానిని పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. వెబ్‌సైట్ ద్వారా ఎల్ఆర్ఎస్ చెల్లింపులతో పాటు కుడా అభివృద్ధి పనుల డాటా నిక్షిప్తం చేయవచ్చని అన్నారు. ప్రస్తుతం కుడాలో సిబ్బంది తక్కువగా ఉన్నారని, త్వరలో ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు మరో 50 మంది సిబ్బందిని నియమిస్తామని వెల్లడించారు. కుడా అంటేనే ప్లాట్లు, డబ్బులు, లంచాలు, అక్రమాలు అనే ప్రచారం ఉందని, తమ హయాంలో ఎలాంటి అక్రమాలకు తావులేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలా తమ పాలన ఉండబోదని ప్రజలు గుర్తించాలని, సిబ్బంది సైతం తప్పు చేస్తే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

రూ.850 కోట్ల పనులకు ప్రతిపాదనలు

ఇటీవల హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలో కుడా అభివృద్ధి పనులకు రూ.850 కోట్ల నిధులు కావాలని కోరామని, ఇప్పటికే రూ.300కోట్లు విడుదలయ్యాయన్నారు. మిగతా పనులను బట్టి నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. రూ.500కోట్లు ఇన్నర్ రింగ్‌రోడ్డు, రూ.50కోట్లు భద్రకాళి మాడవీధులు, రూ.120కోట్లు వరంగల్ బస్‌స్టేషన్ నిర్మాణం, రూ.50కోట్లు కాళోజీ కళాక్షేత్రం, రూ.50కోట్లతో గుండు చెరువు అభివృద్ధి పనులు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కుడా పీవో అజీత్‌రెడ్డి, మురళీధర్, భీంరావుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

గుట్కా విక్రయాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

వరంగల్ క్రైం, జూలై 10: మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీట్‌బజార్‌లో బి.మహేందర్ నిషేధిత గుట్కా విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. బీట్ బజార్‌లో వ్యాపారం చేసుకుంటున్న మహేందర్ అనే వ్యక్తి వద్ద నిషేధిత గుట్కా విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారంతో దాడులు చేశారు. రూ.2లక్షల 61వేల గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని ఏసీపీ మధుసూధన్ ధ్రువీకరించారు.


స్వాధీనం చేసుకున్న గుట్కాలతో పోలీసులు

సముద్రాల పురుషోత్తమచార్య ఇక లేరు



హనుమకొండ కల్చరల్, జూలై 10: హనుమకొండ ఎక్సైజ్‌కాలనీలోని శ్రీ వెంకటేశ్వరాలయంలో నాలుగు దశాబ్దాలుగా స్థానాచార్యులుగా పనిచేస్తున్న సముద్రాల పురుషోత్తమచార్య (87) మంగళవారం రాత్రి వృద్ధాప్య, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఎక్సైజ్‌కాలనీలోని స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఆయన భార్య రంగనాయకమ్మ రెండేళ్ల కిందటే మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వృత్తిరీత్యా నీటిపారుదల శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా 1996లో ఉద్యోగ విరమణ చేశారు. ఆధ్యాత్మిక ప్రవచకుడిగా శ్రీ వైష్ణవ సంప్రదాయ ఆచార పరిరక్షకుడిగా ఉభయ వేదాంత పండితుడిగా, ఆధ్యాత్మిక భావజాలం ఉన్న ఆయనను.. కవిశాబ్దిక కేసరి నల్లాన్ చక్రవర్తుల రఘునాథచార్యస్వామి వెంకటేశ్వర ఆలయానికి పురుషోత్తమచార్యను స్థానాచార్యగా నియామకం చేశారు. అప్పటి నుంచి ఆలయంలో చుట్టుపక్కలకు కాలనీ చెందిన వేలాది మందికి ఆధ్యాత్మిక ఆచార్యుడిగా భక్తుల మన్ననలు అందుకున్నారు. బుధవారం మధ్యాహ్నం హనుమకొండ వికాస్ నగర్ ప్రాంతంలోని శ్మశాన వాటికలో ఆయన పెద్ద కుమారుడు రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీధరాచార్యులు అంత్యక్రియలను నిర్వహించారు. పురుషోత్తమాచార్య మరణ వార్త ఎక్సైజ్ కాలనీ పరిసర ప్రాంత భక్తులను తీవ్ర దుంఖంలో ముంచెత్తింది. ఈయన మృతితో ఓరుగల్లు నగరం గొప్ప ఆధ్యాత్మికవేత్తను కోల్పోయిందని సత్ సంప్రదాయ పరిరక్షణ సభ కార్యదర్శి సముద్రాల శఠగోపాచార్య విదేశాలనుంచి సంతాపం ప్రకటించారు. వికాస తరంగిణి ఉమ్మడి జిల్లా చైర్మన్ డాక్టర్ బచ్చు రాధాకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ కొక్కండ వెకంట నర్సయ్య, తదితర అనేక మంది పెద్దయ్యగారు మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

ఆలయభూముల కబ్జాపై లోకాయుక్త విచారణ

హనుమకొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంలోని ఐదు దేవాలయాలకు చెందిన సుమారు 20.39 ఎకరాల భూమి కబ్జాపై బుధవారం లోకాయుక్తలో విచారణ జరిగింది. పద్మాక్షి దేవాలయం భూమి 6.22ఎకరాలు, వీరపిచ్చమాంబ మఠం భూమి 30 గుంటలు, సిద్దేశ్వరాలయానికి సంబంధించిన 2.24 ఎకరాలు, వేణుగోపాలస్వామి భూమి 1.11ఎకరాల అక్రమణలపై వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, కాకతీయ వారసత్వ సంపద పరిరక్షణ సమితి కన్వీనర్ చీకటి రాజు చేసిన ఫిర్యాదు మేరకు లోకాయుక్త విచారణ జరిపింది. చక్రపాణి, రాజుతోపాటు దేవాదాయ శాఖ పక్షాన ముగ్గురు ఈవోలు విచారణకు హాజరయ్యారు. ప్రతీ సారి దేవాదాయ శాఖ నుంచి కింది స్థాయి అధికారులే హాజరుకావడం పట్ల లోకాయుక్త జస్టిస్ సీవీ రాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసును ఈనెల 15కు వాయిదా వేస్తూ ఆ రోజుదేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ తప్పకుండా హాజరు కావాలని ఆదేశించారు.





పెనుగోలుకు వెళ్లేందుకు వాగు దాటుతున్న వైద్యాధికారి మధుకర్, సిబ్బంది, వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న మధుకర్ బృందం

కాలినడకన వెళ్లారు.. వాగులు దాటారు..

అడవి పల్లెల్లో వైద్యసేవలందించిన డాక్టర్లు, సిబ్బంది

వాజేడు/గూడూరు, జూలై 10: ఆ వైద్యాధికారులు, సిబ్బంది తాము ఎంచుకున్న వృత్తిపై నిబద్ధతను చాటుకున్నారు. అందరిలాగా తమకెందుకులే అనుకోలేదు. ఎనిమిది గంటలు డ్యూటీ చేసుకుంటే తమ జీతం తమకు వస్తుందిలే అనుకోలేదు. సరైన రవాణా సౌకర్యాల్లేక.. మెరుగైన వైద్యం పొందలేక జ్వరాలతోనే మంచాల్లో మూలుగుతూ ఉండే అడవి పల్లెవాసులకు అండగా నిలవాలనుకున్నారు. రోడ్లు లేకపోయినా.. వంతెనలు లేకపోయినా.. అడవి దారిలో కిలోమీటర్ల మేర నడిచారు. వాగులు దాటారు. అడవి బిడ్డలకు వైద్యసేవలు అందించారు. ములుగు జిల్లా వాజేడు మండలం, మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం అయోధ్యపురం ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది బుధవారం అడవి బాటలో వెళ్లి.. వాగులు దాటి వైద్యసేవలందించారు.

● తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అడవుల్లో దట్టమైన అటవీ ప్రాంతంలో ఎటువంటి రవాణా సౌకర్యం లేని మారుమూల కుగ్రామమైన వాజేడు మండలంలోని పెనుగోలు గ్రామానికి వాజేడు వైద్యాధికారి డాక్టరు అల్లి మధుకర్ తన సిబ్బందితో కలిసి కాలినడకన వాగులు, వంకలు, కొండలు దాటుకుంటూ వెళ్లారు. అయితే మంగళవారం మధ్యాహ్నమే వాజేడు పీహెచ్‌సీ నుంచి 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెనుగోలుకు కాలినడకన బయలుదేరిన ఆ బృందం గుమ్మడిదొడ్డి మీదుగా ప్రమాదకరమైన నల్లందేవి వాగు దాటి రాత్రికి పెనుగోలు చేరుకున్నారు. ఆ తర్వాత బుధవారం ఉదయం వైద్యశిబిరం నిర్వహించి జ్వరాలతో బాధపడుతున్న గిరిజను లకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పెనుగోలులో ప్రస్తుతం 10ఇళ్లు ఉండగా 39 మంది జనాభా ఉన్నారు. 15 ఏళ్ల లోపు చిన్నారులు 12మంది, ఏడాదిలోపు చిన్నారి ఒకరు ఉండగా ప్రస్తుతం ముగ్గురు జ్వరాలతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న డాక్టర్ మధుకర్ వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్ మధుకర్ వెంట హెచ్‌ఏలు చిన్నవెంకటేశ్వర్లు, శేఖర్, ఎల్‌టీలు లఖన్, రజినీకాంత్, డీఏవో ప్రశాంత్, ఆశా కార్యకర్త సమ్మక్క, గుమ్మడిదొడ్డికి చెందిన కారం ఆదినారయణ, జజ్జరి ఆశోక్‌లు ఉన్నారు.

● గూడూరు మండలంలోని అయోధ్యపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది మండలంలోని ఏజెన్సీ ప్రాంతమైన మట్టెవాడ శివారు దొరవారి తిమ్మాపురంలో వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత మట్టెవాడ నుంచి ట్రాక్టర్‌లో కొత్తగూడ మండలం కార్లాయి వరకు వెళ్లి.. అక్కడ్నుంచి సుమారు 8 కిలోమీటర్ల మేర అడవి ప్రాంతంలో నడుస్తూ వాగులు దాటుకుంటూ దొరవారి తిమ్మాపురానికి చేరుకున్నారు. అయోధ్యపురం పీహెచ్‌సీ వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో అక్కడకు వెళ్లిన వైద్యసిబ్బంది 42 మంది ఆదివాసీలకు వైద్య పరీక్షలు నిర్వహించి జ్వరం తీవ్రంగా ఉన్నవారిని గుర్తించి, రక్తనమూనాలు సేకరించారు. ఉచితంగా ముందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో డాక్టర్లు దేవేందర్, నరేష్, హెచ్‌ఈవో లోక్యానాయక్, సూపర్‌వైజర్లు అరుణమ్మ, హేమలత, ఎస్ఎన్.రజిత, హెల్త్ అసిస్టెంట్‌లు సర్దార్‌బాబు, లాలు, ఏఎన్ఎం కవిత, ఆశా వర్కర్ సీతమ్మ పాల్గొన్నారు.





దొరవారి తిమ్మాపురానికి వాగుదాటుతూ వెళ్తున్న వైద్యులు, సిబ్బంది, దొరవారి తిమ్మాపురంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గ్రూప్-1 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

హనుమకొండ కలెక్టరేట్, జూలై 10: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు మెయిన్స్ పరీక్ష కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెయిన్స్‌కు అర్హత సాధించిన ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 19వ తేదీలోగా సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని

తెలిపారు. హైదరాబాద్, ఖమ్మం జిల్లాలలో 75రోజుల పాటు శిక్షణ ఇస్తామని, ప్రతీ సెంటర్‌కు 150 మంది చొప్పున శిక్షణ ఉంటుందని, కోచింగ్ వ్యవధిలో ప్రతీ అభ్యర్థికి రూ.5000 సైఫండ్ మంజూరు చేస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 040-24071178 నెంబర్‌ను సంప్రదించాలని డైరెక్టర్ ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.

బాధ్యతలు స్వీకరించిన జంగా రాఘవరెడ్డి



తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న జంగా రాఘవరెడ్డి

హనుమకొండ సిటీ, జూలై 10: తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియమితులైన జంగా రాఘవరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని పరిశ్రమల భవన్‌లో స్వీకరణ కార్యక్రమం జరిగింది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో పాటు రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఇతర కాంగ్రెస్ నేతలు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నాయకుల అభినందనల మధ్య ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలకు రాఘవరెడ్డి కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్లు చెప్పారు.

మంత్రి పొంగులేటిని కలిసిన టీజీవోలు



మంత్రి పొంగులేటితో టీజీవోలు

హనుమకొండ కలెక్టరేట్, జూలై10: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో టీజీవోస్ నాయకులు కలిశారు. ఎన్నికలకు ముందు బదిలీపై వెళ్లిన రెవెన్యూ, ఇతర డిపార్ట్‌మెంట్ ఉద్యోగులను వారి జిల్లాలకు బదిలీ చేయాలని ఈ సందర్భంగా టీజీవో నాయకులు మంత్రికి విన్నవించారు. అలాగే జయశంకర్ భూపాలపల్లిలో టీజీవో భవనానికి నిధులు కేటాయించాలని కోరారు. మంత్రి పొంగులేటిని కలిసిన వారిలో టీజీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు, రాష్ట్ర బాధ్యులు పరమేశ్వర్ రెడ్డి, యాదగిరి, టీజీవో నాయకులు ఈగ వెంకటేశ్వర్లు, సురేష్‌కుమార్‌లు ఉన్నారు.

ఎంజీఎం సూపరింటెండెంట్‌కు నోటీసులు

లెక్కలు సమర్పించకపోవడంతో ఆడిట్ అధికారుల చర్య

వరంగల్ మెడికల్, జూలై 10: వరంగల్ ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌కు ఆడిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఎంజీఎంలో మందులు, భవన నిర్మాణ పనులు, స్టేషనరీ, అభివృద్ధి నిధులు, మెడికల్ ఎక్విప్‌మెంట్ కొనుగోళ్లకు సంబంధించిన ఆడిట్ భారీగా తేడా వచ్చింది. దీంతో 30 అంశాలపై లెక్కలు, దానికి సంబంధించిన బిల్లులు ఇవ్వాలని ఆడిట్ అధికారులు గతంలోనే నోటీసులు ఇచ్చారు. దానికి సమాధానం రాకపోవడంతో మరోసారి నోటీసులు ఇచ్చారు. లెక్కలు, బిల్లులు ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని నోటీసులో హెచ్చరించారు. కాగా, ఎంజీఎంలో మెడికల్ ఎక్విప్‌మెంట్ కొనుగోళ్లలో కోట్లాది రూపాయల అక్రమాలు జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. సూపరింటెండెంట్ లెక్కలు ఇవ్వకపోవడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆడిట్ అధికారుల నోటీసులకు సమాధానం ఇవ్వకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేసి డబ్బులు రికవరీ చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఈ వ్యవహారం వరంగల్ మెడికల్‌వర్గాల్లో సంచలనంగా మారింది. గతంలో ఉన్న సూపరింటెండెంట్‌పై అనేక ఆరోపణలు రావడంతో రెండేళ్ల కిందట చంద్రశేఖర్‌ను సూపరింటెండెంట్‌గా ప్రభుత్వం నియమించింది. అయితే ఈయన కూడా అదే దారిలో నడవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



మార్కెట్ కార్యదర్శి నిర్మలను సత్కరిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

ఏనుమాముల మార్కెట్ కార్యదర్శిగా నిర్మల బాధ్యతల స్వీకరణ

వరంగల్ సిటీ, జూలై 10: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత కార్యదర్శిగా పోలెపాక నిర్మల బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల గతంలో ఏనుమాముల మార్కెట్ కార్యదర్శి(ప్యాక్)గా పనిచేశారు. మార్కెట్ అధికారులు, సిబ్బంది, వ్యాపారులు, కార్మికులు, రైతులతో ఆమెకు మంచి అనుబంధం ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మార్కెట్ కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న నిర్మల పదోన్నతిపై వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు బదిలీ అయ్యారు. ఇక్కడ కార్యదర్శిగా పనిచేసిన సంగయ్య ఉద్యోగ విరమణ చేయడం, ఎన్నికల కోడ్ ఉండటంతో వెంటనే ఆస్థానాన్ని భర్తీ చేయడానికి అవకాశం లేకపోయింది. దీంతో జమ్మికుంట మార్కెట్ కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న గుగులోతు రెడ్డికి(ఫుల్ అడిషనల్ చార్జ్) వరంగల్ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు పూర్తి స్థాయి కార్యదర్శిని నియమించే క్రమంలో భాగంగా పోలెపాక నిర్మలకు పదోన్నతి కల్పించి కార్యదర్శిగా నియమించారు. దీంతో బుధవారం మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా నిర్మల పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎట్టకేలకు పూర్తి స్థాయి కార్యదర్శిని నియమించినప్పటికీ మార్కెట్ కమిటీకి పాలకవర్గాన్ని నియమించకపోవడంతో రైతులు, వ్యాపారులు కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కార్యదర్శిని కలిసిన ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

వరంగల్ వ్యవసాయ మార్కెట్ పూర్తి స్థాయి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన పోలెపాక నిర్మలను వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి, ప్రతినిధులు బుధవారం ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య, ఉపాధ్యక్షులు మొగిలి చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి మడూరు వేదప్రకాశ్, సంయుక్త కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్, కోశాధికారి అల్లె సంపత్, కార్యవర్గ సభ్యులు, సంబంధిత సెక్షన్లప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కేయూ సీఎస్ఈ, ఐటీ బీవోఎస్ చైర్‌పర్సన్‌గా అర్చన



కృష్ణయ్య, అర్చనకు నియామక పత్రాలను అందిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్, జూలై 10: కాకతీయ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(సీఎస్ఈ, ఐటీ) విభాగం నూతనబోర్డు ఆఫ్ స్టడీస్ (బీవోఎస్) ఛైర్‌పర్సన్‌గా డాక్టర్ టి.అర్చన నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి అర్చనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు బీవోఎస్ ఛైర్‌పర్సన్‌గా కొనసాగిన కె.పద్మజ నుంచి అర్చన బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ అర్చన 2010లో వర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. అర్చన గతంలో విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల కొత్తగూడెం హాస్టల్ సంయుక్త సంచాలకులుగా, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఇన్‌చార్జిగా పనిచేశారు. డాక్టర్ అర్చన పర్యవేక్షణలో ఇద్దరు పరిశోధనలు కొనసాగిస్తున్నారు. 15కుపైగా అంతర్జాతీయ, జాతీయ సదస్సుల్లో పరిశోధన పత్రాలను ప్రచురించారు. డాక్టర్ అర్చన ప్రస్తుతం విశ్వ విద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల కొత్తగూడెంలో సంయుక్త సంచాలకులగా పనిచేస్తున్నారు. అర్చనను పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

సంస్కృత విభాగం చైర్మన్‌గా కృష్ణయ్య

కాకతీయ యూనివర్సిటీ సంస్కృతం విభాగం నూతన బోర్డు ఆఫ్ స్టడీస్ (బీవోఎస్) ఛైర్మన్‌గా డాక్టర్ ఈ.కృష్ణయ్య నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి కృష్ణయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు బీవోఎస్ ఛైర్మన్‌గా కొనసాగిన పింగళి కళాశాల సంస్కృత విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేశ్వరి నుంచి బాధ్యతలు స్వీకరించారు. కృష్ణయ్యను పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

పొగతో ఉక్కిరి బిక్కిరి



తొడిమెలను కాల్చిన దృశ్యం

కోల్ట్ స్టోరేజీల పక్కన కుప్పలుగా పోసిన తొడిమెలు

● ఏనుమాముల మార్కెట్ ప్రాంతంలో మిర్చి తొడిమెల కాల్చివేత ● ఘాటు పొగతో తీవ్ర ఇబ్బంది పడుతున్న సమీప ప్రజలు
● ఊపిరితిత్తుల సమస్యల బారిన పడుతున్న వైనం ● ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వ్యాపారులు ● కనిపించని పారిశుధ్య అధికారులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 10: వారంత నిరుపేదలు.. గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక కష్టాన్ని నమ్ముకుని పొట్టచేత పట్టుకుని కట్టుబట్టలతో నగరానికి వచ్చి కష్టాల కడలిలో కాలం వెల్లదీస్తున్నారు. వారిని పేదరికం వదిలినా.. మిర్చి ఘాటు కాలుష్యం మాత్రం వదలకుండా ఆరోగ్యాలను క్షీణింపజేస్తోంది. దీంతో శ్వాసకోశ వ్యాధులు అస్తమా, టీబీ, దగ్గు, దమ్ము, క్షయవ్యాధులతో పాటు గుండె పోటుకు గురవుతున్నారు. ఇదంతా ఆసియా ఖండంలోనే అతిపెద్ద మార్కెట్‌గా పేరుగాంచిన ఏనుమాముల మార్కెట్ చుట్టుపక్కల ప్రాంతాల కాలనీలలో జరుగుతోంది.

సాయంత్రం అయ్యిందంటే ఏనుమాముల చుట్టుపక్కల ప్రాంతం కాలనీలో కాలుష్యంతో కమ్ముకుపోతోంది. అడ్తిదారులు, సంపన్న వర్గాలు ప్రజల ప్రాణాలు లెక్క చేయకుండా మిర్చి తొడిమెలు మంటల్లో కాలుస్తూ ప్రజల ప్రాణాలకు ముప్పు తెస్తున్నారు. యేడాదిలో ఆరు మాసాలు మిర్చి సీజన్‌లో చుట్టుపక్కల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన మిర్చి తొలడిమెలు తీసి మార్కెట్ పరసర ప్రాంతాల్లోని కోల్డ్ స్టోరేజీలు, మిర్చి కల్లాల వద్ద రాత్రి సమయాల్లో కాలుస్తుండడంతో సమీప ప్రజలకు ప్రాణసంకటంగా మారుతోంది. మార్కెట్ పరిసర కాలనీలైన గ్రేటర్ 14వ డివిజన్ ఎన్‌టీఆర్‌నగర్, గాంధీనగర్, సుందరయ్యనగర్, బాలాజీనగర్, ఏనుమాముల, దేశాయిపేటతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలలో సాయంత్రం సమయంలో మిర్చి తొడిమెలు ఘాటు కాలుష్యం కోరలు చాస్తోంది. తొడిమెలు కాల్చిన కాలుష్యపు ఘాటు ప్రజలను నిద్రకు దూరం చేస్తోంది. ఈ ప్రాంతంలో నివసించే వారు కాలుష్య కోరలకు బలవుతూ శ్వాసకోష, గుండె జబ్బులకు గురవుతున్నారు.

200కు పైగా మిర్చి కల్లాలు

ఏనుమాముల మార్కెట్‌లో మిర్చి కల్లాలు 200కు పైగా విస్తరించి ఉన్నాయి. అడ్తిదారులు, వ్యాపారులు కోల్డ్‌స్టోరేజీల ఆవరణలో వందలాది టన్నుల మిర్చిని డంప్ చేయడంతో పాటు ఆరబోస్తున్నారు. వీటిని సమీపగ్రామాల్లో నివసించే మహిళా కూలీలతో తొడిమెలు తీయిస్తున్నారు. తీసిన తొడిమెలను కోల్డ్ స్టోరేజీల బయటపోసి మిర్చిని ఎండబెట్టి కారంపొడి చేసి ఇతర ప్రాంతాలకు, దేశాలకు ఎగుమతి చేస్తారు. అయితే నిర్లక్ష్యంగా బయటపోసిన తొడిమెలను నిర్వాహకుల ఆదేశాల మేరకు అక్కడ పని చేసే కూలీలు సాయంత్రం సమయంలో నిప్పుపెడుతుంటారు. ఇక దాంట్లోంచి వచ్చే పొగతో ఆ సమీప ప్రాంతాల్లో నివసించే వారికి నరకం కనబడుతోంది.

పత్తాకు లేని పారిశుధ్య సిబ్బంది

ఏనుమాముల మార్కెట్ సమీపంలో మిర్చి కల్లాల వద్ద చాలా కాలంగా ఇదంతా జరుగుతున్నా పారిశుధ్య కార్మికులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. మునిసిపల్ సిబ్బంది సైతం మిర్చి ఘాటుకు భయపడి అటుగా వెళ్లడం లేదనే విమర్శలున్నాయి. ఈ ప్రాంతాన్ని పరిశీలించే శానిటరీ సూపర్‌వైజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ లోపం వల్లనే తొడిమెల కాల్చివేతకు వ్యాపారులు పూనుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. కోల్డ్ స్టోరేజీల బయట పడేసిన మిర్చి తొడిమెలను ముందస్తుగా గుర్తించి మునిసిపల్ ట్రాక్టర్లు, డంపర్‌బిన్‌ల ద్వారా తరలించాల్సి ఉండగా, ఈ ప్రాంతంలో పనిచేస్తున్న జవాన్లు నెలవారి మామూళ్లకు ఆశపడి వ్యాపారుల ఆకృత్యాన్ని పట్టించుకోవడం లేదని చుట్టుపక్కలవారు మండిపడుతున్నారు. ఇప్పటికైనా మిర్చి తొడిమెలను కాల్చే వారిని బల్దియా సిబ్బంది గుర్తించి జరిమానాలు విధించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఊపిరితిత్తుల వ్యాధులకు గురవుతారు..

డాక్టర్ ఆర్.సురేష్‌కుమార్. చెస్ట్ ఫిజిషియన్



మిరప తొడిమెలనుంచి వచ్చే ఘాటు పొగ పీల్చుకోవడం వల్ల ప్రధానంగా ఊపిరితిత్తుల వ్యాధితోపాటు నిమోనియా వస్తుంది. కండ్లు ఎర్రగా మారుతాయి. ముక్కులో ఎలర్జీ వచ్చి తుమ్ములు, దగ్గు వస్తాయి. ఇంకా జలుబుతో పాటు ఆయాసం వస్తుంది. కొద్ది రోజుల తర్వాత అస్తమాకు గురయ్యే అవకాశాలు ఉంటాయి. శరీరంపై దద్దుర్లు, కురుపులు ఏర్పడి మంటతో కూడిన దురద ఏర్పడుతుంది. ఇంకా దీర్ఘకాళిక వ్యాధులైన హైపల్ సెన్సివిటీ, బీపీ వచ్చే అవకావాలు ఉంటాయి. ఈ పొగ నుంచి ప్రజలు దూరంగా ఉంటేనే ఆరోగ్యానికి మంచిది.

రాత్రి అయిందంటే పొగతో చస్తున్నాం..

ఉడుత కాంతమ్మ, ఎన్టీఆర్ నగర్



రాత్రి అయ్యిందంటే వందలాది మిర్చి కల్లాలు రోడ్లు, గోదాముల ముందు పెద్ద ఎత్తున వెలుస్తాయి. వందల మంది కూలీల ద్వారా తీసిన తొడిమెలు అక్కడే వదిలేసి వెళ్లడంవల్ల రాత్రి సమయాల్లో నిప్పు అంటిస్తారు. తెల్లవారేవరకు ఈ ప్రాంతం ఘాటు పొగతో కప్పబడి ఉంటుంది. ఇప్పటికే చాలామంది రోగాల బారిన పడ్డారు. కొందరు గుండెపోటుకు గురయ్యారు.

సోడషపల్లిలో నకిలీ నోటు కలకలం

వేలేరు(ధర్మసాగర్), జూలై 10: హనుమకండ జిల్లా వేలేరు మండలం సోడషపల్లి పోస్టు ఆఫీసులో నకిలీ ఐదు వందల నోటు ఇచ్చారని బాధితుడు ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఆరోపించారు. సోడషపల్లి గ్రామానికి చెందిన రమణారెడ్డి అనే వృద్ధుడు.. వృద్ధాప్య పింఛన్ కోసం ఐదు రోజుల కిందట స్థానిక పోస్టు ఆఫీసుకు వెళ్లాడు. పింఛన్ తీసుకుని తిరిగి ఇంటికి వచ్చాడు. ఐదు రోజుల తర్వాత గ్రామంలోని ఓ దుకాణానికి వెళ్లగా రూ.500 నోటు చెల్లదని షాపు యజమాని చెప్పడంతో అక్కడ ఉన్న వారు నోటును గమనించి నకిలీనోటు అని వృద్ధుడికి చెప్పారు. దీంతో విషయన్ని బాధితుడు తన కుమారుడు ప్రభాకర్‌రెడ్డికి తెలుపడంతో ఆయన పోస్టు ఆఫీసుకు ఫోన్ చేసి నకిలీ నోటు ఇచ్చారని తెలిపాడు. దీంతో సదరు పోస్టాఫీసు ఉద్యోగి దురుసుగా ప్రవర్తించారని బాధితుడు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. నకిలీ నోటు పంపిణీ చేసిన పోస్టు ఆఫీసు ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

యువతి అదృశ్యం

ధర్మసాగర్, జూలై 10: ఓ యువతి అదృశ్యమైన సంఘటన హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి గ్రామ శివారు చెటాల్ తండాకులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణగిరి గ్రామ శివారు చెటాల్ తండాకు చెందిన గుగులోతు కల్పన (22)అనే యువతి ఈనెల 1న హనుమకొండలో పరీక్ష రాయడానికి ఇంటి నుంచి వెళ్లింది. పరీక్ష రాయడానికి వెళ్లి సాయత్రం అయినా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు కల్పన ఆచూకీ కోసం బంధువుల ఇళ్లలో వెతికారు. అయినప్పటికీ ఆచూకీ దొరకకపోవడంతో ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్‌లో యువతి తండ్రి భిక్షపతి ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

కాజీపేట, జూలై 10: కాజీపేట విద్యానగర్ ప్రభుత్వ పాఠశాలను బుధవారం ఇన్‌చార్జి డీఈవో డి. చలపతిరావు సందర్శించారు. ఉపాధ్యాయుల పనితీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎన్‌ఆర్‌ఐ సదానందం కూతును జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని రూ.37 వేల విలువైన నోట్‌బుక్స్, స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందించారు. ఆ తర్వాత పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం డీఈవోను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జి.సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఇన్‌చార్జి డీఈవో

నోట్ బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

హనుమకొండ కల్చరల్, జూలై 10: రోటరీక్లబ్ ఆఫ్ హనుమకొండ ఆధ్వర్యంలో బుధవారం హసన్‌పర్తి మండలం జయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. రోటరీ క్లబ్ నాయకుడు మహిపాల్‌రెడ్డి అందించిన రూ.30వేలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి ప్రవీణ్ కుమార్, కోశాధికారి విజయ్‌కుమార్‌తోపాటు రోటరీ జిల్లా నేత కాయితపు ఇంద్రసేనారెడ్డి, మహిపాల్‌రెడ్డి దాతృత్వాన్ని ప్రశంసించారు.

● మడికొండ: గ్రేటర్ వరంగల్ 45వ డివిజన్ అయోధ్యపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సత్యసాయి సేవా సమితి కాజీపేట మండలశాఖ సభ్యులు విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యా సామ గ్రి అందజేశారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు శారద అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు గండి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మానవసేవే మాధవసేవ అని ప్రతీ ఒక్క రూ సేవా మార్గంలో నడవాలన్నారు. ఆధ్యాత్మికత మనిషిని మానవత్వం వైపు నడిపిస్తుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సేవా భావంతో పని చేసినప్పుడే విద్యార్థుల జీవితాలతో పాటు సమాజం బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో సేవా సమితి ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్లు సత్యనారాయణరెడ్డి, బాల వికాస విద్యాజ్యోతి కాజీపేట మండల మహిళా కో ఆర్డినేటర్ పద్మ, ఉపాధ్యాయులు మన్నె చంద్రయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈసీ సభ్యుడు నిమ్మ సుదర్శన్‌కు సన్మానం



సుదర్శన్‌ను సన్మానిస్తున్న డాక్టర్ కొట్టే భాస్కర్, డాక్టర్ సంగాల ఎఫ్రామ్‌రాజ్ తదితరులు

కేయూ క్యాంపస్, జూలై 10: కాకతీయ యూనివర్సిటీ నూతన పాలక మండలి సభ్యుడు, వర్సిటీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్‌ను కేయూ దూరవిద్య కేంద్రం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే భాస్కర్ నేతృత్వంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిమ్మ సుదర్శన్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బొల్లికొండ వీరేందర్, సంగాల ఎఫ్రామ్‌రాజ్, ఆకులపల్లి మధు, బొల్లెపాక ప్రభాకర్, డాక్టర్ ఎడ్ల ప్రభాకర్, డాక్టర్ హరిప్రసాద్, నల్ల ప్రవీణ్, గుజ్జుల శ్రీనివాస్, డాక్టర్ ఆకునూరి సుదయ్య డాక్టర్ ఎ.రవీందర్, డాక్టర్ తాటికాయల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరాఫరా బంద్

వరంగల్ కార్పొరేషన్, జూలై 10: హనుమకొండ పరిధిలోని ఎన్‌జీవోఎస్ కాలనీ కాలనీ వద్ద మిషన్ భగీరథ పనులు జరుగుతున్న నేపథ్యంలో గురువారం ఒక్క రోజు నీటి సరఫరా బంద్ చేయనున్నట్లు ఇంజనీరింగ్ విభాగం ఈఈ రాజయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ వాల్వ్ దెబ్బతినడం వల్ల నీటి సరాఫరాలకు అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు సహకరించాలని రాజయ్య కోరారు.

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్

కార్మికులను పర్మినెంట్ చేయాలి

సుబేదారి, జూలై 10: కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బొల్లారం సంపత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాకు సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అలకుంట యాకయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బొల్లారం సంపత్ మాట్లాడుతూ.. కార్మికులందరికీ రూ.26 వేలు కనీస వేతనం నిర్ణయించాలని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా నేతలు యాస బాబు, సుధాకర్, రవి, మంజుల, శ్రీలత, శారద, రమాదేవి, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

● హనుమకొండ టౌన్ : కార్మికుల హక్కులను కాలరాస్తూ యాజమాన్యాలకు తొత్తులుగా పాలకవర్గాలు పనిచేస్తున్నాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా కార్మికుల డిమాండ్స్ డే నిర్వహించి, తహసీల్దార్‌లకు మెమోరాండం ఇవ్వాలని సీఐటీయూ ఆల్ ఇండియా కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం హనుమకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పలయ్య మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని విమర్శించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా, అన్నిరకాల కార్మికులకు కనీస వేతనం రూ.26,000 నిర్ణయించాలన్నారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, 8 గంటల పని దినం అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు మంద మల్లేశం, మాతంగి నవనీత, బొట్ల కుమార్, నారాయణ, శ్రీనువాస్, కళ్యాణి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

● కాజీపేట: కార్మికులందరికీ కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సీఐటీయూ మండల కన్వీనర్ కారు ఉపేందర్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ నిలిపివేయాలి, ఆశ వర్కర్ల పరీక్షలను రద్దు చేసి కనీస వేతనం అమలు చేయాలన్నారు. మీసేవ ఉద్యోగులకు జీవో నంబర్ 60ప్రకారం కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈ డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ బావుసింగ్‌కు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

సీఐటీయూ నాయకులు విజయ్, జీ.మౌళి, ఎం. రాజు, భవాని వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

● ఐనవోలు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా మండల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొత్తూరి ఎసోబు, కొండేటి రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి గబ్బెట యాకయ్యలు మాట్లాడుతూ.. పదేళ్ల కార్మికులకు వ్యతిరేకంగా అమలుచేసిన విధివిధానాలను మళ్లీ అమలు చేయడానికి ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేయాలన్నారు. సమానపనికి సమానవేతనం ఇచ్చి కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. జీవో నెం51ను సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునిగాల శ్రీను, బరిగెల చంద్రయ్య, బొక్కల సుకేందర్, బొక్కల రం జిత్, కొండేటి యాకయ్య, అమర్, ఎలిషా, బరిగెల పుల, వెంకన్న, రూప పాల్గొన్నారు.

వైభవంగా మైసమ్మ తల్లి బోనాలు

వంచనగిరిలో కుటుంబ సమేతంగా పాల్గొన్న మంత్రి కొండా సురేఖ

గీసుగొండ, జూలై 10: కొండా దంపతుల స్వగ్రామమైన గీసుగొండ మండలంలోని వంచనగిరిలో మైసమ్మ తల్లి, రేణుక ఎల్లమ్మ బోనాల వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుతో పాటు కుటుంబసభ్యులు పాల్గొన్నారు. మంత్రి సురేఖ బంగారు బోనం ఎత్తుకొని గ్రామస్థులతో కలిసి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మైసమ్మ తల్లి ఆలయానికి కాలినడకన తరలివెళ్లారు. అనంతరం అమ్మవార్లకు పట్నాలు వేసి బోనాలు సమర్పించి నైవేద్యాలు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారి వద్ద గల కోటమైసమ్మ ఆలయం భక్తులతో రద్దీగా మారింది. మంత్రి పదవి చేపట్టిన తరువాత కొండా సురేఖ కుటుంబసభ్యులతో స్వగ్రామానికి రావడంతో పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు తరలివచ్చి గజమాలతో వారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు తిరుపతి, నందిరాంనాయక్, సీఐలు బాబులాల్, మల్లయ్య, గోపి, ట్రాఫిక్ సీఐ రామకృష్ణ నాయకులు గోపాల నవీన్‌రాజ్, రడం భరత్‌కుమార్, మాజీ ఎంపీటీసీలు రజిత, వీరారావు, మాజీ సర్పంచ్ అనసూర్య, రాజు, గోదాసి సూరయ్య, బొల్లం శివ, కొమ్ముల కిశోర్‌కుమార్, కొండా వెంకన్న, శ్రీనివాస్, సింగరి రాజ్‌కుమార్, గాజర్ల రవి తదితరులు పాల్గొన్నారు.



బంగారు బోనంతో ఆలయానికి వెళ్తున్న మంత్రి కొండా సురేఖ

'దీక్షరంబ్' బ్యాచ్ ప్రారంభం

హనుమకొండ టౌన్, జూలై 10: వాగ్దేవి డిగ్రీ అండ్ పీ జీ కళాశాలలో దీక్షరంబ్ పేరుతో బీకామ్, బీబీఏ ఫస్ట్ సెమిస్టర్ విద్యార్థుల కోసం స్వయం ప్రతిపత్తి బ్యాచ్‌ను ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శేషాచలం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం కళాశాలలో నూతన బ్యాచ్‌కు గుర్తుగా వేడుకలు నిర్వహించామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, జూలై 10: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈ జి.సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని నగరకాలనీ, హనుమాన్‌నగర్, డబ్బాల ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, ఆర్‌ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలోని దర్గా, హౌసింగ్‌బోర్డు కాలనీ, బియాబానీ నగర్ ఏరియాలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

డీఈవోగా వాసంతి బాధ్యతల స్వీకరణ

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 10: హనుమకొండ జిల్లా డీఈవోగా డి.వాసంతి బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలతో బుధవారం ఇన్‌చార్జి డీఈవో డి.చలపతిరావు నుంచి వాసంతి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితోపాటు వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించాలి

ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించా లని డీఈవో వాసంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ప్రతీ పాఠశాలలో పోటీలు నిర్వ హించాలని ప్రధానోపాధ్యాయులకు ఆమె సూచించారు. పాఠశాల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థుల ను ఈ నెల 15న హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనాలని సూచించారు. వివరాల కోసం ప్రోగ్రామ్ ఆర్గనైజర్ మధుసూదన్‌రెడ్డి (98498 34110)ను సంప్రదించాలని తెలిపారు.

కాంగ్రెస్ నేత జగ్గారెడ్డికి మతిభ్రమించింది

టీడీపీ రాష్ట్ర నేత గట్టు ప్రసాద్ బాబు



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న గట్టు ప్రసాద్‌బాబు

వడ్డెపల్లి, జూలై 10: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలంగాణలో పాగా వేయడానికి ప్రయత్నిస్తున్నాడని కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నాడని టీడీపీ రాష్ట్ర నేత, వరంగల్ ఉమ్మడి జిల్లా టీడీపీ పూర్వ అధ్యక్షుడు గట్టు ప్రసాద్ బాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హన్మకొండ సాంబయ్య అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానం మేరకే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రజాభవన్‌కు వచ్చారని తెలిపారు. ఒకప్పుడు చంద్రబాబు మంచి పరిపాలనా దక్షుడని పొగిడిన కాంగ్రెస్ రాష్ట్ర నేతలు జగ్గారెడ్డి, విజయశాంతి, బీఆర్ఎస్ నేత నిరంజన్‌రెడ్డి పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడిన జగ్గారెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుపై అవాక్కులు చవాక్కులు పేలడం దుర్మార్గమని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పార్టీకి గత అసెంబ్లీతో పాటు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కుతో తగిన గుణపాఠం చెప్పినప్పటికీ బీఆర్ఎస్ అధినేతలు కేటీఆర్, హరీశ్‌రావులకు అహం తగ్గలేదని విమర్శించారు. తెలంగాణ గడ్డపై పుట్టిన తెలుగుదేశం పార్టీకి బలమైన ఓటు బ్యాంకు ఉందన్నారు. అందుకే కేసీఆర్‌కు చంద్రబాబు నాయుడి భయం పట్టుకుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరపాక ప్రభాకర్, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు బర్ల యాకూబ్, రాష్ట్ర, జిల్లా నాయకులు రేపూరి వెంకటరెడ్డి, పిట్టల శ్రీనివాస్ ముదిరాజ్, కందుకూరి నరేష్, వెలగందుల రవీందర్‌గుప్తా, కొక్కిరకొండ కుమారస్వామి, బింగి మల్లేశం, కందుకూరి శ్రీనివాస్, నీలం పరశురాం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు కల్పించాలి : ఏబీఎస్

వడ్డెపల్లి, జూలై 10: అసైన్డ్ భూములను పట్టా భూములుగా మార్చి రైతులకు వాటిపై శాశ్వత హక్కులను వెంటనే కల్పించాలని అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కలకోటి మహేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. అసైన్డ్ భూములు కాంగ్రెస్ ప్రభుత్వాల్లో ఇచ్చినవేనని అన్నారు. 1977లో ప్రభుత్వం రూపొందించిన చట్టం ప్రకారం అసైన్డ్ భూములను విక్రయించడం, కొనుగోలు చేయడం, బ్యాంకులలో తనఖా పెట్టుకోవడానికి, బహుమతిగా ఇవ్వడానికి అవకాశం లేకపోవడంవలన పేదలు, అసైన్డ్ రైతులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ అసైన్డ్ భూములపై దశాబ్దకాలంగా ఏబీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తున్నామని చెప్పారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీతో సహా మిగతా పార్టీలు సైతం అసైన్డ్ భూములకు పూర్తిహక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, పేద అసైన్డ్ రైతులకు మేలు జరిగేలా చూడాలని మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని ఆయన కోరారు.సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అసైన్డ్ రైతులకు తగిన న్యాయం చేస్తానని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు.

జంగా రాఘవరెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

మడికొండ, జూలై 10: తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఛైర్మన్‌గా నియమితులై హైదరాబాద్‌లో బాధ్యతలు చేపట్టిన జంగా రాఘవరెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. బుధవారం పలు గ్రామాల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్ చేరుకొని జంగా రాఘవరెడ్డిని కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేశారు. శాలువాలు కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జంగాను కలిసిన వారిలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, మాజీ పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ గంగుల శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు కట్కూరి రమేష్, బిల్ల రవిందర్, వస్కుల శంకర్, బైరి లింగమూర్తి, మెట్టుగుట్ట ఛైర్మన్ పైడిపాల రఘుచందర్, రసజ్ఞ, వస్కుల శ్రీను, పల్లపు అర్జున్, కొప్పుల నవీన్, గడుసు రాజు, సంతోష్, కిరణ్, నాయకులు రాజారపు స్వామి, సంతోష్, మడికొం డ, కడిపికొండ, రాంపేట, టేకులగూడెం, అయోధ్యాపురం, రాంపూర్, ఉనికిచెర్ల తదితర గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

● కాజీపేట: హైదరాబాద్‌లో బుధవారం ఆయిల్, సీడ్స్ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన జంగా రాఘవరెడ్డిని కాజీపేట కాంగ్రెస్ నాయకులు కలిసి బోకే ఇచ్చి అభినందించారు. కాంగ్రెస్ పార్టీకోసం అహర్నిశలు కృషి చేసిన కార్యకర్తలకు కాపాడాలని కోరారు. జంగాను అభినందించిన వారిలో నాయకులు సందెల విజయ్ కుమార్, ఉమ్మడి బాబు, రావుల విద్యాసాగర్, కాసర్ల నగేశ్, మద్దెల శోభారాణి తదితరులు ఉన్నారు.

● ఐనవోలు: తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన జంగా రాఘవరెడ్డికి కాంగ్రెస్ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు. గర్మిళ్లపల్లి తాజామాజీ ఎంపీటీసీ బీరం మౌనికదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌కు తరలివెళ్లి బాధ్యతల స్వీకరణలో పాల్గొని అనంతరం మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు చెప్పారు.

పారిశుధ్య నిర్వహణపై కదిలిన యంత్రాంగం

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



గుడిబండల్ సర్కిల్‌లో రోడ్డు పక్కన ఉన్న చెత్తను తొలిగిస్తున్న బల్దియా సిబ్బంది

హనుమకొండ చౌరస్తా, జూలై 10: 8వ డివిజన్‌లో పడకేసిన పారిశుధ్య నిర్వహణపై బల్దియా సిబ్బంది అప్రమత్తమయ్యారు. గుడిబండల్, టైలర్‌స్ట్రీట్, జంగభద్రయ్యవీధిలోని అంతర్గత రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలిగిచారు. దీనిపై బుధవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కాగా, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ ఆదేశాలతో బల్దియా సిబ్బంది, అధికారులు 8వ డివిజన్‌లోని పలు కాలనీలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రోడ్డు పక్కన చెత్త వేసే వారిని గుర్తించి భారీ జరిమానాలు విధించారు. డివిజన్ పరిధిలో స్వచ్ఛ ఆటోలు ద్వారానే చెత్తను తరలించాలని, రోడ్ల పక్కన ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తే రూ.500నుంచి రూ.5వేల వరకు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అదే విధంగా రోడ్ల పక్కన చెత్త చెదారం వేసిన వాణిజ్య సముదాయలకు చెందిన పలువురికి నోటీసులను అందించారు.

భూకబ్జాలకు పాల్పడితే చర్యలు తప్పవు

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు

బాలసముద్రం, జూలై 10 : అక్రమాలకు, భూకబ్జాలకు పాల్పడితే పార్టీ నాయకులైన, సొంత కొడుకైన కఠిన చర్యలు తప్పవని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. బుధవారం హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధి దారులకు కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలు పేదలకు ఒక వరం అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్టడీసర్కిల్ మం జూరు చేసినట్లు తెలిపారు. హసన్‌పర్తిలో యువతకోసం ఇండోర్‌స్టేడియం మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వరున గంటి అరుణ, జక్కుల రజిత, గూగులోతు దివ్యారాణి పాల్గొన్నారు.

మూడు టిప్పర్లు స్వాధీనం

వరంగల్ క్రైం, జులై 10: అక్రమంగా మొరం తరలిస్తున్న మూడు టిప్పర్లను హసన్‌పర్తి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హసన్‌పర్తి స్టేషన్ పరిధిలోని మడిపల్లి గ్రామ శివారు ప్రాంతంలో ఎటువంటి అనుమతులు లేకుండా మొరం తరలిస్తుండటాన్ని గుర్తించిన పోలీసలు బుధవారం దాడులు చేశారు. సీఐ సురేష్ ఆదేశాల మేర కు ఎస్ఐ రాజు దాడులు నిర్వహించి టిప్పర్లు స్వాధీనం చేసుకున్నారు. మూడు టిప్పర్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ సురేష్ తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ సురేష్ హెచ్చరించారు.

నేడు కాజీపేటలో మునిసిపల్ యూనియన్ సభ

కాజీపేట, జూలై 10: కాజీపేట 47వ డివిజన్‌లోని ఇంపీరియల్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం మునిసిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) కాజీపేట మండల సభ నిర్వహించనున్నట్లు యూనియన్ జిల్లా కార్యదర్శి టీ.ఉప్పలయ్య తెలిపారు. మహాసభకు కార్మికులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కేయూలో ముగ్గురికి సూపరింటెండెంట్లుగా పదోన్నతి

కేయూ క్యాంపస్, జూలై 10: కాకతీయ యూనివర్సిటీ లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ముగ్గురికి సూపరింటెండెంట్‌లుగా పదోన్నతి కల్పిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెస ర్ పి.మల్లారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ చాంబర్‌లో పదోన్నతి పొందిన ఉద్యోగులకు పత్రాలను అందచేసి అభినందించారు. పదోన్నతి పొందిన వారిలో కేయూ పరీక్షల విభాగంలో పనిచేస్తున్న పి.ప్రతాప్, కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న పి.సదాశివుడు, అడ్మినిస్ట్రేషన్ విభాగం (నాన్ టీచింగ్)లో పనిచేస్తున్న కృష్ణమూర్తి అన్నారు. ఈ సందర్భంగా కేయూ అడ్మినిస్ట్రేషన్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రణయ్‌కుమార్, డాక్టర్ కోలా శంకర్, డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ తదితరులు పదోన్నతి పొందిన ఉద్యోగులను అభినందించారు.

ఘనంగా ముజీబ్ హుస్సేని జన్మదిన వేడుకలు

హనుమకొండ కలెక్టరేట్, జూలై10: టీఎన్‌జీవోస్ యూనియన్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముజీబ్ హుస్సేని జన్మదిన వేడుకలు హనుమకొండ కలెక్టరేట్‌లో ఉన్న టీఎన్‌జీవోస్ భవనంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ కేక్ కట్ చేశారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 11 జూలై 2024

కౌన్సెలింగ్

డాక్టర్! మాకు పెళ్లై నాలుగేళ్లు. పిల్లలు లేరు. అందుకు లోపం నాలోనే ఉందని భర్త, అత్తమామలూ వేధిస్తున్నారు. కానీ పరీక్షల్లో నాలో ఎలాంటి లోపం లేదని తేలింది. పిల్లలు కలగడకపోవడానికి కారణం ఆయనలో కూడా ఉండే అవకాశంఉందా?

- ఓ సోదరి, హైదరాబాద్

గర్భం దాల్చడానికి భార్యాభర్తలిద్దరూ సమ బాధ్యులే! గర్భం దాల్చకపోతే అన్ని వేళ్లూ భార్యనే చూపిస్తాయి. కానీ నిజానికి పిల్లలు కలగకపోవడానికి భార్యతోపాటు భర్త కూడా కారణమే! 'పురుషాంగం గట్టిపడి, స్ఖలనమవుతోంది కదా? నాలో లోపమేముంటుంది?' అనుకుంటే పొరపాటు. అంతర్గతంగా ఎన్నో లోపాలుండవచ్చు. గర్భం దాల్చకుండా అడ్డుపడే అంశాలు వీర్యకణాల్లో, వీర్యనాళాల్లో, వృషణాల్లోనూ ఉండొచ్చు. కొన్ని ఇబ్బందులు స్పష్టంగా కనిపించవచ్చు. మరికొన్ని నిశ్శబ్దంగా సమస్యను జటిలం చేస్తూ ఉండొచ్చు. ఇంతకీ పురుషులను ఎప్పుడు అనుమానించాలంటే?

పురుషుల్లోనూ లోపం ఉండొచ్చు

పెళ్లయ్యాక ఎటువంటి గర్భనిరోధక పద్ధతులూ పాటించకుండా సంవత్సరంపాటు భార్యాభర్తలు కలిసినా గర్భధారణ జరగకపోతే కచ్చితంగా వంధ్యత్వాన్ని అనుమానించవచ్చు.

జెనిటల్ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్స్: దీనివల్ల కొంతమందికి వృషణాల్లో నొప్పి ఉంటుంది. ఇంకొందరికి ఉండకపోవచ్చు కూడా! అందుకే ఈ రకమైన ఇన్‌ఫెక్షన్లను 'సైలెంట్ ఇన్‌ఫెక్షన్స్' అంటారు. ఇవి 'సెమెన్ ఎనాలసిస్' చేసినప్పుడు మాత్రమే బయట పడతాయి.

జీవనశైలి సమస్యలు: ఎక్కువ సమయం పాటు కూర్చుని పని చేయడం, ఆహారం, నిద్ర వేళలు సక్రమంగా పాటించకపోవడం లాంటి జీవనశైలి కూడా వంధ్యత్వానికి దారి తీయొచ్చు.

వేరికోసిల్: కాళ్లలో వచ్చే వెరికోజ్ వెయిన్స్ లాంటిదే ఈ సమస్య. కాకపోతే వృషణాల్లోని రక్తనాళాల్లో రక్తం ప్రవహించకుండా నిలిచిపోతుంది. ఇది కూడా నిశ్శబ్ద సమస్యే! ఎవరికి వారు తెలుసుకోవడం కష్టం.



వీర్యకణాల సమస్యలు: వీర్యకణాల రూపం సక్రమంగా ఉంటేనే అండంలోకి చొచ్చుకుపోగలవు. వాటి తల, మధ్య భాగం, తోక... వీటిలో ఏ ఒక్కటిలో లోపం ఉన్నా అండం ఫలదీకరణ కష్టమే!

స్ఖలన సమస్య: కొందరికి వీర్యనాళంలో సమస్య ఉండొచ్చు. ఇలాంటి వాళ్లు స్ఖలించలేరు. స్ఖలనమే జరగకపోతే గర్భధారణ ఎలా సాధ్యపడుతుంది?

హార్మోన్లలో హెచ్చుతగ్గులు: మెదడు నుంచి విడుదలయ్యే ఎఫ్.ఎస్.హెచ్ హార్మోన్ వృషణాలను ప్రేరేపించినప్పుడే వీర్య ఉత్పత్తి జరుగుతుంది. ఈ హార్మోన్ స్రావం తక్కువగా ఉంటే వీర్యం తక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఒక వేళ శరీరంలో ఈ హార్మోన్ స్థాయులు ఎక్కువగా ఉంటే దానర్థం ఈ హార్మోన్‌ను వృషణాలు సరిగా ఉపయోగించుకోకపోవడమే! అలాగే టెస్టోస్టిరాన్ హెచ్చుతగ్గులు లేకుండా సమంగా ఉండాలి. ప్రొలాక్టిన్ ఎక్కువగా ఉన్నా టెస్టోస్టిరాన్ హార్మోన్ తగ్గుతుంది.

వంశపారంపర్యం: వంధ్యత్వం వంశపారంపర్యంగా కూడా సంక్రమిస్తుంది. మేనరికం ద్వారా పుట్టిన పిల్లల్లో ఈ సమస్య సర్వసాధారణం. అలాగే మేనమామ, పెద్దనాన్న... ఇలా దగ్గరి రక్తసంబంధీకుల్లో వంధత్వం ఉన్నా తర్వాతి తరానికి సంక్రమిస్తుంది.

జన్యుపరమైన సమస్యలు: జన్యుపరమైన లోపాల వల్ల వంధత్వం పుట్టుకతోనే సంక్రమించవచ్చు.

సర్జరీలు: బాల్యంలో వృషణాలు, పొత్తికడుపు ప్రదేశంలో సర్జరీలు జరిగినా వంధ్యత్వాన్ని అనుమానించవచ్చు.

ప్రమాదాలు: కొందరికి రోడ్డు ప్రమాదాల వల్ల వీర్యనాళానికి గాయమై, మూసుకుపోవచ్చు. వెన్నుముకకు దెబ్బ తగిలితే ఎజాక్యులేటరీ సిస్టమ్ దెబ్బతింటుంది.

ధూమపానం, మద్యపానం: ధూమపానం వల్ల వీర్యకణ నాణ్యత, వీర్య ఉత్పత్తుల మీద నేరుగా ప్రభావం పడుతుంది. దాంతో వీర్యం దెబ్బతింటుంది. మద్యపానం వల్ల హార్మోన్లలో అవకతవకలు జరిగి వంధత్వం వస్తుంది. చికిత్సలో భాగంగా తీసుకునే మందుల ప్రభావం కూడా మద్యపానం వల్ల తగ్గుతుంది. కాబట్టి వంధత్వానికి మందులు వాడుతూ ఉంటే మద్యపానానికి దూరంగా ఉండాలి.

బిగుతైన లోదుస్తులు: వీటి వల్ల కటి ప్రదేశంలో వేడి పెరిగి, ఆ కారణంగా వీర్యనష్టం జరగవచ్చు.

ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్లు: ల్యాప్ టాప్‌ను ఒడిలో పెట్టుకుని పని చేసే అలవాటు మానుకోవాలి. అలాగే సెల్ ఫోన్‌ను ప్యాంటు ముందు జేబులో ఉంచుకోవడం వల్ల రేడియేషన్ ఫలితంగా వంధ్యత్వం రావొచ్చు.

డాక్టర్ రాహుల్ రెడ్డి,
ఆండ్రాలజిస్ట్, ఆండ్రోకేర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్.

అందరి చూపులు ఆమె వైపే! ఎంచుకునే దుస్తులు మొదలు ధరించే నగల వరకూ అన్నీ అపురూపమే! హల్దీ సెరిమనీలో కూడా పూల దుపట్టా, ఆభరణాలతో అలరించి అందరూ అవాక్కయ్యేలా చేసేసింది అంబానీ కాబోయే కోడలు, **రాధికా మర్చంట్**. రాధికతో పాటు, మెహందీ, హల్దీ వేడుకల కోసం పూల ఆభరణాల ట్రెండ్‌ను ఎంచుకున్న సెలబ్రిటీల గురించి తెలుసుకుందాం!

ఫ్లవర్ పవర్





వినూత్నం

హల్దీ వేడుకలో పసుపుపచ్చని ఎంబ్రాయిడరీ లెహెంగా, అందమైన ఫ్లోరల్ దుపట్టాలో ముద్దబంతి పువ్వులా వెలిగిపోయింది రాధికా మర్చంట్. 90 బంతిపూలు, వేలకొద్దీ నందివర్ధనం మొగ్గలతో అల్లిన వినూత్నమైన దుపట్టాతో పాటు, ఆ దుస్తులతో మ్యాచ్ అయ్యే పువ్వుల జ్యువెలరీ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెల్లని నందివర్ధనం మొగ్గల చెవి దుద్దులు, డబుల్ నెక్లెస్, హాథ్ ఫూల్, కలీరాస్... ఇలా ఆభరణాలన్నీ ఫ్లోరల్ థీమ్‌లో రూపొందాయి. ఆభరణాల తయారీలో నందివర్ధనం మొగ్గలతో పాటు, ఎల్లో బటన్ డైసీ, థాయి రుయి ఫ్లవర్స్‌ను కూడా ఉపయోగించారు. ఫ్లోలర్ ఆర్ట్ స్టూడియో ఫౌండర్, శ్రిష్టి కపూర్ ఈ ఫ్లోరల్ డిజైన్‌ను రూపొందించింది. కళాత్మకత ఉట్టిపడేలా తాజా పూల తాగర్ జాల్ దుపట్టా రూపొందించడం కోసం, ప్రతి పువ్వునూ ఎంతో పక్కాగా అమర్చామనీ, సహజత్వం కోల్పోకుండా, అందంగా కనిపించేలా డిజైన్ చేశామనీ, కళాకారుల బృందం ఈ దుపట్టా రూపొందించడానికి ఒక రోజంతా కష్టపడిందనీ డిజైనర్ శ్రిష్టి అంటోంది.

పువ్వుల తళుకుల్లో...

గతంలో పువ్వుల ఆభరణాలను ఎంచుకున్న తారలు కూడా ఉన్నారు. కత్రినా కైఫ్, మౌని రాయ్, కరిష్మా తన్నా కూడా మెహందీ, హల్దీ వేడుకల కోసం ఇవే ఆభరణాలను ఎంచుకున్నారు. కత్రినా తన హల్దీ వేడుక కోసం సబ్యసాచి లెహెంగా ధరించి, మ్యాచింగ్‌గా సహారా స్ట్రింగ్స్‌తో కూడిన నందివర్ధనం మొగ్గల ఇయర్‌రింగ్స్, డ్రై ఫ్లవర్స్‌తో తయారైన గాజులు, ఉంగరం, కలీరాస్ ధరించింది. కత్రినా ధరించిన ఈ ఫ్లవర్ జ్యువెలరీ ఖరీదు 15 వేలు. కరిష్మా తన్నా కూడా తన తెల్లని సహారా సెట్‌ను నందివర్ధనం పూల ఆభరణాలతోనే మ్యాచ్ చేసింది. ఆల్ వైట్ లుక్ కోసం, సహారా స్ట్రింగ్స్‌తో ఝుంకాలు, పాపటి బిళ్ల, మణికట్టుకు వేలాడుతూ ఉండే కలీరాలు ధరించిందామె. కరిష్మా ధరించిన ఫ్లవర్ జ్యువెలరీ ధర కూడా పదిహేను వేలే! మౌని రాయ్ తన హల్దీ సెరిమనీ కోసం, ఫాక్స్ ఫ్లోరల్ జ్యువెలరీని ఎంచుకుంది. మౌని స్టైలిస్ట్, అనురాధ ఖురానా, డిజైనర్ స్టూడియో ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్ ద్వారా మౌనికి నచ్చే వైట్ అండ్ వైట్ కాంబినేషన్ ఫ్లవర్ జ్యువెలరీని ఆర్డర్ చేసింది.

చవకలో చమక్కుమనేలా...

వినూత్నంగా, అందంగా కనిపించాలనే కోరిక ప్రతి వధువుకూ ఉంటుంది. అందుకోసం ఎంచుకునే దుస్తుల మొదలు, ఆభరణాల వరకూ కొత్తదనాన్ని ప్రదర్శించే ప్రయత్నం చేస్తూ ఉంటారు. పువ్వుల ఆభరణాలను ఎంచుకోవడం వెనకున్న రహస్యం ఇదే! ఆహ్లాదంగా కంటికింపుగా కనిపించడం కోసం మరీ ముఖ్యంగా హల్దీ వేడుకల్లో పూల ఆభరణాలనే ఎంచుకుంటూ ఉంటారు. తేలికగా వాడిపోని నందివర్ధనం, బంతిపూలను ఎంచుకోవడం వెనకున్న కారణం కూడా ఇదే! పసుపు, తెలుపు దుస్తులతో మ్యాచ్ అవడంతో పాటు, ముఖానికి పూసే పసుపుతో తెల్లని నందివర్ధనాలు, బంతిపూలు మరింత ఆకర్షణీయంగా కనిపిస్తాయి కాబట్టి, ఈ రెండు పూలనే ఫ్లవర్ జ్యువెలరీలో ఎక్కువగా వాడుతూ ఉంటారు. నిజానికి తక్కువ ధరలో, వినూత్నంగా కనిపించాలనుకునే వాళ్లకు ఫ్లవర్ జ్యువెలరీ బెస్ట్ ఆప్షన్.



హిప్‌హాప్.. పబ్, క్లబ్ డ్యాన్స్‌లతో హోరెత్తే అమెరికాలో... కళాభిమాలనులను కూచిపూడి నృత్యంతో అలరించడమే కాదు... అక్కడి భారతీయులకు శిక్షణ ఇస్తున్నారు **శారద నోరి ఆకెళ్ళ**. అంతేకాదు... మన పురాణాలను, ఇతిహాసాలను ఆ దేశంవారికి పరిచయం చేస్తున్నారు. కళ ద్వారా సమకాలీన సమస్యలపై చైతన్యం పెంపొందించేందుకు ప్రయత్నిస్తున్నారు. కర్నాటక సంగీతంలోనూ నిష్ణాతురాలైన శారద... మృదంగ వాద్యకారుడిగా తన కుమారుణ్ణి తీర్చిదిద్దారు. అతడి అరంగేట్రం సందర్భంగా హైదరాబాద్ వచ్చిన ఆమె 'నవ్య'తో ప్రత్యేకంగా సంభాషించారు.

మన కళల 'లయ విన్యాసం'

"మా స్వస్థలం హైదరాబాద్. నేను పుట్టింది, పెరిగింది ఈ నగరంలోనే. మా అమ్మ నోరి రత్నమాల, నాన్న సత్యనారాయణశర్మ. ఉస్మానియా యూనివర్శిటీ పక్కనే ఉన్న దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కాలనీలో మా నివాసం. నేను పదో తరగతివరకూ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదివాను. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంసీఏ చేశా. చదువుకొనే రోజుల్లోనే... సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకున్న మత్తడి ఉషాగాయత్రి వద్ద కూచిపూడి నేర్చుకున్నాను. ఎంసీఏ పూర్తయ్యాక చెన్నైకి ఉద్యోగ నిమిత్తం వెళ్ళి అక్కడ వెంపటి చిన్న సత్యం డ్యాన్స్ స్కూల్‌లో రవిశంకర్ వెంపటి దగ్గర మూడేళ్లు శిక్షణ పొందాను. నేతి శ్రీరామశర్మ వద్ద కర్ణాటక శాస్త్రీయ సంగీతగ, డాక్టర్ ఆనంద శంకర్ జయంతి దగ్గర భారతనాట్యం అభ్యసించాను.

తోలు బొమ్మలకు వాయిస్ ఇచ్చాను...

మా అమ్మ రత్నమాల ఆర్ట్ టీచర్. ఆమె తోలుబొమ్మలను ఆడించేవారు. ప్రత్యేకంగా 'నోరి ఆర్ట్ పప్పెట్ సెంటర్'ను కూడా నిర్వహించారు. గ్రామాలకు వెళ్ళి... స్త్రీ చైతన్యం, మద్యపాన నిషేధం... ఇలా ఎన్నో సామాజిక అంశాలపై తోలుబొమ్మలను ఆడిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించేవారు. చిన్నప్పుడే అమ్మతో పాటు నేనూ వెళ్ళేదాన్ని. తోలుబొమ్మలకు వాయిస్ ఇచ్చేదాన్ని. నాలో సామాజిక బాధ్యత పెరగడానికి ఇది దోహదం చేసింది. పెళ్ళి అయ్యాక అమెరికా వెళ్ళిన తర్వాత... అక్కడ నాలుగేళ్ల పాటు ఐటీ రంగంలో ఉద్యోగం చేశాను. ఇల్లు, ఆఫీసు... వీటితోనే సరిపోయేది. ఎంతో ఇష్టంగా నేర్చుకున్న కూచిపూడి, భరతనాట్యం, సంగీతం పరిస్థితేమిటని ఎప్పుడూ ఆలోచించేదాన్ని. పిల్లలు పుట్టిన తర్వాత ఉద్యోగానికి స్వస్తి చెప్పాను. మేము అమెరికాలోని కనెక్టికట్‌లో ఉండేవాళ్ళం. అక్కడ మన వాళ్ళు ఉంటారు. అయితే... పిల్లలకు మన పండుగలు, మన సంస్కృతి, కళల గురించి, మన మూలాల గురించి తెలీదు. పూర్తిగా విదేశీ సంస్కృతిలోనే పెరగడం వల్ల... మన విలువలకు దూరంగా వాళ్ళు జీవిస్తున్నారు. పిల్లలకు కూచిపూడి, భరతనాట్యం నేర్పడం ద్వారా మన సంస్కృతి, కళల గురించి తెలియజేయాలనే ఆలోచన కలిగింది. నా భర్త ప్రవీణ్ ఆకెళ్ళ సహకారంతో కనెక్టికట్‌లో డ్యాన్స్ స్కూల్ ప్రారంభించాను.

అందుకు ఎంతో శ్రమపడ్డా...

చీర కట్టుతో చేసే కూచిపూడి నృత్య ప్రదర్శనలకు అక్కడ ఆదరణ ఉండేది కాదు. లైబ్రరీల్లో, పాఠశాలల్లో ప్రదర్శనలు ఇస్తే... విదేశీయులు అటువైపు చూసేవారు కాదు. భారతీయులు మాత్రమే వచ్చేవారు. ఇక... కళలను నేర్చుకోవడానికి కూడా తక్కుమందే వచ్చేవారు. 'ఇది ఎందుకు నేర్చుకోవాలి? అది అన్నం పెట్టదు' అనే ప్రశ్నలు వినిపించాయి. కళలు ఎంత గొప్పవో పిల్లల్లో అవగాహన కల్పించి, మన సంస్కృతిని గౌరవించాలని తల్లితండ్రులకు తెలియజెప్పడానికి... ఎంతో శ్రమపడ్డాను. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా... సంగీత, నృత్యాల విశిష్టతను వివరించాను. అలా... మొదట నలుగురితో ప్రారంభమైన మా స్కూల్‌లో... ఇప్పుడు 60 మంది ఉన్నారు. ఎక్కు మంది దక్షిణ భారత దేశానికి చెందినవారే. సంగీతం నేర్చుకుంటున్నవారిలో విదేశీయులు కూడా ఉన్నారు. కనెక్టికట్‌లోని పలు వర్సిటీలు, కాలేజీల్లో... సంగీతాన్ని ఒక కోర్సులా నేర్పిస్తున్నాం. 'లయ విన్యాస' పేరుతో ఒక సంస్థను ప్రారంభించాం. దాని ద్వారా ప్రదర్శనలు ఇస్తున్నాం. ఇప్పుడు విదేశీయులు కూడా మన ప్రదర్శనలను ఆసక్తిగా చూస్తున్నారు. వివిధ సందర్భాల్లో మన ప్రదర్శనలకు అవకాశం ఇస్తున్నారు. అమెరికాలో జరిగిన 'ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ ఐడియా'లో కూడా మేము ప్రదర్శన ఇచ్చాం.

> కూచిపూడి అయినా... భరతనాట్యమయినా... పురాణాలు, ఇతిహాసాల్లోని అంశాలను చెబుతున్నాం. సమకాలీన సామాజిక అంశాలను తీసుకొని నృత్య నాటకాలను తయారు చేస్తున్నాం. వాతావరణ మార్పులు, పర్యావరణ సంరక్షణ అవశ్యకతపై 'ధరణి' అనే కూచిపూడి నృత్య నాటిక తయారు చేశాం..పాశ్చాత్య దేశాల్లో మన కళలు, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పాలనేదే నా లక్ష్యం."



ఏ దేశమేగినా...

మా అమ్మాయి సహన కూచిపూడిలో, సంగీతంలో శిక్షణ పొందింది. మా అబ్బాయి కేదార్‌కి 16 ఏళ్ళు. సంగీతంపై మక్కువతో మృదంగం నేర్చుకున్నాడు. 'తానా' సభలో ప్రదర్శన ఇచ్చి... మూడో బహుమతి అందుకున్నాడు. మన సంస్కృతి గురించి, మన కళల గురించి పిల్లలకు మనమే చెప్పాలి, నేర్పాలి. ఏ దేశమేగినా... మన సంస్కృతిని కాపాడుకోవడం ముఖ్యం. అమెరికాలో తెల్లవారు, నల్లవారి మధ్య సామాజిక అసమానతలు ఎక్కువగా ఉంటాయి. కానీ వారం దరూ మన కల్చర్‌ను అర్థం చేసుకుంటారు. స్కూల్స్, కాలేజీలు, వర్సిటీలలో ప్రదర్శనలకు అవకాశమిస్తారు. ఇక్కడ ప్రదర్శన జరపకూడదనే అభ్యంతరాలు ఉండవు. తెలుగు, కన్నడ, మరాఠీ, ఇండియన్ అసోసియేషన్లు కూడా మంచి సహకారం అందిస్తాయి. పిల్లలు సంగీత, నృత్యాలను శ్రద్ధగా నేర్చుకోవడం కోసం సిలికాన్ ఆంధ్ర నిర్వాహకులు 'సంపద' అనే కేంద్రాన్ని ప్రారంభించి... తెలుగు యూనివర్సిటీ నుంచి సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ను మొదలుపెట్టారు. నా దగ్గర దాదాపు 35మంది శిక్షణ పొంది, సర్టిఫికెట్లను అందుకున్నారు.

పర్యావరణ స్పృహను కలిగించడం కోసం..

కూచిపూడి అయినా... భరతనాట్యమయినా... పురాణాలు, ఇతిహాసాల్లోని అంశాలను విదేశీయులను ఆకట్టుకొనేలా ప్రదర్శిస్తున్నాం. సమకాలీన సామాజిక అంశాలను తీసుకొని నృత్య నాటకాలను తయారు చేస్తున్నాం. వాతావరణ మార్పులు, పర్యావరణ సంరక్షణ అవశ్యకతపై 'ధరణి' అనే కూచిపూడి నృత్య నాటిక తయారు చేశాం.. మా అమ్మ ఆడించిన తోలుబొమ్మలను వినియోగించాం. మానవులకు, జంతుజాలానికి వాతావరణ మార్పులు ఏ విధంగా ఇబ్బంది కలిగిస్తున్నాయి, ప్లాస్టిక్‌తో ఎదురవుతున్న సమస్యలేమిటి? తదితర అంశాలను ప్రస్తావిస్తూ.. విజువల్స్‌తో సహా రూపొందించిన ఆ 40 నిమిషాల ప్రదర్శనకు ఎన్నో ప్రశంసలు లభించాయి. మన పండుగల విశిష్టతను చాటి చెప్పడానికి... సెప్టెంబర్‌లో ఒక ప్రదర్శన ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాం. ఈ ప్రదర్శనలకు అక్కడి ప్రభుత్వం కూడా వివిధ గ్రాంట్స్ మంజూరు ద్వారా సాయం అందిస్తోంది. పాశ్చాత్య దేశాల్లో మన కళలు, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పాలనేదే నా లక్ష్యం.'

• బయ్యు దామోదర్
ఫొటోలు: లవకుమార్

రైట్ రైట్...
ఈ కండక్టర్ కతే వేరు!

పబ్లిక్‌లో తిరిగే ఏ ఉద్యోగమైనా జర ఇబ్బందే ఉంటుంది. ఈ లెక్కన హైదరాబాద్‌లో తిరిగే ఆర్టీసీ బస్సు కండక్టర్ల కష్టాలెంటో బస్సెక్కిన ఎవరికైనా.. ఎరుక! రాజేంద్రనగర్ బస్‌డిపోకు చెందిన రాగమల్ల అనూప రాణి ఫ్రెండ్లీ కండక్టర్ జాబ్‌కు పెట్టింది పేరు. ఇరవై నాలుగేళ్ల నుంచీ ప్రయాణికుల్ని ఏమాత్రం విసిగించకుండా.. నవ్వుతూ.. నవ్విస్తూ.. వృత్తిపట్ల అమితమైన ప్రేమను చూపించే అనూప రాణిని టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆమెను 'నవ్య' పలకరించిందిలా...

"మా సజ్జనార్ సర్ 'ప్రయాణీకులతో నవ్వుతూ మాట్లాడాలి. ఫ్రెండ్లీగా ఉండాలి' అంటుంటారని రాజేంద్రనగర్ డిపోలో చెబుతుంటారు. ప్రస్తుతం కంటి ఆపరేషన్ చేయించుకుని.. సెలవులో ఉన్నాను. ఇటీవల మా బస్సెక్కిన సిద్ధార్థి సుభాష్ చంద్రబోస్ అనే ప్రయాణికుడు.. ఫేస్‌బుక్కులో నా గురించి రాశారు. అది చదివి.. ఫోన్ చేశానని సజ్జనార్ సార్ నాతో మాట్లాడారు. 'డ్రైవర్లు, కండక్టర్లు మన ఆర్టీసీ బస్సుకు అంబాసిడర్లు. ప్రయాణికులను కుటుంబ సభ్యుల్లా చూడటం గొప్ప విషయం. పని ఒత్తిడి ఉన్నా.. కష్టపడి పని చేయటం గ్రేట్. వృత్తిపట్ల ప్రేమ ఉండే మీలాంటి వాళ్లే సంస్థకు కావాల్సింద'ని ఎమ్‌డీ ప్రశంసించటం ఆనందంగా ఉంది.

మా బస్సుకోసం చూస్తరు..

చిన్నప్పటినుంచీ నా తీరే అంత! ఎవరైనా బాధల్లో ఉంటే కాస్త మాట్లాడించటం.. అలవాటు. ఎవరెవరో ఎన్నో కష్టాలతో మా బస్సెక్కుతారు. వాళ్లను మంచిగా పలకరిస్తే.. నాకు ఖర్చయ్యేదేమీ లేదు కదా! ఇరవై నాలుగేళ్ల నుంచీ ఒకటే బస్.. ఏపీ15జడ్ 0004. రాజేంద్రనగర్ డిపోకు చెందిన ఈ బస్ ప్రతి రోజూ మెహదీపట్నం నుంచి ఆరాంఘర్, బండ్లగూడ, చంద్రాయణగుట్ట మీదుగా ఉప్పల్ వెళ్తుంది. స్టాప్ వచ్చాక.. పెద్దవాళ్లను దిగబెడుతుంటే 'నువ్వు చల్లగుండాలె బిడ్డా' అంటూ ఆశీర్వదిస్తారు. 'ఇట్లుండా మరదలా..!' అంటూ మాట్లాడిస్తా. చుట్టపోళ్ల మాదిరి మాట్లడ్తరు. కాలేజీ పిల్లలు ఫోన్లు చూస్తుంటే.. 'కండ్లు గుంజకపోయినాయి. బుద్ధిగా చదువుకోండి పిల్లగాండ్లు. మీ ఇంట్లో వాళ్లు కాలేజీకి పంపిస్తే ఇట్లన చేసేది' అంటూనే.. మెల్లగా ఫోన్లు జేబుల్లో పెట్టుకుంటారు. ఇలా బస్సులో మాటలు కలుపుతా. అందుకే 'నీ బస్సెక్కితే హుషారు అక్కా' అంటారు కొందరు.



తొలి జీతం అనాథలకు..

మాది రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్ మండలంలోని సురంగల్ గ్రామం. వ్యవసాయ కుటుంబం మాది. నాకు ముగ్గురు అక్కలు, ఒక అన్న.. నేనే చిన్నదాన్ని. అందరినీ చదివించారు మా నాన్న. ఉపాధికోసం హైదరాబాద్‌లోని ఉప్పర్‌పల్లి ప్రాంతానికి వచ్చాం. పదో తరగతి సెలవులు అయిపోయాక పరీక్ష రాసి కండక్టర్ కొలువు సంపాదించా. జీతం మూడు వేలు. 2000 సంవత్సరంలో మాకు ఈ జీతమే గొప్ప. అదిగాక.. సర్కారు ఉద్యోగం వచ్చినోళ్లు మా ఇంటావంటా లేరు. మావోళ్లు నా గురించి గొప్పగా మాట్లాడేవాళ్లు. మా నాన్న మాత్రం 'ఇంట్లో ఎన్ని కష్టాలున్నా బయటోళ్లమీద చిరాకు చూపించకు బిడ్డా' అని చెప్పారు. ఉదయం మా అన్నయ్య బస్సు దగ్గర వదిలేసి వచ్చేవారు. డ్యూటీ అయ్యాక నాన్న వచ్చి పికప్ చేసుకునేవారు. కొలువు ఎట్ల చేస్తనో ఏమో.. అనుకుంటూ కొన్నాళ్లు భయపడినా.. మెల్లగా నిలదొక్కుకున్నా. తొలి జీతం మొత్తం అనాథలకు ఇచ్చాను.

చదువుల్లోనూ తగ్గేదే లేదు..

వికారాబాద్‌లోని 'సంఘం లక్ష్మీబాయ్ కాలేజీ'లో చదివా. కండక్టరు ఉద్యోగం వచ్చాక.. హైదరాబాద్‌లోని వనితా కాలేజ్‌లో ఇంటర్ చదివా. 2005లో పెళ్లయ్యింది. మావారి పేరు ప్రవీణ్ కుమార్. నా ఉద్యోగానికి సహకరించారు. అంతేనా పీజీడీసీఏ చదివించారు. ఉస్మానియా యూనివర్శిటీ కింద డిస్టెన్స్‌లో ఎం.ఏ.సోషియాలజీ, ఎం.ఏ.ఇంగ్లీష్ లిటరేచర్ చదివించారు. మాకు ఒక కొడుకు. ఉద్యోగ నిర్వహణలో బిజీగా ఉంటాను కాబట్టి.. మా అమ్మానాన్నే బాబును చూసుకుంటారు. ఏడేళ్ల కిందట గ్రూప్-2 రాస్తానంటే.. 'సరే' అన్నారు మా వారు. అందుకు తగినట్లు అండగా నిలిచారు. తెల్లారుజామున నాలుగు గంటలకే ఇంటినుంచి బయలుదేరి.. ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని ఆర్.సి.స్టడీ సర్కిల్‌కు ఐదు గంటలకు చేరుకునేదాన్ని. మా గురువులు 'అనూప.. ఎందుకింత కష్టం?' అనేవాళ్లు. మధ్యాహ్నం పన్నెండయ్యాక.. అట్నుంచి అటే డూటీకి ఉరికేదాన్ని. పది నెలల పాటు అలా కష్టపడ్డా. గ్రూప్-2 పరీక్షయితే పాసయ్యా కానీ.. ఇంటర్వ్యూ పోయింది. ఇప్పుడు మా అబ్బాయి బీటెక్‌కి వచ్చినా.. నేను ఏదో ఒక కాంపిటీషన్ ఎగ్జామ్ రాస్తుంటా. ఉద్యోగం కొట్టాలని కాదు.. పది మంది పిల్లలకు గైడ్ చేయవచ్చు కదా! అనేది ఆలోచన. ఇపుడు నా వయసు నలభై ఆరేళ్లు. ఇకమీదట పరీక్షలకు దరఖాస్తు చేయటానికి కుదరదేమో! అన్నట్లు ప్రతి రోజూ తెలుగు, ఇంగ్లీషు పత్రికలు చదువుతా. ఎంత చదివినా.. కండక్టరు ఉద్యోగమే నా పర్మినెంటు ఉద్యోగం(నవ్వులు).

• రాళ్లపల్లి రాజావలి

రెడీ అయిన రాయన్



ప్రతి హీరో కెరీర్‌లో 50, 100 చిత్రాలకు ఓ ప్రత్యేకత ఎప్పుడూ ఉంటుంది. ప్రత్యేక కథలతో ఈ చిత్రాల్లో నటించడానికి హీరోలు ప్లాన్ చేసుకుంటుంటారు. తమిళ హీరో ధనుష్ తన 50వ చిత్రం 'రాయన్' కోసం ఓ మంచి కథను ఎంపిక చేయడమే కాకుండా తనే ఆ చిత్రానికి దర్శకత్వం వహించారు. సందీప్ కిషన్, కాళిదాస్ జయరామ్ కీలక పాత్రలు పోషించారు. సెన్సార్‌తో సహా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని 'రాయన్' చత్రం వి డుదలకు సిద్ధమైంది. ఈ నెల 26న సినిమా రిలీజ్ కానుంది. ఏషియన్ సురేశ్ సంస్థలు తెలుగు రాష్ట్రాల్లో తెలుగు వెర్షన్‌ను విడుదల చేస్తున్నాయి. అపర్ణ బాలమురుగన్, ఎస్.జె.సూర్య, సెల్వ రాఘవన్ తదితరులు నటించిన ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహమాన్ సంగీత దర్శకత్వం వహించారు.

ఊరినే ఉప్పొంగించే వీరుడు



'సాదా సీదా మగాళ్లు కావాలా, ఈ ఊరినే ఉప్పొంగించే వీరుడు కావాలా'... ప్రస్తుతం ఎన్టీఆర్ అభిమానులను ఉర్రూతలూగిస్తున్న డైలాగ్ ఇది. ఆయన కథానాయకుడిగా శివ కొరటాల దర్శకత్వం వహిస్తున్న 'దేవర' చిత్రంలోని ఈ డైలాగ్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇటీవలే చిత్రబృందం డబ్బింగ్ కార్యక్రమాలను మొదలుపెట్టింది. అందులో నుంచి ఓ డైలాగ్ లీక్ అయి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో ఎన్టీఆర్ ఊరికోసం పోరాడే వీరుడు అని తెలుస్తోంది. 'దేవర' చిత్రం రెండు భాగాలుగా వస్తోంది. తొలి భాగం సెప్టెంబర్ 27న వి డుదలవుతోంది. ఇందులో జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ నిర్మిస్తున్నాయి.



కశ్మీర్‌లో సాంగ్ వేసుకున్న బచ్చన్

హరీశ్ శంకర్ దర్శకత్వంలో రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్‌తో సునాహోగా' ట్యాగ్ లైన్. జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తి చేసుకుంది. తాజాగా, ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ 'సితార' పాటను మేకర్స్ విడుదల చేశారు. కశ్మీర్‌లోని అందమైన లొకేషన్స్‌లో సాగిన ఈ డ్యూయెట్ పాటలోని విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. సాహితీ లిరిక్స్ అందించగా, సాకేత్ కొమండూరి, సమీర భరద్వాజ్ ఆలపించారు. మిక్కీ.జే.మేయర్ సంగీతం అందించగా శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. ఈ సినిమాకు ఎడిటర్: ఉజ్వల్‌కులకర్ణి, డీఓపీ:అయనంక బోస్.

తిన్నడి విల్లు కథ




మంచు విష్ణు నటిస్తున్న 'కన్నప్ప' చిత్రం మీద ఇప్పుడు భారీ అంచనాలు ఉన్నాయి. ఇటీవల వి డుదల చేసిన 'టీజర్' అంచనాలను మరింత పెంచేసింది. తాజాగా ఈ సినిమాలో విష్ణు వాడిన విల్లుకు ఓ విశిష్టత ఉంది. అదేమిటో విష్ణు వి వరిస్తూ 'తిన్నడు వాడిన విల్లు కేవలం ఆయుధం మాత్రమే కాదు.. తండ్రీకొడుకుల అనుబంధానికి ప్రతీక. కన్నప్ప తండ్రి నాదనాథ స్వయంగా తయారు చేసిన ఈ విల్లు కుటుంబ వారసత్వంగా నిలిచింది. పులి ఎముకలు, దంతాలతో తయారు చేసిన ఈ విల్లుతో కన్నప్ప యుద్ధ భూమిలో అసమానమైన ప్రజ్ఞను ప్రదర్శిస్తాడు. కళాదర్శకుడు క్రిష్ ప్రత్యేకంగా ఈ విల్లు తయారు చేశాడు. సినిమాలో ఈ విల్లు అంతర్భాగం. కన్నప్ప దాన్ని అచంచలమైన బలంతో ఉపయోగిస్తూ తన తెగను, అడవిలో సమతూల్యతను కాపాడుకుంటాడు. యువతకు స్ఫూర్తినిచ్చే కథ ఇది' అన్నారు. త్వరలో విడుదల కానున్న 'కన్నప్ప' చిత్రంలో మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, ప్రభాస్ తదితరులు నటించారు. ముఖేశ్‌సింగ్ దర్శకుడు.

ట్రోలర్స్‌కు మంచు విష్ణు హెచ్చరిక

సినీతారల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా, వారి గౌరవానికి భంగం కలిగించేలా పోస్ట్ చేసిన వీడియోలు, మీమ్స్‌ను 48 గంటల్లో తొలగించాలని డిజిటల్ కంటెంట్ క్రియేటర్స్‌కు నటుడు, మా (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) అధ్యక్షుడు మంచు విష్ణు బుధవారం విజ్ఞప్తి చేశారు. ట్రోలింగ్ వీడియోలను వెంటనే తొలగించని పక్షంలో తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవలే తండ్రీ, కూతుళ్లను కించపరిచేలా వీడియోలను పోస్ట్ చేసిన క్రియేటర్లపై మండిపడ్డారు. కామెడీ పేరుతో ఇలాంటి వీడియోలు చేయడం సరికాదని సూచించారు. మహిళలను కించపరిచే పోస్టులు పెడితే ఇకపై వదిలిపెట్టేది లేదని వీడియోలో పేర్కొన్నారు. ఇలాంటి వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు వి జ్ఞప్తి చేశారు.

ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడం ముఖ్యం


సురేశ్‌బాబు



సినిమా టికెట్ రేట్లు పెంచడం కంటే ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడమే ముఖ్యమని నిర్మాత డి.సురేశ్‌బాబు అభిప్రాయపడ్డారు. సంగీత దర్శకుడు తమన్, దర్శకుడు గోపిచంద్ మలినేనితో కలసి బుధవారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.అనంతరం సురేశ్‌బాబు ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. చాలామంది ప్రేక్షకులు థియేటర్లకు రావడం లేదన్నారు. వారిని థియేటర్లకు తీసుకువస్తే సినిమా పరిశ్రమ బాగుంటుందని, ఎంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు.టికెట్ ధరల విషయంలో ఇప్పటికే ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో చర్చించగా సానుకూల స్పందన లభించిందన్నారు. ధరల విషయంలో ఏది కావాలంటే అది చేసుకోమనే వెలుసుబాటు ఇచ్చారని తెలిపారు .భారతీయుడు-2 చిత్రం శుక్రవారం విడుదల కానుందని, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు డిస్ట్రిబ్యూషన్ తానే తీసుకున్నట్టు చెప్పారు.

తిరుమల (ఆంధ్రజ్యోతి)

బంగారం వేటలో పోరాటం



తమిళ హీరో విక్రమ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ 'తంగలాన్'. పా రంజిత్ దర్శకత్వంలో కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్ నేపథ్యంలో యథార్థ ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. విడుదలకు సిద్ధమైన ఈ చిత్రం ట్రైలర్‌ను మేకర్స్ బుధవారం వి డుదల చేశారు. రెండు గిరిజన తెగల మధ్య పోరాటం, తనవాళ్లను కాపాడుకోవడానికి ఎంతకైనా తెగించే నాయకుడి పాత్రలో విక్రమ్ నటన, ఆయన సిద్ధమైన తీరు, యాక్షన్ సీక్వెన్స్‌లు ఆకట్టుకున్నాయి. ఈ చిత్రంలో పార్వతీ తిరువోతు, మాళవికా మోహనన్ కథానాయికలు. పశుపతి, హరికృష్ణన్ కీలకపాత్రలు పోషించారు. సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్, ఎడిటర్ : ఆర్ కే సెల్వ

హీరోగా అద్దంకి దయాకర్



కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ సినీ రంగ ప్రవేశం చేశారు.. బొమ్మక్ మురళి దర్శకత్వంలో రూపొందిన 'ఇండియా ఫైల్స్' చిత్రంలో ఆయన హీరోగా నటించారు. ఐదు భాషల్లో తయారవుతున్న ఈ సినిమాకు ఎంఎంకీరవాణి సంగీత దర్శకుడు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ దశలో ఉన్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఇంద్రజ, బీఆర్ఎస్ నాయకుడు దాసోజు శ్రవణ్ సహా మరికొందరు రాజకీయ నాయకులు ఇందులో నటించినట్లు తెలుస్తోంది. రాజకీయంగా అవకాశాలు వచ్చినట్టే వచ్చి చేజారిపోతున్న తరుణంలో ఈ సినిమా సక్సెస్ అయితే ఆయన సినిమాల వైపు వెళతారా, లేక రాజకీయాల్లోనే కొనసాగుతారా అన్నది వేచిచూడాలి.

మోత్కూరు (ఆంధ్రజ్యోతి)

రాజ్‌తరుణ్ గర్ల్‌ఫ్రెండ్ బెదిరిస్తోంది

- పోలీసులకు నటి మాల్వి ఫిర్యాదు
- నార్సింగ్ ఠాణాకు మరోసారి లావణ్య



నటుడు రాజ్‌తరుణ్ గర్ల్‌ఫ్రెండ్ లావణ్య తనకు, తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి.. బెదిరిస్తున్నారని, వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ.. నటి మాల్వి మల్హోత్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన మాల్వి కుటుంబం ముంబైలో ఉంటోంది. రాజ్‌తరుణ్ చిత్రం 'తిరగబడరా స్వామి' చిత్రంలో మాల్వి కథానాయికగా నటించారు. సినిమా ప్రమోషన్ నిమిత్తం ఆమె టోలిచౌకిలో ఉంటున్నారు. రాజ్‌తరుణ్‌తో వివాదం నేపథ్యంలో లావణ్య పదేపదే తన పేరును ప్రస్తావిస్తున్నారని.. తనకు, తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ మాల్వి ఫిల్మ్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పరువుప్రతిష్ఠలకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్న లావణ్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు. అయితే.. మాల్వి ఉంటున్నది తమ పరిధి కాకపోవడంతో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు కేసును రాయదుర్గం ఠాణాకు బదిలీ చేశారు. కాగా.. లావణ్య బుధవారం మరోమారు రాజ్‌తరుణ్‌పై నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 4న ఆమె తొలిసారి ఫిర్యాదు చేయగా.. పోలీసులు తగిన ఆధారాలను సమర్పించాలని కోరారు. దాంతో బుధవారం మరోమారు ఠాణాకు వచ్చిన లావణ్య.. పలు ఆధారాలను సమర్పించారు. వీటిల్లో 170 ఫొటోలు, సాంకేతిక ఆధారాలు, తనకు అబార్షన్ చేయించిన ఆస్పత్రి రికార్డులు ఉన్నాయి. దీంతోపాటు.. అన్విక పేరుతో తాను, రాజ్‌తరుణ్ విదేశాలకు వెళ్లిన ఆధారాలను సమర్పించారు. "పదేళ్లుగా నాతో కాపురం చేసిన రాజ్‌తరుణ్ ఇప్పుడు వదిలేస్తున్నాడు. చాలా సార్లు నా వాయిస్ కాల్స్‌ను రికార్డ్ చేశాడు. అది చట్టవిరుద్ధం. దానిపైనా చర్యలు తీసుకోండి. ఇప్పుడు రాజ్‌తరుణ్ మాల్వితో కలిసి విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నిస్తున్నాడు. వెంటనే చర్యలు తీసుకోండి" అని ఆ ఫిర్యాదులో పోలీసులను కోరారు. తనను పెళ్లి చేసుకుని, మరొకరితో తిరుగుతూ మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు నార్సింగ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

- బంజారాహిల్స్, నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)



ట్రైలర్ ప్రామిసింగ్‌గా ఉంది

విష్వక్ సేన్

'పలాస 1978' ఫేమ్ రక్షిత్ అట్లూరి, సంగీర్తన విపిన్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఆపరేషన్ రావణ్'. ఈ న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌కు వెంకట సత్య దర్శకత్వం వహిస్తుండగా, ధ్యాన్ అట్లూరి నిర్మిస్తున్నారు. ఆగస్టు 2న సినిమా విడుదలవుతోంది. ఇప్పటికే రిలీజైన టీజర్ అందరినీ ఆకట్టుకుంది. బుధవారం సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన విష్వక్ సేన్ మాట్లాడుతూ "ట్రైలర్ ప్రామిసింగ్‌గా ఉంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా" అని చెప్పారు. "సినిమాలోని ప్రతీ పాత్రకూ విశిష్టత ఉంటుంది. సినిమా అందరి అంచనాలకు మించి ఉంటుంది" అని రక్షిత్ అట్లూరి చెప్పారు. "ఇప్పటివరకూ ఏ సినిమాలోనూ చూడని అంశాలు 'ఆపరేషన్ రావణ్'లో ఉంటాయి" అని దర్శకుడు వెంకట సత్య అన్నారు.

పల్లెటూరి యువతి ప్రతీకారం



యాభైకి పైగా చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన అంజలి ప్రధాన పాత్ర పోషించిన వెబ్ సెరీస్ 'బహిష్కరణ' ఈ నెల 19న ఓటీటీ వేదిక జీ5లో స్ట్రీమింగ్ కానుంది. ముఖేశ్ ప్రజాపతి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ విలేజ్ రివెంజ్ డ్రామా ఆరు ఎపిసోడ్స్‌గా ప్రసారం అవుతుంది. ఈ సిరీస్ ట్రైలర్‌ను అక్కినేని నాగార్జున విడుదల చేశారు. పల్లెటూరు, అక్కడ అంజలి, శ్రీతేజ్, అనన్య నాగళ్ల పాత్రల పరిచయం, ఊరి పెద్ద చేసే దురాగతాలు ట్రైలర్‌లో చూపించారు. ఓ వైపు ప్రేమ కురిపిస్తూనే మరో వైపు ప్రతీకారం తీర్చుకోవడం కోసం రగిలిపోయే పల్లెటూరి యువతి పాత్రను అంజలి పోషించారు. ఇందులో ఊరి పెద్దగా రవీంద్రన్ విజయ్ నటించారు. ప్రశాంతి మలిశెట్టి నిర్మించిన 'బహిష్కరణ' సిరీస్‌కు ప్రసన్నకుమార్ సినిమాటోగ్రఫీని, సిద్ధార్థ్ సదాశివుని సంగీతాన్ని అందించారు.

యథార్థ సంఘటనలతో...



రవికృష్ణ, సమీర్‌మళ్లా, రాజీవ్‌కనకాల ముఖ్య పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'బర్త్‌డే బాయ్'. విస్కీ దర్శకత్వంలో ఐ.భరత్ నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్, టీజర్‌కు మంచి ఆదరణ లభించింది. ఈ నెల 19న సినిమా విడుదలవుతోంది. సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు విస్కీ మాట్లాడుతూ "నా జీవితంలో జరిగిన కొన్ని యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించాను. సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది" అని అన్నారు. "ఇదొక కామెడీ డ్రామా. చిత్రంలోని ప్రతీ పాత్ర కూడా ఎంటర్టైన్ చేస్తుంది. ఎం.ఎస్ చదవడానికి విదేశాలకు వెళ్లిన ఐదుగురు చిన్ననాటి స్నేహితుల జీవితంలో జరిగిన ఓ సంఘటన చుట్టూ ఈ సినిమా నడుస్తుంది" అని నిర్మాత ఐ.భరత్ తెలిపారు. "సినిమా అంటే ప్రాణమిచ్చే ఇలాంటి టీమ్‌తో నటించినందుకు ఎంతో ఆనందంగా ఉంది. సినిమా అందరికీ కొత్త అనుభూతిని పంచుతుంది" అని నటుడు రవికృష్ణ అన్నారు. వాకా మని, రాజా అశోక్, వెంకటేశ్, సాయి అరుణ్, రాహుల్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.



షూటింగ్‌లో గాయపడ్డ ఊర్వశీ రౌతేలా?

బాబీ దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ హీరోగా నటిస్తున్న (ఎన్‌బీకే 109- వర్కింగ్ టైటిల్) చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇందులో కథానాయికగా నటిస్తున్న ఊర్వశీ రౌతేలా మంగళవారం షూటింగ్‌లో గాయపడ్డారని సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. యాక్షన్ సీక్వెన్స్ చేస్తుండగా ఆమె కాలికి తీవ్రంగా గాయాలయ్యాయని, వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారని ప్రచారం జరిగింది. దీనిపై ఊర్వశి, ఆ చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా స్పందించలేదు. ఈ వార్తల నేపథ్యంలో బుధవారం ఊర్వశి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. చికిత్స తీసుకుంటున్న వీడియోను షేర్ చేశారు. త్వరలోనే కోలుకొని సెట్స్‌కు తిరిగొస్తానని చెబుతూ విజయ సంకేతం చూపారు.

డ్రగ్స్‌కి దూరంగా ఉండండి



"ఫెయిల్యూర్ అనేది ఎంత ప్రమాదకరమో ఈ సినిమాలో దర్శకుడు చూపించాడు. ఈ చిత్రంలో నా ముగ్గురు పుత్రులకీ ఒక్కో సమస్య ఉంటుంది. ఇందులో కాలేజ్ లెక్చరర్ పాత్రలో నటించాను. ఈ సోషల్ మీడియా యుగంలో తల్లిదండ్రులు, పిల్లల మధ్య రిలేషన్ సరిగ్గా ఉండటం లేదు. కలసి కూర్చుని మాట్లాడుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇలాంటి టైమ్‌లో పిల్లలు చెడు బాట పట్టొచ్చు. పిల్లలకు తల్లిదండ్రులు మోరల్ సపోర్ట్ ఇస్తే కచ్చితంగా విజయం సాధిస్తారు. తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్ మీద పోరాటం చేస్తోంది. దయచేసి అందరూ డ్రగ్స్‌కి దూరంగా ఉండండి" అని నటుడు రాజా రవీంద్ర అన్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'సారంగదరియా'. పద్మారావు అబ్బిశెట్టి దర్శకత్వంలో ఉమాదేవి, శరత్‌చంద్ర చల్లపల్లి నిర్మించిన ఈ చిత్రం 12న విడుదలవుతోంది. బుధవారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో నవీన్‌చంద్ర మాట్లాడుతూ "ఈ సినిమా ప్రతీ ఇంట్లో జరిగే కథలా రిలేటబుల్‌గా ఉంది. మంచి సందేశంతో దర్శకుడు చిత్రాన్ని తీశారు" అని అన్నారు.

పీరియాడిక్ థ్రిల్లర్ 'క'



కిరణ్ అబ్బవరం కొంత విరామం తర్వాత నటిస్తున్న చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ సినిమాకు 'క' అనే ఆసక్తికరమైన, సింగిల్ లెటర్ టైటిల్‌ను నిర్ణయించారు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో పీరియాడికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని దర్శక ద్వయం సుజీత్, సందీప్ రూపొందించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి వెల్లడించారు.

డ్రగ్స్, సైబర్ నేరాలపై ఉక్కుపాదం

- మావోయిస్టుల కదలికలపై నిరంతర నిఘా
- ప్రస్తుతం శాంతిభద్రతల్లో కొంత లోపం
- అధికారులతో సమీక్షించి సరిదిద్దుకుంటాం
- ఠాణాల్లో సివిల్ పంచాయితీలు సహించం
- 'ఆంధ్రజ్యోతి'తో డీజీపీ జితేందర్

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో డ్రగ్స్, సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపుతామని డీజీపీ డాక్టర్ జితేందర్ వెల్లడించారు. బుధవారం ఆయన తెలంగాణ రాష్ట్ర ఐదో డీజీపీగా బాధ్యతలను చేపట్టాక.. 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. "ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా డ్రగ్స్, గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు తెలంగాణలో స్థానం లేకుండా చేస్తాం. సైబర్ నేరాల కట్టడికి చర్యలు తీసుకుంటాం" అని ఉద్ఘాటించారు. ప్రస్తుతం శాంతిభద్రతల్లో కొంత లోపాలున్నట్లు కనిపిస్తున్నా.. వాటిపై అధికారులతో సమీక్షించి, సరిదిద్దుతామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మావోయిస్టుల కదలికల్లేవని చెప్పారు. సరిహద్దు రాష్ట్రాల్లో ఘటనల నేపథ్యంలో మావోయిస్టుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగిస్తామన్నారు. ఆయన 'ఆంధ్రజ్యోతి' ఇచ్చిన ఇంటర్వ్యూలో.. పలు అంశాలపై మాట్లాడారు.

రాష్ట్రంలో వరుస ఘటనలను చూస్తుంటే.. శాంతిభద్రతలు అదుపు తప్పాయనిపిస్తున్నాయి కదా?

జితేందర్: ఇందులో కొంత వరకు వాస్తవం ఉంది. ఈ అంశంపై ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహించి, శాంతిభద్రతలను గాడిలో పెట్టేలా చర్యలు తీసుకుంటాం. దీంతో పాటు.. మహిళాభద్రత, చిన్నారుల భద్రతే లక్ష్యంగా పనిచేస్తాం. రాష్ట్ర ప్రభుత్వం కూడా కచ్చితమైన విజన్‌తో ఉంది. రాష్ట్రంలో పోలీసుల పనితీరు మెరుగ్గానే ఉంది. ఒకట్రెండు ఘటనలు ఇబ్బంది కలిగించేలా ఉన్నాయి. వాటితో ప్రజల్లో ఏర్పడిన దురభిప్రాయాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

డ్రగ్స్, గంజాయి కట్టడికి చేపట్టే చర్యలేంటి?

జితేందర్: మూలాల నుంచి డ్రగ్స్‌ను కట్టడి చేయాలని నిర్ణయించాం. నిఘా కొనసాగుతోంది. నిందితులకు న్యాయస్థానాల్లో శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నాం. సైబర్ నేరాల కట్టడికి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. సైబర్ నేరాలపై టోల్‌ఫ్రీ నం.1930కి ఫిర్యాదులు వచ్చిన వెంటనే.. సైబర్ నేరగాళ్లు కొట్టేసిన నగదును ఫ్రీజ్ చేస్తున్నాం. ఇతర రాష్ట్రాల పోలీసులతో సమన్వయంతో పనిచేస్తున్నాం.



అధికారులు ఎవరికివారే అన్నట్లు ఉన్నారనే ఆరోపణలున్నాయి కదా?

జితేందర్: అలాంటిదేమీ లేదు. ఎవరి విషయంలోనైనా గ్యాప్ ఉంటే.. సరిదిద్దుకుంటాం.

ప్రజలకు పోలీసులు దూరం అయ్యారనే అపవాదును ఎలా తొలగిస్తారు?

జితేందర్: ప్రజలను గౌరవించాలని, బాధితులకు అండగా ఉండాలని సీఎం చెప్పారు. ప్రజలకు పోలీసులు ఎల్లవేళలా అందుబాటులోనే ఉంటారు.

ఠాణాల్లో సివిల్ పంచాయితీలపై ఏమంటారు?

జితేందర్: ఠాణాల్లో సివిల్ పంచాయితీలను సహించేది లేదు. అలాంటి సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవు. కొన్ని ఠాణాల్లో ఏళ్ల తరబడి పాతుకుపోయిన సిబ్బందిని మార్చడంపై నిర్ణయాలు తీసుకుంటాం.

డయల్-100 సేవల్లో తీవ్ర జాప్యముందన్న ఆరోపణలపై మీరేమంటారు ?

జితేందర్: డయల్-100కు సమాచారం అందిన నిమిషాల్లోనే పోలీసులు స్పాట్‌కు చేరుకుంటున్నారు. అక్కడక్కడ ఆలస్యం, ఫలితంగా శాంతి భద్రతల సమస్యలు తలెత్తిన విషయం పరిశీలనలో ఉంది. సేవలపై సమీక్షిస్తాం.

హత్యలు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి కదా?

జితేందర్: హత్యలకు అనేక కారణాలుంటున్నాయి. ప్రజలకు భద్రత కల్పిస్తాం. లోపాలు ఉంటే సరిదిద్దుకుంటాం.

డీజీపీగా మీ ముందు ఉన్న సవాళ్లు ఏమిటి?

జితేందర్: నేరాల నియంత్రణ, శాంతి భద్రతల నిర్వహణ ప్రధాన లక్ష్యాలు.

డీజీపీగా జితేందర్

హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రవిగుప్తా.. 15 మంది ఐపీఎస్‌ల బదిలీలు

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి డాక్టర్ జితేందర్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా, విజిలెన్స్ డీజీగా అదనపు బాధ్యతల్లో ఉన్న జితేందర్‌కు ప్రభుత్వం పూర్తిస్థాయి డీజీపీగా నియమించింది. బుధవారం ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం సాయంత్రం జీవో వెలువడ్డ కొద్ది సమయంలోనే జితేందర్ డీజీపీగా బాధ్యతలను స్వీకరించారు. ఆ వెంటనే సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. ఇన్‌చార్జ్ డీజీపీగా కొనసాగిన రవిగుప్తాను ప్రభుత్వం హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) రవిగుప్తాను ఇన్‌చార్జి డీజీపీగా నియమించిన విషయం తెలిసిందే. రేవంత్‌రెడ్డి సర్కారు కొలువుదీరాక కూడా.. ఆయన కొనసాగారు. బుధవారం డీజీపీ బదిలీ ఉత్తర్వులు వెలువడిన గంటల వ్యవధిలో 15 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ మరో రెండు జీవోలు విడుదలయ్యాయి.


డీజీపీగా బాధ్యతలు స్వీకరిస్తున్న జితేందర్

నార్కొటిక్స్, సైబర్ నేరాలపై దృష్టి..

డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జితేందర్ మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానని చెప్పారు. సైబర్ నేరాలు, నార్కోటిక్స్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తామని స్పష్టం చేశారు.

పంజాబ్‌లోని పిరోజ్‌పూర్ నుంచి..

జితేందర్ 1965లో పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్‌లో జన్మించారు. జేఎన్‌టీయూ నుంచి స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో పీహెచ్‌డీ పట్టా పొందారు. 1992 బ్యాచ్ ఐపీఎస్‌గా విధుల్లో చేరారు. మహబూబ్‌నగర్, గుంటూరు జిల్లాల ఎస్పీగా, విశాఖపట్నం, వరంగల్ రేంజ్ డీఐజీగా సేవలందించారు. హైదరాబాద్ కమిషనరేట్‌లో ట్రాఫిక్ విభాగం అదనపు కమిషనర్‌గా ఆయన పనిచేసిన సమయంలో.. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సరికొత్త విధానాలను ఆవిష్కరించారు. ఆటోమేటెడ్ సిగ్నల్స్, ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం, సిటిజన్ సెంట్రిక్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, నగదు రహిత చలానాల చెల్లింపు విధానాన్ని దేశంలోనే మొదటి సారిగా హైదరాబాద్‌లో అమలుచేశారు. అదనపు డీజీపీ(శాంతిభద్రతలు), హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా, జైళ్ల శాఖ డీజీగా పనిచేశారు. కొంత కాలం విజిలెన్స్ డీజీగా అదనపు బాధ్యతలను నిర్వహించారు. జితేందర్ సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం పలు పతకాలను అందజేసింది.

రాష్ట్ర పోలీసింగ్‌పై పూర్తిస్థాయిలో పట్టు

జితేందర్‌కు రాష్ట్ర పోలీసింగ్ పరిస్థితులపై పూర్తిస్థాయిలో పట్టుంది. శాంతిభద్రతల అదనపు డీజీపీగా ఉన్న సమయంలో కమిషనర్లు, ఎస్పీలతో పూర్తి సమన్వయంతో పనిచేసి, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేశారు. అధికారుల పనితీరుపై జితేందర్‌కు పూర్తి అవగాహన ఉంది. హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా ఏడాదిన్నర పనిచేసిన ఆయనకు.. పోలీసు, అగ్నిమాపక శాఖ, జైళ్లు, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, సైనిక సంక్షేమం, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్, ఎస్పీఎఫ్, ప్రింటింగ్ అండ్ స్టేషనరీ ఇలా.. అన్ని విభాగాలకు సంబంధించిన అంశాలపై పూర్తి అవగాహన ఏర్పడింది. జితేందర్ గతంలో నిర్వహించిన పోస్టులు, ఆయనకు ఉన్న అనుభవం అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం.. ఆయనను డీజీపీగా నియమించినట్లు స్పష్టమవుతోంది.

బదిలీలు ఇలా..

అధికారి పేరు	పోస్టింగ్
మహేశ్ భగవత్	ఏడీజీ (శాంతిభద్రతలు)
స్వాతిలక్రా	ఏడీజీ (ఆర్గనైజేషన్, హోంగార్డ్స్)
విజయ్ కుమార్	ఏడీజీ (పర్సనల్, వెల్ఫేర్, స్పోర్ట్స్ అదనపు బాధ్యతలు)
సంజయ్ కుమార్ జైన్	ఏడీజీ టీజీఎస్పీ బెటాలియన్లు
ఎం.స్టీఫెన్ రవీంద్ర	ఏడీజీ గ్రేహౌండ్స్
జి.సుధీర్ బాబు	సీపీ రాచకొండ
డాక్టర్ తరుణ్ జోషి	ఏసీబీ డైరెక్టర్
ఎస్.చంద్రశేఖర్ రెడ్డి	ఐజీ మల్టీజోన్-1
వి.సత్యనారాయణ	ఐజీ, మల్టీజోన్-2
కె.రమేశ్ నాయుడు	ఐజీ, రైల్వే, రోడ్డు భద్రత
రక్షిత మూర్తి	డీసీపీ, హెడ్ క్వార్టర్స్
డి.ఉదయ్ కుమార్ రెడ్డి	మెదక్ ఎస్పీ
ఆర్.గిరిధర్	వనపర్తి ఎస్పీ
బి.బాలస్వామి	డీసీపీ, ఈస్ట్ జోన్
జి. చంద్రమోహన్ ఎస్పీ (నాన్ కేడర్)	డీసీపీ, సౌత్‌వెస్ట్ జోన్

సీవీ ఆనంద్‌కు విజిలెన్స్ అదనపు బాధ్యతలు

అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) చీఫ్‌గా ఉన్న సీవీ ఆనంద్‌కు ప్రభుత్వం విజిలెన్స్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలను అప్పగించింది. విజిలెన్స్ డీజీగా ఉన్న రాజీవ్ రతన్ హఠాత్మరణం తర్వాత సీనియర్ ఐపీఎస్ అధికారి జితేందర్‌కు ప్రభుత్వం ఆ బాధ్యతలను అప్పగించిన విషయం తెలిసిందే.! ఇప్పుడు జితేందర్‌ను డీజీపీగా నియమించడంతో విజిలెన్స్ డైరెక్టర్‌గా సీవీ ఆనంద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది.

శాంతి భద్రతలకు మహేశ్ భగవత్

తాజా బదిలీల్లో మహేశ్ భగవత్ అదనపు డీజీపీ(శాంతి భద్రతలు)గా నియమితులయ్యారు. రాచకొండ సీపీగా పనిచేసిన సుధీర్ బాబు తిరిగి అదే బాధ్యతలను చేపట్టారు. రాచకొండ సీపీగా ఉన్న తరుణ్ జోషీని ఏసీబీ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. మల్టీజోన్-1 ఐజీగా చంద్రశేఖర్, మల్టీజోన్-2 ఐజీగా వి.సత్యనారాయణ బదిలీ అయ్యారు. వెయిటింగ్‌లో ఉన్న రమేశ్ నాయుడుకు ఐజీ రైల్వే, రోడ్డు భద్రత బాధ్యతలను అప్పగించారు. ఎస్పీ(నాన్‌కేడర్) రాచకొండ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా ఉన్న చంద్ర మోహన్‌ను హైదరాబాద్ సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీగా నియమించారు. త్వరలో మరిన్ని బదిలీలు జరగనున్నట్లు సమాచారం.


తరగతి గదిలో నిద్రిస్తున్న ఉపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి

బడిలో దెయ్యం!!

- భయంతో పాఠశాలకు రాని విద్యార్థులు
- ఆదిలాబాద్ జిల్లా ఆనంద్‌పూర్‌లో ఘటన
- పిల్లల్లో భయం పోగొట్టేందుకు రాత్రంతా స్కూల్లోనే నిద్రించిన టీచర్
- తిరిగి బడిబాట పట్టిన విద్యార్థులు

ఆదిలాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో దెయ్యం ఉందంటూ విద్యార్థుల్లో నెలకొన్న భయాందోళనలను పారదోలి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు చేసిన యత్నం ఫలించింది. దీంతో దెయ్యం భయంతో పాఠశాలకు వెళ్లడం మానేసిన వారంతా తిరిగి ధైర్యంగా రావడం ప్రారంభించారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం ఆనంద్‌పూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుంచి ఏడో తరగతి వరకు 90 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాల ఆవరణలో ఉన్న చెట్టు ఇటీవల గాలికి విరిగి పడింది. దీనికితోడు పాఠశాలలోని ఓ గది నుంచి వింత శబ్దా లు, అరుపులు వస్తున్నాయని కొద్దిరోజులుగా విద్యార్థులు భయంతో వణికిపోయారు. చాలా మంది స్కూలుకు రావడం మానేశారు. ముగ్గురైతే ఏకంగా వేరే పాఠశాలలో చేరిపోయారు. బడిలో దెయ్యం లేదని ఉపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి విద్యార్థులకు ఎంత చెప్పినా వారు నమ్మలేకపోయారు. ఈ తరుణంలో వారిలో భయాన్ని పోగొట్టి ఆత్మవిశ్వాసం కలిగించేందుకు ఆయన తరగతి గదిలోనే రాత్రంతా ఒంటరిగా నిద్రపోయారు. దీనిని చూసిన విద్యార్థులు ధైర్యంగా బడికి వెళ్లడం ప్రారంభించారు.

ఫార్మాసిటీకి ఇచ్చిన భూముల్లో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయం : కోదండరెడ్డి

ఇబ్రహీంపట్నం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయబోమని, ఈ భూముల్లో ఇతర ప్రాజెక్టుల అభివృద్ధికి తమ ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు, ధరణి కమిటీ సభ్యుడు కోదండరెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతులతో జరిగిన సమావేశంలో, తర్వాత విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో 5,833 ఎకరాలకు రైతులు పరిహారం పొందారని, మరో 456 ఎకరాల భూములను టీఎస్ఐఐసీ పేరున రైతులు రిజిస్ట్రేషన్లు చేశారని కోదండరెడ్డి చెప్పారు. మరో 2,555 ఎకరాల భూ సేకరణకు గత ప్రభుత్వం డబ్బులను కోర్టులో డిపాజిట్ చేసిందని చెప్పారు.

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

దుబ్బాక, కాటారం, జూలై 10: అప్పుల బాధతో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని బస్వాపూర్‌కు చెందిన కల్లెం లింగయ్య(35) రెండేళ్ల క్రితం రెండున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తిని సాగుచేయగా నష్టపోయాడు. అప్పులు తీర్చలేక పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మరోవైపు సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లికి చత్రి కనకయ్య(42)అప్పులు పెరిగిపోయి, బ్యాంకు వాయిదా చెల్లించలేక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

వివాహ భోజనంబు రెస్టారెంట్‌లో తనిఖీలు

- నాసిరకపు ఆహార పదార్థాల గుర్తింపు.. నోటీసులు జారీ

హైదరాబాద్ సిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) అధికారులు తనిఖీలు నిర్వహించారు. సినీ నటుడు సందీప్ కిషన్‌కు చెందిన సికింద్రాబాద్‌లోని వివాహ భోజనంబు రెస్టారెంట్‌లో నిర్వహించిన తనిఖీల్లో పలు నాసిరకపు ఆహార పదార్థాలు గుర్తించిన అధికారులు నోటీసులు జారీ చేశారు. కాగా, తమ రెస్టారెంట్‌లో గత 8ఏళ్లుగా ఆహార భద్రతప్రమాణాలు పాటిస్తున్నామని, రుచిని పెంచే డక్లా, ఫుడ్ కలర్లను ఉపయోగించడంలేదని వివాహ భోజనంబు నిర్వాహకులు ఓ లేఖలో పేర్కొన్నారు.

భద్రాద్రి ఆలయ అభివృద్ధికి ఎకరం స్థలం సేకరణ

భద్రాచలం, జూలై 10 : భద్రాద్రి రామాలయాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలయ పరిసరాల్లో 45 ఇళ్ల నుంచి సుమారు ఎకరంలోపు స్థలం సేకరించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా ఇప్పటికే ఆలయ పరిసరాల్లో ఇళ్లు కోల్పోయే అవకాశం ఉన్న వారితో రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు మాట్లాడారు. ఆయన ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తితో కలిసి బుధవారం భద్రాచలం చేరుకుని రంగనాయకుల గుట్టపై ఉదయం నుంచి రాత్రి వరకు రెవెన్యూ, దేవస్థానం అధికారులతో ఆలయ అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలపై సమీక్షించారు. ఈ సమయంలోనే కొంతమంది ఇళ్లు కోల్పోయే అవకాశం ఉందని భావిస్తున్న వారు కమిషనర్‌ను కలవడంతో ఆలయ అభివృద్ధికి స్థానికులు సహకరించాలని ఆయన కోరినట్లు తెలిసింది. అందుకు వారు సుముఖత వ్యక్తం చేసి తమకు సముచిత పరిహారం అందిస్తే భూములను అప్పగించేందుకు సిద్ధమని పేర్కొన్నట్లు సమాచారం.

యూట్యూబర్ ప్రణీత్ హన్మంతు అరెస్ట్

- బెంగళూరులో అదుపులోకి తీసుకున్న తెలంగాణ పోలీసులు

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : తండ్రీకూతుళ్ల బంధంపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ ప్రణీత్ హన్మంతు అరెస్ట్ అయ్యాడు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు ప్రణీత్‌ను బెంగళూరులో బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వెంటనే అక్కడి మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి ట్రాన్సిట్ వారెంట్ తీసుకుని అతనిని హైదరాబాద్ తరలించారు. ప్రణీత్ హన్మంతుపై ఐటీ యాక్ట్, బీఎన్ఎస్‌లోని వివిధ సెక్షన్లతోపాటు పోక్సో యాక్ట్ ప్రకారం కేసులు నమోదయ్యాయి. ఈ కేసుతో సంబంధం ఉన్న మిగిలిన నిందితులు పరారీలో ఉండగా, వారి కోసం గాలిస్తున్నామని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికా గోయెల్ తెలిపారు. కాగా, ప్రణీత్ హన్మంతు మరొ కొందరితో కలిసి తండ్రీకూతుళ్ల బంధంపై సోషల్ మీడియాలో చేసిన తప్పుడు వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. సినీనటులు సాయిధరమ్ తేజ్, మంచు మనోజ్ స్పందించి ప్రణీత్‌పై చర్యలు తీసుకోవాలని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పోలీసులను కోరారు. దీంతో విషయం సంచలనం కాగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క, పోలీసు ఉన్నతాధికారులు నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. దీంతో సోషల్ మీడియా వేదికగా క్షమాపణ చెప్పిన ప్రణీత్ హన్మంతు అజ్ఞాతంలోకి వెళ్లాడు. కానీ, దర్యాప్తు చేపట్టిన సైబర్ సెక్యూరిటీ పోలీసులు అతన్ని పట్టుకుని కటకటాల్లోకి నెట్టారు.

ఇటిక్యాలలో యువ దంపతుల ఆత్మహత్య

జగదేవ్‌పూర్, జూలై 10: ప్రేమ పెళ్లి చేసుకున్న ఆ ఇద్దరు మనస్పర్థలతో కొన్ని రోజుల పాటు వేర్వేరుగా బతికారు. వారం కింద మళ్లీ ఒక్కటయ్యారు. ఇంతలోనే ప్రాణాలు తీసుకున్నారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాలలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కర్కపట్ల శేఖర్(32)కు మండలంలోని దౌలాపూర్‌కు చెందిన సౌమ్య(25)తో ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం జరిగింది. మనస్పర్థలతో ఏడాది నుంచి వేర్వేరుగా ఉంటున్నారు. దీంతో 15 రోజుల కింద సౌమ్యను శేఖర్ ఇటిక్యాలకు తీసుకెళ్లాడు. ఈ నేపథ్యంలోనే కలసి బతకాలని నిర్ణయించుకున్న ఇద్దరూ మేడ్చల్ జిల్లా తుర్కపల్లిలోని ఓ మామిడి తోట వద్ద పనికి కుదిరారు. అయితే వారి మధ్య ఏం జరిగిందో తెలియదు గానీ.. మంగళవారం రాత్రి శేఖర్, సౌమ్య ఇద్దరు తుర్కపల్లి నుంచి రాత్రి ఒంటి గంటకు ఇటిక్యాలలోని వారి సొంత పొలం వద్దకు వచ్చి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మృతులకు ఐదేళ్లలోపు ఇద్దరు పిల్లలున్నారు.

సైబరాబాద్ మాజీ సీపీ సంతకం ఫోర్జరీ!

57.12 ఎకరాల భూమి అమ్మేందుకు యత్నం.. మరో ముగ్గురి సంతకాల ఫోర్జరీతో పత్రాలు

- రూ.22.23 కోట్లకు అమ్మేందుకు ఒప్పందం
- రూ.11 లక్షలు బయానాగా చెల్లించిన బిల్డర్
- పోలీసులకు భూ యజమాని ఫిర్యాదు.. నిందితుల అరెస్ట్


నిందితులను చూపుతున్న జోగిపేట సీఐ అనిల్

జోగిపేట, జూలై 10: సైబరాబాద్ మాజీ (రిటైర్డ్) పోలీస్ కమిషనర్ ప్రభాకర్‌రెడ్డి, మరో ముగ్గురి సంతకాలను ఫోర్జరీ చేసి 57.12 ఎకరాల భూమిని రూ.22.23 కోట్లకు అమ్మేందుకు సిద్ధమయ్యాడు ఓ కేటుగాడు. చివరికి పోలీసులకు దొరికిపోయాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా అందోలులో వెలుగుచూసింది. సైబరాబాద్ మాజీ సీపీ శేరి ప్రభాకర్‌రెడ్డికి అందోలు శివారులో 32.21 ఎకరాల అనువంశిక వ్యవసాయ భూమి ఉంది. దాని పక్కనే వారి బంధువులైన శేరి నర్సింహారెడ్డికి 10.05 ఎకరాలు, రామకృష్ణారెడ్డికి 5.12 ఎకరాలు, శేరి అంజమ్మకు 5.23ఎకరాల భూమి ఉంది. అయితే వీరు నలుగురూ కలిసి భూములను ఉమ్మడిగా అమ్మాలని నిర్ణయించుకున్నారు. కొంతకాలంగా పాసుపుస్తకాలు, ఆధార్ కార్డుల జిరాక్సులను కొందరు రియల్ ఎస్టేట్ బ్రోకర్లకు వాట్సాప్‌లో పంపారు. అవి నారాయణఖేడ్ మండలం ర్యాకల్‌కు చెందిన సంజీవరెడ్డి, కంగ్టి మండలంలోని దెగుల్‌వాడికి చెందిన సుధాకర్‌రెడ్డి, ముకుంద్ నాయక్ తండాకు చెందిన ఆరె రవీందర్‌కు కూడా చేరాయి. వీటిని చూసిన సంజీవరెడ్డికి ఆ భూములను దొంగతనంగా అమ్మేయాలన్న దుర్బుద్ధి పుట్టింది. ఈ విషయాన్ని మిత్రులైన సుధాకర్‌రెడ్డి, రవీందర్‌కు చెప్పాడు. ముగ్గురూ కలిసి దొంగ అగ్రిమెంట్‌ను తయారు చేయించారు. భూయజమానులైన శేరి ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, అంజమ్మ కలిసి సంజీవరెడ్డికి ఎకరాకు రూ.39 లక్షల చొప్పున మొత్తం 57.12 ఎకరాల భూమిని అమ్ముతున్నట్లు, ఇందుకు తాము ఒప్పందం చేసుకున్నట్లు పత్రాలు సృష్టించారు. అందులో సంజీవరెడ్డి.. ఒకే పెన్నుతో రిటైర్డ్ సీపీ సహా నలుగురు భూయజమానుల సంతకాలను ఫోర్జరీ చేశాడు. ఆ అగ్రిమెంట్‌ను తీసుకుని హైదరాబాద్‌కు చెందిన బిల్డర్ యాదగిరిరెడ్డిని సంప్రదించారు. ఎకరా రూ.39 లక్షలకు కొనుగోలు చేశామని, తమకు ఎకరాకు లక్ష లాభం ఇస్తే చాలని చెప్పారు. ఎకరాకు రూ.40 లక్షల చొప్పున 57.12 ఎకరాలను కొనేందుకు ఆయన బేరం కుదుర్చుకున్నారు. బయానా కింద రూ.11 లక్షలు సంజీవరెడ్డి బ్యాంకు ఖాతాలోకి బదిలీ చేశారు. 2 నెలలపాటు సంజీవరెడ్డి విషయాన్ని సాగదీశాడు. నాలుగు రోజుల క్రితం యాదగిరిరెడ్డి ఇతరుల ద్వారా అందోలులోని భూముల వద్దకు వచ్చారు. అదే సమయంలో పంటను చూసేందుకు శేరి నర్సింహారెడ్డి వచ్చారు. మీరెవరని యాదగిరిరెడ్డిని ప్రశ్నించగా.. తాను ఈ భూమిని కొనుగోలు చేస్తున్నానని, అడ్వాన్స్ కూడా చెల్లించానని చెప్పారు. మీకెవరు అమ్మారని నర్సింహారెడ్డి ప్రశ్నించడంతో మోసపోయామని గుర్తించిన యాదగిరిరెడ్డి.. విషయాన్ని శేరి నర్సింహారెడ్డి.. రిటైర్డ్ సీపీ ప్రభాకర్‌రెడ్డికి వివరించగా, ఆయన జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేయమని చెప్పారు. ఆయన కూడా ఎస్పీ చెన్నూరి రమేశ్‌కు సమాచారం అందించారు. ఎస్పీ ఆదేశాలు, నర్సింహారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న సీఐ అనిల్‌కుమార్ దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

డీఎస్సీ వాయిదాకు ఆందోళన వెనుక
కోచింగ్ సెంటర్ల మాఫియా

- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ

హైదరాబాద్, జూలై 10(ఆంధ్రజ్యోతి): డీఎస్సీని వాయిదా వేయాలన్న ఆందోళన వెనుక ప్రైవేట్ శిక్షణ సంస్థల మాఫియా ఉందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిరుద్యోగులు స్వేచ్ఛగా పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతుంటే వాయిదా వేయాలనడంలో కుట్ర కోణం దాగుందన్నారు. సీనియర్ ఐపీఎస్ అధికారులతో కమిటీ వేసి.. ఈ కుట్ర కోణంపై విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కేసీఆర్, కేటీఆర్ ఉసిగొల్పితే గ్యాదరి కిషోర్, బాల్క సుమన్, గువ్వల బాలరాజు సీఎం రేవంత్ రెడ్డిపై సంస్కారహీనంగా మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ మండిపడ్డారు. పేపర్లు లీకై విద్యార్థులు రోడ్డున పడ్డప్పుడు, సునీల్ నాయక్, ప్రవళిక చనిపోయినప్పుడు ఈ సన్నాసులు ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తన పదవి పక్కన పెట్టి వారి అంతు చూస్తానని, 33 జిల్లాల్లోనూ కేసులు పెట్టిస్తానని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ హెచ్చరించారు. ధర్నాలు చేసి అరెస్టైన వారిలో ఎవరూ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు లేరన్నారు.

కోచింగ్ సెంటర్లకు మార్గదర్శకాలు అవసరం: పీడీఎస్‌యూ

హైదరాబాద్ సిటీ: రాష్ట్రంలో కోచింగ్ సెంటర్ల ఏర్పాటుకు మార్గదర్శకాలు విడుదల చేయాలని, కోచింగ్ సెంటర్ల మాఫియాను అరికట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో ఒక్కో భవనంలో పదికి పైగా కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడం, ఒక్కో ఫంక్షన్ హాలులో వందల మంది విద్యార్థులను కూర్చోబెట్టి తరగతులు నిర్వహిస్తున్న పరిస్థితి ఇంకా కొనసాగుతోందన్నారు.

చిన్నారి ప్రాణం కాపాడుదామా!

- కాలేయ సమస్యతో మూడు నెలలుగా ఆస్పత్రిపాలైన శ్రీశాంత్
- వైద్యం కోసం ఇప్పటికే రూ.కోటికి పైగా ఖర్చు
- దాతల సాయం కోరుతున్న తల్లిదండ్రులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీశాంత్

మేడ్చల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): అభంశుభం తెలియని ఓ పదేళ్ల బాలుడు కాలేయ సంబంధిత సమస్యతో మూడు నెలలుగా ఆస్పత్రిపాలై ప్రస్తుతం చావుబతుకులతో పోరాడుతున్నాడు. వైద్యులు శస్త్రచికిత్స తప్పనిసరి అని చెప్పగా.. చికిత్స కోసం ఇప్పటికే రూ.కోటికిపైగా ఖర్చు చేసిన ఆ బాలుడి తల్లిదండ్రులు దాతల సాయం కోరుతున్నారు. మేడ్చల్ మండలం సైదోనిగడ్డ తండాకు చెందిన మోహన్-జ్యోతి దంపతులకు ఓ కూతురు, కుమారుడు శ్రీశాంత్(10) ఉన్నారు. శ్రీశాంత్ మూడునెలల క్రితం అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు శ్రీశాంత్ కాలేయంలో సమస్య ఉందని, వెంటనే మార్పిడి చేయాలని సూచించారు. దీంతో మోహన్ దంపతులు శ్రీశాంత్‌ను హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రిలో చేర్పించారు. శ్రీశాంత్ మామ సురేష్ ముందుకు రావడంతో అతని కాలేయాన్ని శ్రీశాంత్‌కు మార్పిడి చేశారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యుల పర్యవేక్షణలోనే ఆస్పత్రిలో ఉన్న శ్రీశాంత్ ఇన్‌ఫెక్షన్ బారిన పడడంతో ఐసీయూకి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి గురువారం మరింత విషమించడంతో వైద్యులు వెంటనే శస్త్రచికిత్స చేయాలని సూచించారు. కొడుకు ప్రాణాన్ని కాపాడుకునేందుకు ఉన్న కొద్దిపాటి భూమిని తనఖా పెట్టిన తల్లిదండ్రులు రూ. కోటికి పైగా ఖర్చు చేశారు. వారి పరిస్థితిని అర్థం చేసుకున్న రెయిన్‌బో యాజమాన్యం వైద్య ఖర్చులు వద్దని మందుల ఖర్చులు మాత్రమే పెట్టుకోవాలని సూచించింది. దాతలు సాయం చేసి తమ బిడ్డ ప్రాణాన్ని కాపాడాలని వారు వేడుకుంటున్నారు. దాతలు తమను 96030 74233 నంబర్‌లో సంప్రదించాలని శ్రీశాంత్ తండ్రి మోహన్ కోరారు.

అనుసూయ.. ఇక అనుకతిర్ సూర్య

(మొదటి పేజీ తరువాయి)



గుర్తించాలని.. ఎం.అనసూయకు బదులుగా తన పేరును ఎం.అనుకతిర్ సూర్యగా మార్చుకోవడానికి, రికార్డుల్లో తన లింగాన్ని మార్చుకోవడానికి అనుమతించాలని కోరుతూ కేంద్ర ఆర్థిక శాఖలోని రెవెన్యూ విభాగానికి చెందిన 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్'ను అభ్యర్థించారు. దీనికి కేంద్ర ఆర్థిక శాఖ అనుమతించింది. ఈ మేరకు ఆ శాఖ అండర్ సెక్రటరీ శిరీష్‌కుమార్ గౌతమ్ ఉత్తర్వులు జారీ చేశారు. 'హైదరాబాద్‌లో జాయింట్ కమిషనర్‌గా పని చేస్తున్న ఎం.అనుసూయ తన పేరును ఎం.అనుకతిర్ సూర్యగా పేరు మార్చాలని, స్త్రీ నుంచి పురుషుడిగా లింగాన్ని మార్చాలంటూ మాకు విజ్ఞప్తి చేశారు. ఆమె అభ్యర్థనను ఆమోదిస్తున్నాం. ఆ అధికారిణిని ఇక మీదట ఎం.అనుకతిర్ సూర్యగా ప్రభుత్వ రికార్డులన్నింటిలో గుర్తిస్తున్నాం" అని అందులో పేర్కొన్నారు. లింగ మార్పిడికి సంబంధించి 2014లో 'నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా)' కేసులో సుప్రీంకోర్టు తన తీర్పులో పలు కీలక వ్యాఖ్యలు చేసింది. తాము పురుషులుగా ఉండాలా లేక మహిళలుగా ఉండాలా అనేది వ్యక్తుల వ్యక్తిగత నిర్ణయమని స్పష్టం చేసింది. ట్రాన్స్‌జెండర్ల కనీస మానవ హక్కులను తిరస్కరించడానికి ఎలాంటి సమర్థనా లేదని అభిప్రాయపడింది. ఒడిశాలో ఒక వాణిజ్య పన్నుల అధికారి లింగమార్పిడి శస్త్రచికిత్స చేయించుకుని.. ఆ తీర్పు ఆధారంగా రికార్డుల్లో తన లింగాన్ని, పేరును ఐశ్వర్య రితుపర్ణ ప్రధాన్‌గా మార్పించుకున్నారు. కాగా, చెన్నైలోని మద్రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ పట్టా పొందిన అనుకతిర్ సూర్య.. 2013 డిసెంబరులో చెన్నైలో అసిస్టెంట్ కమిషనర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. 2018లో డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి పొంది.. గత సంవత్సరమే బదిలీపై హైదరాబాద్‌కు వచ్చి జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2023లో భోపాల్‌లోని నేషనల్ లా యూనివర్సిటీలో 'పీజీ డిప్లొమా ఇన్ సైబర్ లా అండ్ సైబర్ ఫోరెన్సిక్స్' కోర్సును పూర్తి చేశారు.

పోలీసులు గుర్తు పట్టకుండా ప్లాస్టిక్ సర్జరీలు

న్యూఢిల్లీ, జూలై 10: పోలీసులు తమను గుర్తుపట్టకుండా ఫిలిప్పీన్స్‌లో నేరగాళ్లు ప్లాస్టిక్ సర్జరీలు చేసుకుంటున్నారు. ఇలాంటి వారికోసమని ఆ దేశంలో కొన్ని రహస్య ఆస్పత్రులు కూడా వెలిశాయి. మే నెలలో అధికారులు ఓ ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించిన సమయంలో ఈ విషయం వెల్లడైంది. తాజాగా, మరో రహస్య ఆస్పత్రిని గుర్తించారు. ఈ హాస్పిటళ్లలో హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ పరికరాలు, దంత నమూనాలు, శరీరం రంగును మార్చే ద్రావణాలను స్వాధీనం చేసుకున్నారు. వీటితో ఒక మనిషి రూపురేఖలను పూర్తిగా మార్చవచ్చని అధికారులు తెలిపారు. ఈ రహస్య ఆస్పత్రుల క్లయింట్లంతా నిబంధనలకు విరుద్ధంగా ఫిలిప్పీన్స్‌లో ఉంటున్నవారు, క్యాసినో ఆడేవారు, గ్యాంబ్లర్లు, కరడుగట్టిన నేరస్థులేనని వివరించారు. ఈ వ్యవహారంలో పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు.

భారత్‌లో సగం అనవసర ప్రిస్క్రిప్షన్లే..!

న్యూఢిల్లీ, జూలై 10: భారత్‌లో వైద్యులు సూచిస్తున్న ప్రతి రెండు మెడికల్ ప్రిస్క్రిప్షన్లలో ఒకటి ప్రామాణిక మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉందని ఎయిమ్స్ పరిశోధకుల బృందం నిర్వహించిన అధ్యయనంలో తేలింది. వాటిలో దాదాపు పదో వంతు ప్రిస్క్రిప్షన్లు అసలు ఆమోదయోగ్యంగా లేవని గుర్తించింది. 2019 ఆగస్టు నుంచి 2020 ఆగస్టు మధ్య వైద్యులు జారీచేసిన 4,838 ప్రిస్క్రిప్షన్లను ఈ బృందం విశ్లేషించింది. ఐసీఎంఆర్ ఏర్పాటు చేసిన రేషనల్ యూజ్ ఆఫ్ మెడిసిన్స్ సెంటర్ (ఆర్‌యూఎంసీ)ల నుంచి ఈ ప్రిస్క్రిప్షన్లను సేకరించారు. ఈ క్రమంలో 475 ప్రిస్క్రిప్షన్లు ప్రామాణిక మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉన్నాయని, వాటిలో 54 ప్రిస్క్రిప్షన్లలో పాంటోప్రజోల్‌ను వైద్యులు చాలా తరచుగా సూచించారని గుర్తించారు. 475 ప్రిస్క్రిప్షన్లలో శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, బీపీకి సంబంధించిన మందులు అధికంగా రాశారని, దీనికోసం రాబెప్రజోల్ + డోంపెరిడోన్ ట్యాబ్లెట్లను సూచించారని, ఇది ఆమోదయోగ్యం కాని కాంబినేషన్ అని వైద్యుల బృందం తెలిపింది. ఈ ప్రిస్క్రిప్షన్ల వలన రోగులకు దుష్ప్రభావాలు కలగడమే కాకుండా చికిత్స ఖర్చు పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. రోగికి గ్యాస్ సమస్య వచ్చే అవకాశం ఉంటే గ్యాస్ట్రోప్రొటెక్టివ్ మందులను సూచించాలని, పాంటోప్రజోల్‌ను అనవసరంగా సూచించడం వలన దుష్ప్రభావాలు ఎదురవుతాయని పేర్కొంది. కాగా.. దాదాపు 55% మంది వైద్యులు మాత్రమే ఐసీఎంఆర్ మార్గదర్శకాలకు అనుగుణంగా మందులు సూచిస్తున్నారని వెల్లడించింది.

సీఆర్పీసీ సెక్షన్ 125 కింద..

ముస్లిం మహిళలూ భరణానికి అర్హులే

(మొదటి పేజీ తరువాయి)



ఇప్పించాలని కోరుతూ ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ వేశారు. పూర్వాపరాలను పరిశీలించిన ఫ్యామిలీ కోర్టు.. నెలకు రూ.20 వేలు భరణం కింద చెల్లించాలని సమద్‌ను ఆదేశించింది. ఆ తీర్పును సమద్ తెలంగాణ హైకోర్టులో సవాల్ చేశారు. ముస్లిం పర్సనల్ చట్టం ప్రకారం.. తాను భరణం ఇవ్వాల్సిన అవసరం లేదని, ఆ విషయాన్ని ఫ్యామిలీ కోర్టు పట్టించుకోలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఫ్యామిలీ కోర్టు తీర్పును రద్దు చేయటానికి హైకోర్టు నిరాకరించింది. నెలకు చెల్లించాల్సిన భరణాన్ని మాత్రం రూ.10 వేలకు తగ్గించింది. బాధితురాలు పిటిషన్ వేసినప్పటి నుంచి భరణం చెల్లించాలని ఆదేశించింది. దీనిని సమద్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది వసీం ఖాద్రీ వాదనలను వినిపించారు. విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలకు 'ముస్లిం మహిళల విడాకుల హక్కుల పరిరక్షణ చట్టం, 1986' వర్తిస్తుందిగానీ, సీఆర్పీసీ సెక్షన్ 125 వర్తించదని.. భరణం చెల్లించాల్సిన అవసరం లేదని వాదించారు. ముస్లిం మహిళలకు సీఆర్‌పీసీ సెక్షన్ 125 కన్నా, 1986 నాటి చట్టమే అధిక ప్రయోజనం కలిగిస్తుందన్నారు. కాగా, ఈ కేసులో గౌరవ్ అగర్వాల్ అనే న్యాయవాదిని అమికస్ క్యూరీ(కోర్టు సహాయకుడిగా)గా న్యాయస్థానం నియమించింది. వాదనలను విన్న సుప్రీంకోర్టు తీర్పును ఈ ఏడాది ఫిబ్రవరి 19వ తేదీన రిజర్వు చేసింది. తాజాగా బుధవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం తీర్పును వెలువరించింది. 'ముస్లిం మహిళల విడాకుల హక్కుల పరిరక్షణ చట్టం, 1986', సీఆర్‌పీసీ 125 సెక్షన్.. ఈ రెండింటిలో 125 సెక్షనే ఈ కేసులో వర్తిస్తుందని ధర్మాసనం తన తీర్పులో స్పష్టం చేసింది. "మతాల సరిహద్దులకు అతీతంగా వివాహిత మహిళలకు ఆర్థిక భద్రత కల్పించే, లింగ సమానత్వాన్ని బలోపేతం చేసే హక్కు భరణం" అని స్పష్టం చేసింది. అయితే.. ముస్లిం మహిళలు భరణం కోసం 1986లో రాజీవ్‌గాంధీ సర్కారు తెచ్చిన 'ముస్లిం మహిళల విడాకుల హక్కుల పరిరక్షణ చట్టం, 1986'ను, సీఆర్‌పీసీ 125 సెక్షన్‌ను.. రెండింటినీ ఉపయోగించుకోవచ్చని, ఇవి పరస్పర ఆధారితాలేగానీ పోటీ కావని తెలిపింది. ఈ మేరకు హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సమద్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. న్యాయమూర్తులిద్దరూ వేర్వేరుగా తీర్పులు వెలువరించినప్పటికీ ఒకే విధమైన తీర్పు ఇచ్చారు.

స్వాగతించిన బీజేపీ..

భరణానికి సంబంధించి సీఆర్పీసీ సెక్షన్ 125 మతాలకు అతీతంగా వివాహిత మహిళలందరికీ వర్తిస్తుందంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బీజేపీ స్వాగతించింది. 1985లో ఇదే రీతిలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అతిక్రమిస్తూ 1986లో రాజీవ్‌గాంధీ సర్కారు చట్టాన్ని తెచ్చిందని బీజేపీ ఎంపీ సుధాన్షు త్రివేదీ దుయ్యబట్టారు. షరియాకు, ఇస్లామిక్ చట్టాలకు ప్రాధాన్యం ఇస్తూ చేసిన ఆ చట్టం రాజ్యాంగానికే అతిపెద్ద ప్రమాదాల్లో ఒకటని ఆయన ఆందోళన వెలిబుచ్చారు. "కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా.. అప్పుడు రాజ్యాంగం ప్రమాదంలో పడుతుంది. అప్పట్లో రాజీవ్‌గాంధీ సర్కారు రాజ్యాంగం కంటే షరియాకే ప్రాధాన్యం ఇచ్చింది. కాంగ్రెస్ హయాంలో అణచివేతకు గురైన రాజ్యాంగ ప్రతిష్ఠను సుప్రీం తాజా తీర్పు పునరుద్ధరించింది. రాజ్యాంగానికి పొంచి ఉన్న అతిపెద్ద ముప్పుల్లో ఒకదానికి ముగింపు పలికింది" అని ఆయన వ్యాఖ్యానించారు. కాగా.. ఈ తీర్పుతో ఉమ్మడి పౌరస్మృతి అంశం మరోసారి తెరపైకి వచ్చింది. మళ్లీ అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరస్మృతిని అమల్లోకి తెస్తామని బీజేపీ 2024 ఎన్నికలకు ముందు తన మేనిఫెస్టోలో ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ, ఈసారి బీజేపీకి లోక్‌సభలో పూర్తి మెజారిటీ రాని నేపథ్యంలో అదంత సులువు కాదని రాజ్యాంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

కుటుంబం కోసం భార్యల త్యాగం


జస్టిస్ బీవీ నాగరత్న తన తీర్పులో.. భార్య ఆర్థికంగా ఎవరి మీదా ఆధారపడకుండా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత భర్తదేనని హితవు పలికారు. "సొంతంగా ఆదాయం అంటూ లేని భార్యకు భర్త తన ఆర్థిక వనరులను అందుబాటులో ఉంచాలి. కుటుంబ అవసరాలతోపాటు ఆమె వ్యక్తిగత అవసరాలు తీరేలా చర్యలు తీసుకోవాలి. ఈ చైతన్యాన్ని భర్త కలిగి ఉండాలి. ఈ విధంగా ఆర్థికంగా సమృద్ధిపరిచినప్పుడే కుటుంబంలో భార్య స్థానం ఎవరి మీదా ఆధారపడే పరిస్థితి లేకుండా సుస్థిరంగా ఉంటుంది. ఈ విధమైన చైతన్యాన్ని కలిగి ఉండి.. తన ఏటీఎం కార్డును ఇవ్వటం ద్వారా, బ్యాంకులో ఖాతాను ఇద్దరి పేరు మీద తీసుకోవటం ద్వారా భార్యను ఆర్థికంగా ఆత్మవిశ్వాసంతో ఉంచేలా వ్యవహరిస్తున్న భర్తలను అభినందించాలి" అని పేర్కొన్నారు. ఆర్థికంగా భర్త మీదే ఆధారపడే భార్యకు ఆర్థికపరమైన ఒత్తిడి లేకుండా చూడటానికే భరణం అని స్పష్టం చేశారు. విడాకులు తీసుకున్న వారేగాక వివాహిత మహిళలందరికీ ఈ అవకాశం రాజ్యాంగం కల్పించిందన్నారు.

'సీబీఐ దుర్వినియోగం' పిటిషన్ విచారణార్హమే

- బెంగాల్ సర్కారుకు సుప్రీంలో ఊరట
- ఆగస్టు 13వ తేదీకి విచారణ వాయిదా

న్యూఢిల్లీ, జూలై 10: పశ్చిమ బెంగాల్ సర్కారుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. సీబీఐని దుర్వినియోగం చేస్తున్నారని కేంద్రానికి వ్యతిరేకంగా బెంగాల్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ విచారణకు అర్హమైందేనని బుధవారం కోర్టు స్పష్టం చేసింది. బెంగాల్‌లో సీబీఐ చేపట్టిన కేసుల దర్యాప్తును సవాల్ చేసే అధికారం ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని పేర్కొంది. బెంగాల్ సర్కారు వ్యతిరేకిస్తున్నప్పటికీ సందేశ్‌ఖాలీ లైంగిక వేధింపులు, భూకబ్జాలు తదితర కేసులపై సీబీఐ విచారణకు అనుమతినిస్తూ కోల్‌కత్తా హైకోర్టు ఇటీవలే తీర్పునిచ్చిన నేపథ్యంలో.. సుప్రీంకోర్టు దాన్ని వ్యతిరేకించింది. 2018లోనే రాష్ట్రంలో సీబీఐకి సమ్మతిని ఉపసంహరించుకున్నప్పటికీ కేసులు నమోదు చేయడాన్ని వ్యతిరేకిస్తూ బెంగాల్ సర్కారు సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు.. మే 8వ తేదీన తీర్పు రిజర్వు చేసింది. 'బెంగాల్ పిటిషన్‌ను కొనసాగించడం సరికాదు. సీబీఐ నియంత్రణ మా పరిధిలో లేదు' అంటూ కేంద్రం చేసిన వాదనలను జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విశ్వనాథన్‌ల ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ కేసు సమాఖ్య భావనపై ప్రభావం చూపుతుందని పేర్కొంది. 'ఢిల్లీ ప్రత్యేక పోలీసు చట్టం (డీఎస్‌పీఈ) నిబంధనల మేరకు సీబీఐ తమ అధికార పరిధిలో దర్యాప్తు నిర్వహించడానికి సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి తప్పనిసరి. మా దృష్టిలో డీఎస్‌పీఈ చట్టం మేరకు కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన సంస్థే సీబీఐ.. ఏదేమైనా రాష్ట్ర ప్రభుత్వ సమ్మతి లేకుండా డీసీపీఈ చట్టం కింద సీబీఐ కేసు నమోదు చేయొచ్చా లేదా అనే చట్టపరమైన సమస్య ఉత్పన్నమవుతున్నట్లు గుర్తించాం' అని వ్యాఖ్యానించింది. విచారణను ఆగస్టు 13వ తేదీకి వాయిదా వేసింది.

లోకం తీరు



30వేల కోట్లు ఇవ్వండి

- కేంద్ర ఆర్థిక మంత్రిని కోరిన బిహార్ సీఎం నితీశ్ కుమార్

న్యూఢిల్లీ, జూలై 10: బిహార్‌కు ప్రత్యేక హోదాతో పాటు కేంద్ర బడ్జెట్‌లో రూ.30వేల కోట్ల నిధులను కేటాయించాలని ఆ రాష్ట్ర సీఎం, జేడీయూ అధినేత నీతీశ్ కుమార్ కోరారు. అలాగే రాష్ట్ర రుణపరిమితిని కూడా పెంచాలన్నారు. కేంద్రంలోని ఎన్డీయే కూటమిలో భాగస్వామి అయిన జేడీయూ అధినేత తమ కోరికల జాబితాను గత నెలలో జరిగిన 'బడ్జెట్ ముందు సమావేశం'లోనే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలకు అందించినట్లు సమాచారం. బిహార్‌లో 9 విమానాశ్రయాలు నిర్మించాలని, 4 కొత్త మెట్రో లైన్లు నిర్మించాలని జాబితాలో పేర్కొన్నారు. 7 వైద్య కళాశాలలు మంజూరు చేయాలన్నారు. భారీ థర్మల్ విద్యుత్ ప్లాంట్‌కు నిధులు సమకూర్చాలని కోరారు.

నితీశ్ రాజకీయ వారసుడు మనీశ్!



పట్నా, జూలై 10: నితీశ్ కుమార్ రాజకీయ వారసుడు ఎవరంటూ జరుగుతున్న చర్చకు దాదాపుగా తెర పడినట్టే! ఆయన సలహాదారు, మాజీ ఐఏఎస్ మనీశ్ వర్మ అధికారికంగా జేడీయూలో చేరారు. మనీశ్ చేరికతో నితీశ్ వారసుడి విషయంలో స్పష్టత వచ్చేసినట్టేనని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఆయనను త్వరలోనే పార్టీ జాతీయ ప్రధాని కార్యదర్శిగా నితీశ్‌కుమార్ నియమిస్తారని ఈ వర్గాలు చెబుతున్నాయి. మనీశ్ 2000 బ్యాచ్ ఒడిశా కేడర్ ఐఏఎస్ అధికారి. 2018లో నితీశ్ సూచనతో స్వచ్ఛంద పదవీవిరమణ పొందారు. అప్పటినుంచి నితీశ్‌కు బాగా సన్నిహితంగా ఉంటున్నారు. జేడీయూ సామాజిక పునాది వర్గం అయిన కుర్మీలకు చెందిన వ్యక్తి కావడం మనీశ్ వర్మకు కలిసివచ్చిందని విశ్లేషకులు అంటున్నారు.





స్లీపర్ బస్సు పాల ట్యాంకర్ ఢీ.. 18 మంది మృతి

ఉత్తరప్రదేశ్‌లో ఆగ్రా- లఖ్‌నవూ ఎక్స్‌ప్రెస్‌వేపై బుధవారం తెల్లవారుజామున డబుల్ డెక్కర్ స్లీపర్ బస్సు- పాలట్యాంకర్ ఢీకొన్నాయి. ప్రమాదంలో రెండు వాహనాల డ్రైవర్లు సహా 18 మంది దుర్మరణం పాలవ్వగా, మరో 19 మంది గాయపడ్డారు. ప్రమాద తీవ్రతకు బస్సు ఇలా నుజ్జునుజ్జు అయ్యింది.

భారత్-చైనా సరిహద్దులో

108 కిలోల బంగారం సీజ్

లేహ్, జూలై 10: లద్దాఖ్‌లోని భారత్-చైనా సరిహద్దుకు సమీపంలో భారీగా స్మగ్లింగ్ చేస్తున్న బంగారం పట్టుబడింది. ఒక్కోటి కిలో బరువున్న 108 బంగారు కడ్డీలను (108 కిలోలు) ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీసులు (ఐటీబీపీ) స్వాధీనం చేసుకున్నారని, ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు ఓ అధికారి తెలిపారు. బంగారంతో పాటు రెండు మొబైల్ ఫోన్లు, ఒక బైనాక్యులర్, రెండు కత్తులు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఐటీబీపీ చరిత్రలో ఇంత భారీ స్థాయిలో ఎన్నడూ బంగారాన్ని పట్టుకోలేదని ఆ అధికారి చెప్పారు.

పంజాబ్, గోవా ఎన్నికల కోసం

రూ.100 కోట్లు డిమాండ్

- ఆప్ నేతలు వినోద్ చౌహాన్‌తో అడిగించారు
- ఈడీ చార్జిషీట్‌లో వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 10: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆప్ నేతలు పంజాబ్, గోవా ఎన్నికల ఖర్చుల కోసం అదనంగా రూ.100 కోట్లను డిమాండ్ చేసినట్లు ఈడీ ఆరోపించింది. మంగళవారం ఈ మేరకు రౌస్ అవెన్యూ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ కేసులో ఏ-37గా ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, ఏ-38గా పేర్కొన్న ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)లకు వ్యతిరేకంగా అభియోగాలు మోపింది. వినోద్ చౌహాన్ ద్వారా కేజ్రీవాల్ తమను రూ.100 కోట్ల మేర అదనపు డబ్బులను డిమాండ్ చేశారని, పంజాబ్, గోవా ఎన్నికల ఖర్చుల కోసం ఆ మేరకు అందజేయాలని సూచించారని ఈ కేసులో అప్రూవర్‌గా మారిన అరబిందో ఫార్మా డైరెక్టర్ శరత్‌రెడ్డి వాంగ్మూలాన్ని ఉటంకించారు. ఢిల్లీ జల్ బోర్డు(డీజేబీ) పోస్టింగుల్లోనూ వినోద్ చౌహాన్ కీలకంగా వ్యవహరించారని, నేరుగా కేజ్రీవాల్ ద్వారా వ్యవహారాలు నెరిపారని పేర్కొన్నట్లు ప్రస్తావించారు. అయితే.. తనకు శరత్‌రెడ్డి ఎవరో తెలియదని కేజ్రీవాల్ తన వాంగ్మూలంలో చెప్పారు.

15న హైకోర్టులో విచారణ

కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌ను సవాలు చేస్తూ ఈడీ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై మంగళవారమే కేజ్రీవాల్‌కు నోటీసులు ఇచ్చామని, ఆయన స్పందన రాత్రికి వస్తుందని, ఆ తర్వాత కౌంటర్ సమర్పించాలని న్యాయమూర్తి జస్టిస్ నీనా బన్సాల్.. ఈడీ తరఫున వాదనలు వినిపిస్తున్న ఏఎస్జీ రాజుకు సూచించింది. మంగళవారం అర్ధరాత్రి కేజ్రీవాల్ లేఖ అందగా.. బుధవారం విచారణ సందర్భంగా తమకు కొంత సమయం కావాలని ఈడీ కోరింది. కేజ్రీవాల్ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ అభ్యంతరం వ్యక్తం చేసినా.. కోర్టు ఈ నెల 15కు విచారణను లిస్ట్ చేసింది.

ఏ సమస్యకైనా చర్చలే పరిష్కారం

యుద్ధాలకు ఇది సమయం కాదు.. శాంతిస్థాపనకు మేం సహకరిస్తాం

- ఆస్ట్రియా చాన్స్‌లర్ నెహామర్‌తో కలిసి ప్రధాని మోదీ ప్రకటన



ప్రధాని మోదీతో కర్ల్ నెహామర్ సెల్ఫీ

వియన్నా, జూలై 10: ఆస్ట్రియా చాన్స్‌లర్ కర్ల్ నెహామర్‌తో ఫలప్రదమైన చర్చలు జరిగాయని ప్రధాని మోదీ బుధవారం వెల్లడించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు సహా ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న వివాదాలపై తాము విస్తృతంగా చర్చలు జరిపినట్లు తెలిపారు. "ఇది యుద్ధానికి సమయం కాదు" అని మోదీ పునరుద్ఘాటించారు. ఏ సమస్యలనైనా చర్చలతోనే పరిష్కరించుకోవాలని, యుద్ధాలతో కాదని స్పష్టం చేశారు. రష్యాలో రెండు రోజుల పర్యటన ముగించుకున్న మోదీ.. మంగళవారం రాత్రి వియన్నా చేరుకున్నారు. ఒక భారత ప్రధాని ఆస్ట్రియాకు వెళ్లడం 41 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. 1983లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ అక్కడ పర్యటించారు. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు మోదీ వెళ్లారు. ఆస్ట్రియా విదేశాంగ మంత్రి అలెగ్జాండర్ స్కాలెన్‌బర్గ్ ప్రధాని మోదీకి స్వాగతం పలికారు. తర్వాత చాన్స్‌లర్ నెహామర్ మోదీకి విందు ఏర్పాటు చేశారు. అనంతరం జరిగిన చర్చల్లో భారత్-ఆస్ట్రియా దేశాల మధ్య ద్వైపాక్షిక బంధాలను మరింత బలోపేతం చేయడానికి సంబంధించిన ప్రణాళిక రూపొందించాలని నిర్ణయించినట్లు మోదీ తెలిపారు. "చాన్స్‌లర్ నెహామర్, నేను ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణం, ఇతర సమస్యలపై చర్చించాం. ఇది యుద్ధానికి సమయం కాదని నేను ఇప్పటికే చెప్పాను. యుద్ధం ద్వారా సమస్యలను పరిష్కరించుకోలేం. ఎక్కడైనా సరే అమాయకులు ప్రాణాలు కోల్పోవడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు" అని నెహామర్‌తో కలిసి సంయుక్త మీడియా ప్రకటనలో మోదీ పేర్కొన్నారు. శాంతిస్థాపనకు చర్చలు, దౌత్యపరమైన మార్గాలే శరణ్యమని ఇరువురు నేతలు స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి సహకారం అందించేందుకైనా తాము సిద్ధమని ప్రకటించారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి స్థాపన ప్రక్రియలో భారత్‌ది కీలక పాత్ర అని నెహామర్ చెప్పారు. తటస్థ దేశంగా ఉన్న ఆస్ట్రియా శాంతి చర్చలకు సరైన ప్రాంతమని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, నవకల్పనలు, పునరుత్పాదక ఇంధనం, హైడ్రోజన్, నీరు, వ్యర్థాల నిర్వహణ, ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీ రంగాల్లో ఇరుదేశాలు కలిసి పని చేసి, ఆయా రంగాల్లో బలోపేతం కావాలని నిర్ణయించినట్లు మోదీ తెలిపారు. ఇరుదేశాల మధ్య యువత ఆలోచనలను పంచుకునేందుకు స్టార్టప్ వ్యవస్థ వారధిగా నిలుస్తుందన్నారు. భారత్‌లో పెట్టుబడులకు ఆస్ట్రియా కంపెనీలను మోదీ ఆహ్వానించారు. మౌలిక సదుపాయాలు, ఇంధన రంగాల్లో అవకాశాలున్నాయని తెలిపారు. కాగా, మంగళవారం రాత్రి వియన్నా చేరుకున్న మోదీకి 'వందేమాతరం' ఆలపిస్తూ స్వాగతం పలికారు.

భారత్ మాకు వ్యూహాత్మక భాగస్వామే!

- రష్యాతో బంధం ఆందోళనకరం
- అమెరికా అధ్యక్ష భవనం

వాషింగ్టన్, జూలై 10: భారత్-రష్యా భాగస్వామ్య ఒప్పందాలు, ఇరు దేశాల మధ్య స్నేహం వంటి కీలక విషయాలపై అమెరికా కీలక వ్యాఖ్యలు చేసింది. రష్యాతో భారత్ బంధంపై తాము ఆందోళన చెందుతున్నామని చెబుతూనే.. భారత్‌ను తాము వ్యూహాత్మక భాగస్వామ్య దేశంగానే పరిగణిస్తున్నట్టు తెలిపింది. ఈ మేరకు అమెరికా అధ్యక్ష భవనం అధికార ప్రతినిధి వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ రెండు రోజుల పాటు రష్యాలో పర్యటించిన విషయం తెలిసిందే. 22వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ఒప్పందాలు చేసుకున్నారు. ద్వైపాక్షిక అంశాలపైనా సమగ్రంగా చర్చించారు. ఇదే సమయంలో ఉక్రెయిన్-రష్యా యుద్ధంపైనా మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్ష భవనం అధికార ప్రతినిధి, మీడియా కార్యదర్శి మేజర్ జనరల్ పాట్ రైడెర్ మాట్లాడుతూ..రష్యాతో భారత్ సంబంధాలు కొనసాగించినా.. భారత్ విషయంలో తమ వైఖరి మారబోదన్నారు. అయితే, మోదీతో భేటీని పుతిన్ తనకు అనుకూలంగా మలుచుకునే అవకాశం ఉందన్నారు.

ఏపీలో బీపీసీఎల్ భారీ పెట్టుబడి!

- 75 వేల కోట్లతో ఆయిల్ రిఫైనరీ!!
- సీఎం చంద్రబాబుతో సంస్థ సీఎండీ భేటీ



సీఎం చంద్రబాబుతో సమావేశంలో బీపీసీఎల్, విన్‌ఫాస్ట్ ప్రతినిధులు, సీఎస్ నీరబ్ కుమార్

అమరావతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఏపీలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు దిగ్గజ పారిశ్రామిక సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. దాదాపు రూ.75 వేల కోట్ల పెట్టుబడులతో రాష్ట్రంలో ఆయిల్ రిఫైనరీ, పెట్రో కమికల్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసేందుకు దిగ్గజ ప్రభుత్వ రంగ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ముందుకొచ్చింది. చైర్మన్-మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో ఆ సంస్థ ప్రతినిధులు బుధవారమిక్కడ వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయానికి వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. మరోవైపు తాము కూడా రాష్ట్రంలో రూ.4 వేల కోట్ల పెట్టుబడులు పెడతామంటూ వియత్నాంలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో మంచి పేరున్న విన్‌ఫాస్ట్ కంపెనీ సీఈవో పామ్ సాన్ చౌ, ఆ సంస్థ ప్రతినిధులు కూడా సీఎంతో సమావేశమయ్యారు. ఈ రెండు సంస్థల బృందాలతో వేర్వేరుగా భేటీ అయిన ఆయన.. తొలుత ఆయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుపై బీపీసీఎల్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టుకు 4-5 వేల ఎకరాల భూమి అవసరమవుతుందని వారు ఆయనకు తెలిపారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించారు. అవసరమైనన్ని భూములు కేటాయించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 90 రోజుల్లోగా ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు సంబంధించిన పూర్తి ప్రణాళికతో రావాలని కోరారు. అక్టోబరుకల్లా పూర్తి ఫీజిబులిటీ రిపోర్టుతో వస్తామని బీపీసీఎల్ ప్రతినిధులు తెలిపారు. విన్‌ఫాస్ట్ సంస్థ ప్రతినిధులు కూడా ఆయనతో సమావేశమయ్యారు. రూ.4 వేల కోట్ల పెట్టుబడితో ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీల తయారీ కర్మాగారం ఏర్పాటుకు సంసిద్ధత తెలిపారు.

జగన్‌రెడ్డి.. నువ్వూ ఒకరినొకరు ఓదార్చుకోండి

- వైసీపీ.. బీఆర్ఎస్ ఒకేజాతి పక్షులు
- ప్రజావ్యతిరేక పాలనతోనే కేటీఆర్, కేతిరెడ్డి ఓటమి: ఏపీ మంత్రి సత్యకుమార్

ధర్మవరం/అమరావతి, జూలై 10: భూ దోపిడీలో ఏపీ, తెలంగాణలో వైసీపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒకేజాతి పక్షులని, దొంగలంతా ఒకటై ఎన్డీఏ ప్రజాపాలనను విమర్శిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మండిపడ్డారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం ఆర్టీసీ డిపోలో నూతన బస్సు సర్వీసును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ప్రజా వ్యతిరేక పాలన సాగించినందుకే ఓడిపోయామనే విషయాన్ని మరిచిపోయి కేటీఆర్, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి (ధర్మవరం మాజీ ఎమ్మెల్యే) విమర్శలకు దిగడం వారి అజ్ఞానానికి నిదర్శనమని సత్యకుమార్ ఎద్దేవ చేశారు. తెలంగాణలో ధరణి పోర్టల్‌తో భూ మాఫియా రాజ్యమేలిందని, ధర్మవరంలో కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గుడ్ మార్నింగ్ పేరుతో సందులు గొందులు తిరిగి భూ కబ్జాలకు పాల్పడ్డారని విమర్శించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు, చివరికి చెరువులు, కొండలను మింగేసిన మీ భూ బకాసుర మిత్రుడి 'గుడ్ మార్నింగ్' గురించి ఇక్కడి ప్రజల్ని అడిగితే కబ్జా, కలెక్షన్, కరప్షన్, కమీషన్ అని చెబుతారని, అధికారం ఊడినప్పటి నుంచి ఫామ్ హౌస్‌కే పరిమితమైన మీరు ఎక్స్‌లో అడిగినా ధర్మవరం ప్రజలు సమాధానమిస్తారని కేటీఆర్‌పై సత్యకుమార్ వ్యంగాస్త్రాలు సంధించారు. తెలంగాణను దోచేసిన కేటీఆర్‌కు ఇటువంటి మిత్రులు ఉండబట్టే రెండు రాష్ట్రాల్లోనూ దొంగలు దొంగలు ఊళ్లు పంచుకుని, ప్రజలను పీల్చిపిప్పి చేశారని సత్యకుమార్ మండిపడ్డారు. ఏపీలో జగన్, ధర్మవరంలో కేతిరెడ్డి ప్రజాకంటకులుగా మారి ఓడిపోయారని అన్నారు. తెలంగాణలో పెరిగిన జీడీపీ కేసీఆర్ కుటుంబానిదేనని ఎక్స్‌లో విమర్శిస్తే... తనను కేటీఆర్ బ్లాక్ చేశారని, దీన్నిబట్టే ఆయన మనస్తత్వం ఏమిటో తెలిసిపోతుందని సత్యకుమార్ ఎద్దేవ చేశారు. 'అవినీతి, అసమర్థత, తలకెక్కిన అహంకారమే మిమ్మల్ని, మీ స్నేహితుడు జగన్‌రెడ్డిని ఎన్నికల్లో చిత్తు చిత్తు చేశాయి. ఒకే జాతి పక్షులైన ఇద్దరూ ఒకరికొకరు సర్టిఫికెట్ ఇచ్చుకొంటూ ఓదార్చుకోండి' అంటూ తనదైన శైలిలో సత్యకుమార్ వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించిన తెలంగాణ ప్రజలు... పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను చావు దెబ్బ కొట్టినా బుద్ధి రాలేదంటూ కేటీఆర్‌పై మండిపడ్డారు. కేంద్రంలో, రాష్ట్రంలో నరేంద్రమోదీ, చంద్రబాబు ప్రజాసంక్షేమ పాలన సాగిస్తున్నారని, ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచేలా చొరవ తీసుకుంటున్నారని అన్నారు.

ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణతో సింగరేణి సీఎండీ బలరాం భేటీ



సింగరేణి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం బుధవారం ఏబీఎన్, ఆంధ్రజ్యోతి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. సింగరేణి విస్తరణ, సంస్థ అభివృద్ధితో పాటు ఇతర రాష్ట్రాల్లో విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం తదితర అంశాలపై ఇద్దరు మాట్లాడుకున్నారు. అభిప్రాయాలను పంచుకున్నారు.

సమ్మక్కసాగర్ బ్యారేజీకి అనుమతులు తేవాలి

» అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సమ్మక్కసాగర్ బ్యారేజీకి అవసరమైన అనుమతుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ తెస్తేనే అనుమతి స్తామని కేంద్ర జలవనరుల సంఘం తేల్చడంతో అనుమతులు సాధించే విషయంలో తగు చర్యలు తీసుకోవాలని మంత్రి నిర్దేశించారు. బుధవారం నీటిపారుదల ప్రాజెక్టులపై ఆయన జలసౌధలో నీటిపారుదల శాఖ సలహాదారుడు ఆదిత్యనాథ్‌దాస్‌తో కలిసి సమీక్షించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రెండో దశ పర్యావరణ అనుమతి కేంద్ర అటవీ, పర్యావరణ వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ వద్ద ఉందని, దీనికి అనుమతి పొందేందుకు అవసరమైన కసరత్తు చేపట్టాలన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం డీపీఆర్ గురించి ఆరా తీశారు. ఈ డీపీఆర్ ప్రస్తుతం గోదావరి బోర్డుకు చేరిందని, బోర్డు సమావేశం తర్వాత టెక్నికల్ అడ్వయిజరీ కమిటీకి చేరుతుందని అధికారులు మంత్రి తెలిపారు.

వైద్య సాంకేతిక పరిశ్రమల అభివృద్ధికి ప్రోత్సాహం: శ్రీధర్‌బాబు

» హైదరాబాద్‌లో మెడ్‌ట్రానిక్ గ్లోబల్ ఐటీ కేంద్రం ప్రారంభం

హైదరాబాద్, జూలై 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం వైద్య సాంకేతిక పరిశ్రమల అభివృద్ధికి అంకిత భావంతో పని చేస్తోందని పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. రాష్ట్రంలో మెడికల్ టెక్నాలజీ పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వం అవసరమైన అన్నిరకాలుగా సహాయ సహకారాలను అందిస్తుందని చెప్పారు. బుధవారం శ్రీధర్ బాబు హైదరాబాద్‌లోని మెడ్‌ట్రానిక్ ఇంజినీరింగ్ ఇన్నోవేషన్ సెంటర్ (ఎంఈఐసీ)లో గ్లోబల్ ఐటీ (జీఐటి) కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఐదు నెలల వ్యవధిలోనే మెడ్‌ట్రానిక్ విస్తరణ, పరిశోధన కోసం గ్లోబల్ ఐటీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం విశేషమన్నారు. అనంతరం మెడ్‌ట్రానిక్ ఎస్‌విపి, సీఐఓ రష్మీకుమార్ మాట్లాడారు. మారుతున్న ప్రపంచ అవసరాలకు అనుగుణంగా మెడ్‌ట్రానిక్ నూతన సాంకేతిక ఆవిష్కరణలకు కేంద్రమన్నారు. తమ సంస్థను విస్తరించేందుకు తగిన ప్రోత్సాహాన్ని అందించిన తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూలో 'సైబర్'కోర్సు

పుల్‌కల్, జూలై 10: సుల్తాన్‌పూర్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీకల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్‌లో ఈ ఏడాది కొత్తగా సైబర్ సెక్యూరిటీ కోర్సును ప్రవేశపెట్టినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.నరసింహ తెలిపారు. కళాశాలలో బీటెక్‌లో ఈడబ్ల్యూఎస్ కోటా 36 సీట్లతో కలిపి మొత్తం 396 సీట్లు అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. ఈ నెల 19 నుంచి ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు.

37 లక్షల ఎకరాల్లో పత్తి, 4 లక్షల ఎకరాల్లో వరి

» ఖరీఫ్ పంటల సాగుపై వ్యవసాయశాఖ నివేదిక

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో సాధారణ సాగు విస్తీర్ణం సుమారు 130 లక్షల ఎకరాలు కాగా ఇప్పటి దాకా సుమారు 55 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో 37 లక్షల ఎకరాల్లో పత్తి సాగవ్వగా మరో నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరినాట్లు వేశారు. గతేడాది ఇదే సమయానికి సుమారు 43 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయగా ఈసారి అంతకంటే 12 లక్షల ఎకరాల అధిక విస్తీర్ణంలో పంటలు సాగవ్వడం గమనార్హం. ఈ మేరకు ఖరీఫ్ పంటల సాగుపై వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి బుధవారం ఓ నివేదిక సమర్పించింది. ఆ నివేదిక ప్రకారం వరి సాధారణ సాగు విస్తీర్ణం 57,18,527 ఎకరాలు కాగా ఇప్పటివరకు 4,14,016 ఎకరాల్లో రైతులు నాట్లు వేశారు. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 50,48,904 ఎకరాలు కాగా ఇప్పటిదాకా 36,88,217 ఎకరాల్లో రైతులు పత్తి విత్తనాలు నాటారు. ఆదిలాబాద్ జిల్లా రైతులు ఈ సీజన్‌లో వంద శాతం సాగు పూర్తి చేశారు. జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 5,62,093 ఎకరాలు కాగా ఇప్పటికే 5,62,685 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు.

టీజీఎప్‌సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

తెలంగాణ ఎప్‌సెట్- 2024 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను కమిషనర్ శ్రీదేవసేన బుధవారం విడుదల చేశారు. దాని ప్రకారం.. ఫీజు చెల్లింపునకు ఈ నెల 12వ తేదీనే ఆఖరు. 13న ధ్రువపత్రాలన పరిశీలన చేసి, వెబ్ ఆప్షన్ల ఎంపికకు 15వ తేదీ వరకు అవకాశం కల్పించి 19వ తేదీ సీట్ల కేటాయిస్తారు. పూర్తి వివరాలకు http://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఇంటర్ ఫలితాల్లో ప్రతిభను చాటిన విద్యార్థులు జాతీయ ప్రతిభా ఉపకార వేతనాలకు అక్టోబరు 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ ఇంటర్ బోర్డు తెలిపింది. ఇదివరకు ఉపకారవేతనాలు పొందుతున్న విద్యార్థులు తమ దరఖాస్తులను రెన్యూవల్ చేసుకోవాలని గుర్తు చేసింది. విద్యార్థులు http://scholorships.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని బోర్డు తెలిపింది.

విద్యార్థినిపై హెడ్‌మాస్టర్ లైంగిక వేధింపులు

» విషయం బయటకుపొక్కడంతో రూ.1.50 లక్షలకు రాజీ

బాన్సువాడ, జూలై 10: పాఠశాల ప్రధానోపాధ్యాయుడే ఓ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఇతర విద్యార్థుల ద్వారా విషయం బయటకు రాగా.. తప్పును కప్పిపుచ్చుకునేందుకు రూ.1.50లక్షలకు రాజీ కుదుర్చుకున్నాడు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని దేశాయిపేట జడ్పీహైస్కూల్‌లో కొద్ది రోజుల క్రితం జరిగిన ఈ ఘటన బుధవారం వెలుగు చూసింది. దేశాయిపేట్ జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు నరేందర్ తన పాఠశాలకు చెందిన ఓ విద్యార్థినితో కొంతకాలంగా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. గత శనివారం తరగతి గదిలో ఎవరూ లేని సమయంలో ఆ విద్యార్థినిని లైంగికంగా వేధించాడు. దీనిని గమనించిన కొందరు విద్యార్థులు విషయాన్ని బాధిత బాలిక తల్లిదండ్రులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గ్రామ ప్రజలు, బాధిత బాలిక తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయుడిని నిలదీసేందుకు సోమవారం పాఠశాలకు రాగా హెచ్ఎం నరేందర్ విధులకు గైర్హాజరయ్యాడు. ఓ పోలీసు అధికారి, విద్యాశాఖ అధికారి, పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు కలిసి బాధిత విద్యార్థిని కుటుంబీకులతో మాట్లాడి విషయం బయటకు పొక్కకుండా 1.5 లక్షలకు రాజీ కుదిర్చారు. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లగా.. బాధిత విద్యార్థిని తల్లిదండ్రులను పిలిపించి విచారించారు. ఈ మేరకు హెచ్ఎం నరేందర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గరిష్ఠ పరిహారం ఇవ్వండి!

(మొదటిపేజీ తరువాయి)

కుదుర్చుకోవాల్సి ఉంటుందని అధికారులు చెప్పగా.. వెంటనే ఆ పని పూర్తిచేయాలని సీఎం ఆదేశించారు. ఇక ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం భూ సేకరణలో ఉన్న ఆటంకాలపైనా రేవంత్ ఆరా తీశారు. అలైన్‌మెంట్ విషయంలో కొందరు రైతులు హైకోర్టును ఆశ్రయించడంతో స్టే ఇచ్చిందని యాదాద్రి కలెక్టర్ హన్మంత్ తెలపగా.. స్టే తొలగింపునకు వెంటనే కౌంటర్ దాఖలు చేయాలని సీఎం సూచించారు. నాగ్‌పూర్- విజయవాడ కారిడార్‌లో ఖమ్మం జిల్లాలో భూసేకరణ పరిస్థితి ఏ దశలో ఉందని రేవంత్ అధికారులను అడిగారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ అంశంపై మాట్లాడుతూ.. ఖమ్మం సమీపంలోని విలువైన భూముల గుండా రహదారి వెళ్తోందని, పరిహారం విషయంలో రైతులను ఒప్పిస్తున్నామని తెలిపారు. తల్లాడ-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులు సాగుతున్నందున, ప్రస్తుతం ఖమ్మం-అశ్వారావుపేట జాతీయ రహదారిని రాష్ట్ర రహదారిగా మార్చుకోవాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులు సూచిస్తున్నారని.. దానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించవద్దని తుమ్మల చెప్పారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ.. నాగ్‌పూర్-విజయవాడ కారిడార్‌లో భాగంగా నిర్మిస్తున్న రహదారిలో పెద్ద గ్రామాలున్న చోట సర్వీసు రోడ్లు నిర్మించాలని, రైతులు పొలాలకు వెళ్లేందుకు వీలుగా అండర్ పాస్‌లు నిర్మించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులను కోరారు. దీంతోపాటు జాతీయ రహదారుల వెంట వ్యవసాయ వాహనాలు, రైతులు వినియోగించుకునేలా గ్రావెల్ రోడ్లు నిర్మించాలనే ప్రతిపాదనపై చర్చకు రాగా.. ఈ రెండు అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు సభ్యుడు అనిల్ చౌదరి చెప్పారు. గ్రావెల్ రోడ్లు నిర్మించడం వల్ల రైతులకు ఉపయోగపడడంతో పాటు భవిష్యత్తులో రహదారి విస్తరణకు ఇబ్బందులు ఉండవని సీఎం అభిప్రాయపడ్డారు.

సమన్వయంతో ముందుకు సాగండి..

ఆర్మూర్- జగిత్యాల- మంచిర్యాల, విజయవాడ-నాగ్‌పూర్ కారిడార్ రహదారులకు సంబంధించి అటవీ శాఖ భూముల బదలాయింపు సమస్యపైనా సమీక్షలో చర్చ జరిగింది. దీనిపై సీఎం రేవంత్ మాట్లాడుతూ.. అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ భూములు కేటాయించాలని కలెక్టర్లకు సూచించారు. ఈ విషయంలో రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. రహదారుల నిర్మాణానికి ఉన్న ఆటంకాలను తొలగించాలన్నారు. హైదరాబాద్-మన్నెగూడ రహదారి పనులను త్వరగా ప్రారంభించాలని, విజయవాడ-నాగ్‌పూర్ రహదారి నిర్మాణానికి భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం సూచించారు. హైదరాబాద్-విజయవాడ రహదారి ఆరు వరసల విస్తరణకు భూసేకరణ పూర్తయినందున వెంటనే పనులు చేపట్టాలని మంత్రి కోమటిరెడ్డి కోరగా.. రెండు నెలల్లో ప్రారంభిస్తామని అనిల్ చెప్పారు.

పదెకరాలకు పరిమితి పెట్టాలి

కౌలు రైతుకూ రైతుభరోసా ఇవ్వాలి.. పట్టాదారుకు దక్కే రూ.10వేలలో కౌలుదారుకు సగం ఇవ్వాలి

» ఐటీ రిటర్న్స్ దాఖలు చేసిన వారికి, రేషన్ కార్డు లేనివారికీ ఇవ్వాలి
» ఖమ్మం కలెక్టరేట్‌లో విధివిధానాలపై వర్క్‌షాప్‌లో రైతుల సూచనలు
» అభిప్రాయ సేకరణ జరిపిన మంత్రులు



రైతుభరోసా వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రులు తుమ్మల, పొంగులేటి

ఖమ్మం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా అమలు విధివిధానాలపై రైతుల నుంచి సలహాలు, సూచనల కోసం ఉమ్మడి పది జిల్లాల్లో నిర్వహించ తలపెట్టిన వర్క్‌షాప్ కార్యక్రమానికి ప్రభుత్వం కదిలింది. బుధవారం తొలి వర్క్‌షాప్‌ను ఖమ్మం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి క్యాబినెట్ ఉపసంఘం కన్వీనర్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా నుంచి విచ్చేసిన రైతులు, రైతు సంఘాల నేతలు, న్యాయవాదులు, వైద్యుల నుంచి మంత్రులు లిఖితపూర్వకంగా అభిప్రాయాలను సేకరించారు. సాగు చేసే ప్రతి రైతుకు సర్వే నంబరు ఆధారంగా రైతుభరోసా ఇవ్వాలని, 10 ఎకరాల పరిమితి పెట్టి రైతులందరికీ అమలు చేయాలని రైతులు సూచించారు. కౌలు రైతులకూ రైతుభరోసా ఇవ్వాలని, పట్టా రైతుకు దక్కే రూ.10వేలలో కౌలు రైతుకు సగం మొత్తం.. అంటే రూ.5వేలు ఇవ్వాలని సూచనలు చేశారు. విధివిధానాల రూపకల్పనలో తెల్ల రేషన్ కార్డు లేనివారికి, ఐటీ రిటర్న్స్ దాఖలు చేసిన వారికి పెట్టుబడి సాయం ఇవ్వబోమనే నిబంధన పెట్టొద్దని విజ్ఞప్తి చేశారు. తమ పిల్లల చదువుల కోసం బ్యాంకు రుణాలు పొందేందుకు ఐటీ రిటర్న్స్ దాఖలు చేశామని, అందువల్ల ఐటీ రిటర్న్స్ దాఖలు చేసినవారికి కూడా పథకం అమలు చేయాలని సూచించారు. ఏజెన్సీలో భూమి పట్టాలు ఒకరి పేరుపై ఉంటే, సాగులో మరొకరు ఉన్నారని మంత్రుల దృష్టికి తెచ్చారు. ఎప్పుడో పట్టాలు పొంది అమ్ముకున్నవారికే రైతుబంధు, రైతు బీమా, బ్యాంకు రుణాలు, రుణమాఫీ సదుపాయాలు అందుతున్నాయని.. ఏళ్లుగా సాగులో ఉండి పట్టాలు లేకపోవడంతో తమకు పథకాలు దక్కడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఏజెన్సీలో గిరిజనేతర రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. కొందరు వ్యవసాయ ఉత్పత్తులు కాకుండా జామాయిల్, సుబాబుల్ వంటి తోటలు వేస్తున్నారని అలాంటి రైతులకు రైతుభరోసా మినహాయించాలని సూచించారు. కొందరు కౌలు రైతులు మాట్లాడుతూ.. రైతుభరోసా కూడా తమకు అక్కరలేదని, అయితే కౌలురేట్లు తగ్గించేలా భూ యజమానులను ప్రభుత్వం ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. కొందరు రైతులు భూములు అమ్ముకున్నా ఇంకా పాసుపుస్తకాల్లో పేర్లు మారడం లేదని, దీంతో ఒకే సర్వేనంబరులో ఒకే భూమికి ఇద్దరు రైతులు రైతుబంధు అందుకుంటున్నారని చెప్పారు.

అసెంబ్లీలో చర్చించాకే విధివిధానాలు: భట్టి

రాష్ట్ర వనరులు, సంపదను ధర్మబద్ధంగా ప్రజలకు పంచడమే ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాప్రభుత్వ లక్ష్యమని భట్టివిక్రమార్క పేర్కొన్నారు.. రైతుభరోసా కింద రైతులకు అందించే సాగు సాయం ఎలా అందించాలన్న విషయమ్మీద రైతులనుంచి సలహాలు, సూచనలు తీసుకోవడమే ఈ వర్క్‌షాప్ లక్ష్యమన్నారు. అన్ని జిల్లాలో పర్యటించి రైతుల నుంచి వచ్చిన సలహాలు సూచనలపై అసెంబ్లీలో చర్చిస్తామని చెప్పారు. ఆ తర్వాతనే విధివిధానాలు రూపొందిస్తామని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లోగా అభిప్రాయ సేకరణ పూర్తిచేస్తామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం రైతుభరోసాపై ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు.

సాగు చేసే వారికే సాయం: తుమ్మల

సాగు చేసే నిజమైన రైతులకే రైతుభరోసా అందించడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గతంలో రైతుబంధు పేరుతో సాగులో లేకపోయినా పాసుపుస్తకాల్లో ఉన్న అన్ని రకాల భూములకు రైతుబంధు అందించారని గుర్తు చేశారు.

రైతులను ఆదుకుంటాం: పొంగులేటి

రైతుభరోసా చెల్లింపుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సాగు చేసే రైతులను తమ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు.

'రైతుభరోసా' 10ఎకరాలకే పరిమితం చేయాలి

» ఆదాయపన్ను చెల్లించేవారికి ఇవ్వకపోతేనే మంచిది
» కృష్ణాజలాల్లో మనకే ఎక్కువ వాటా ఇవ్వాలి
» పార్టీ మారిన ఎమ్మెల్సీల వ్యవహారంపై గత రికార్డులు, కోర్టుల తీర్పులకు అనుగుణంగా నిర్ణయం: మండలి చైర్మన్



నల్లగొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రైతు భరోసా పథకాన్ని పది ఎకరాల లోపు రైతులకే పరిమితం చేయాలనే ఆలోచన మంచిదేనని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. రైతు భరోసా అమలుపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించడం మంచి పరిణామం అని పేర్కొన్నారు. రైతు భరోసా, రుణమాఫీ పథకాలను అర్హులకు అందించాలని, ఆదాయం పన్ను క్రమం తప్పకుండా చెల్లించేవారికి అవసరం లేదన్నారు. భూ సేకరణలో పరిహారం పొందినా, పట్టాలున్న వారికి, గుట్టలలో సేద్యం లేని భూములకు రైతు భరోసా ఇవ్వకపోవడమే మంచి ఆలోచన అన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకే ఎక్కువ వాటా ఇవ్వాలని, ఇందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు, కేంద్రమూ సహకరించాలన్నారు. తెలుగు రాష్ట్రాల సీఎంలు పంతాలకు పోకుండా వ్యవహరిస్తే, పునర్విభజన సమస్యలు 90% పరిష్కారమవుతాయని అభిప్రాయపడ్డారు. పదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న విభజన సమస్యలు తొలగించుకునేందుకు ఇద్దరు సీఎంలు సమావేశం కావడం హర్షణీయమన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్సీల వ్యవహారంపై ఆయన స్పందిస్తూ.. గతంలో ఇలాంటి సందర్భాల్లో తీసుకున్న నిర్ణయాలు, మండలిలో ఉన్న రికార్డులు, కోర్టుల తీర్పులకనుగుణంగా నిర్ణయం ఉంటుందని చెప్పారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న జంగా రాఘువరెడ్డి, పక్కన మంత్రులు ఉత్తమ్, పొన్నం

జోరుగా చైర్మన్ల బాధ్యతల స్వీకరణ

నేడు టీజీఐఐసీ చైర్మన్‌గా నిర్మలా జగ్గారెడ్డి బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, బర్కత్‌పుర, చిక్కడపల్లి, కొడంగల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లు, సంస్థలకు చైర్మన్లుగా నియమితులైన వారి బాధ్యతల స్వీకరణ జోరుగా కొనసాగుతోంది. ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడిన రోజునే కొందరు బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో కనీస వేతన మండలి(మినిమమ్ వేజ్ బోర్డు) చైర్మన్‌గా జనక్ ప్రసాద్, తెలంగాణ రాష్ట్ర పోలీసు గృహ నిర్మాణ సంస్థ చైర్మన్‌గా ఆర్.గురునాథ్ రెడ్డి, ట్రైకార్ చైర్మన్‌గా బెల్లయ్యనాయక్, దివ్యాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ముత్తినేని వీరయ్య, ఆయిల్ సీడ్ గ్రోయర్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా జంగా రాఘవరెడ్డి, తెలంగాణ ఆగ్రోస్ చైర్మన్‌గా కాసుల బాలరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్ తదితరులు ఆయా కార్యాలయాలకు వెళ్లి నూతన చైర్మన్లను అభినందించారు. ఇక, టీజీఐఐసీ చైర్మన్‌గా నియమితులైన నిర్మ లా జగ్గారెడ్డి, బీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా నూతి శ్రీకాంత్‌గౌడ్, తెలంగాణ కోపరేటివ్ యూనియన్ చైర్మన్‌గా మనాల మోహన్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

సచివాలయంలో 6వ అంతస్తును పరిశీలించిన సీఎం

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలోని ఆరో అంతస్తును సీఎం రేవంత్ రెడ్డి బుధవారం పరిశీలించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి జాతీయ రహదారుల అంశంపై సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన సాయంత్రం 5 గంటల సమయంలో ఒక్కసారిగా ఆరో అంతస్తుకు వెళ్లి కలియతిరిగారు. ఆయన చాంబర్ నుంచి మొదలుకుని ప్రధాన కార్యదర్శి చాంబర్ వైపు ఉన్న సమావేశ గదితోపాటు మరో రెండు సమావేశపు గదులను కూడా పరిశీలించారు. ఆ తర్వాత సీఎంను కలిసేందుకు వచ్చిన వారు వేచి ఉండేందుకు వినియోగిస్తున్న వెయిటింగ్ హాల్‌ను కూడా చూశారు. ఈ సందర్భంగా ఆరో అంతస్తులోని భారీ గదులను ఏయే అవసరాలకు వినియోగిస్తున్నారన్న విషయాలను ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఆదాయపన్ను చెల్లిస్తే 'మాఫీ' ఉండదు!

(మొదటిపేజీ తరువాయి)

వచ్చాయని, ఆ జాబితాను ప్రభుత్వం ముందు వ్యవసాయశాఖ ఉంచినట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం- కిసాన్ పథకంలో కూడా ఐటీ చెల్లింపుదారులను, రాజకీయ నాయకులను మినహాయించారు. ఈ క్రమంలో అధిక ఆదాయం ఉండి.. పన్ను చెల్లించేవారికి రుణమాఫీ వర్తింపజేయాల్సిన అవసరంలేదని సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది. అయితే పిల్లల చదువుల కోసం, ఇంటి నిర్మాణం కోసం రుణాలు తీసుకుంటున్న కొందరు రైతులు కూడా ఐటీ రిటర్నులు దాఖలుచేస్తున్నారు. ఇలాంటివారికి రుణమాఫీ వర్తింపజేయాలని భావిస్తున్నట్లు సమాచారం. రాజకీయ నాయకులు, వివిధ పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధులను కూడా రుణమాఫీ పథకం నుంచి మినహాయించే అవకాశాలున్నాయి. పీఎం-కిసాన్ పథకంలో కూడా ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జడ్పీ చైర్మన్లు, మునిసిపల్ చైర్మన్లు... తదితర ప్రజాప్రతినిధులకు పెట్టుబడి సాయాన్ని కేంద్ర ప్రభుత్వం ఇవ్వటంలేదు. అవే మార్గదర్శకాలను రుణమాఫీ పథకానికి వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వ భావిస్తున్నట్లు తెలిసింది. ఇక ప్రభుత్వ ఉద్యోగుల విషయానికి వచ్చేసరికి.. ఎక్కువ జీతం తీసుకునేవారికి రుణమాఫీ వర్తింపజేసే ఉద్దేశం లేదని, అయితే తక్కువ జీతం తీసుకునే చిరు ఉద్యోగులు రైతుల జాబితాలో ఉంటే.. వారి వరకు రుణమాఫీ చేద్దామనే ఉద్దేశంతో ఉన్నట్లు సమాచారం. గత ప్రభుత్వాలు రుణమాఫీ పథకం అమలుచేసిన సందర్భంలో ఈ నిబంధన లేదు. నిర్ణీత గడువు, కటాఫ్ అమౌంట్ పెట్టుకొని రుణమాఫీ చేశారు. దాంతో కొందరు బడా బాబులు, భూస్వాములకు కూడా రుణమాఫీ పథకం వర్తించింది. అలాంటివారికి ఇప్పుడు రుణమాఫీ వర్తింపజేస్తే... ప్రజాధనం దుర్వినియోగం చేసినట్లే అవుతుందని, చిన్న, సన్నకారు రైతులు, అర్హులకు రుణమాఫీ చేస్తే నిధులు సద్వినియోగం చేసినట్లు అవుతుందనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. కాగా రుణమాఫీ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను రెండు రోజుల్లో విడుదలచేస్తామని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తాజాగా ప్రకటించారు. దీంతో రుణమాఫీ మార్గదర్శకాలపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ అమలుకు ఆగస్టు-15 డెడ్‌లైన్‌గా పెట్టుకున్న విషయం విదితమే! ఈ రెండు, మూడు రోజుల్లో మార్గదర్శకాలతో కూడా జీవో విడుదలైతే.. పథకాన్ని అమలుచేయటానికి ఇంకా నెల రోజులు మాత్రమే ఉంటుంది. రుణమాఫీకి రూ. 31 వేల కోట్లు అవసరమవుతాయనే అంచనా ఉండగా... రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కొన్ని నిధులు సమకూర్చింది. మరో రెండు, మూడు వారాల్లో రుణమాఫీకి సరిపడా నిధులు సమకూర్చుకొని రుణమాఫీ ప్రక్రియను పూర్తిచేయాలని భావిస్తోంది. మరోవైపు 'నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్(ఎన్ఐసీ)లో.. బ్యాంకర్లు, పీఏసీఎస్‌ల నుంచి వచ్చిన రైతులు, రైతుకుటుంబాలు, అప్పుల జాబితాను జల్లెడ పడుతున్నారు. రేషన్‌కార్డు, సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా రైతు కుటుంబాలను డిసైడ్ చేస్తున్నారు. ఆధార్ కార్డుల ఆధారంగా నంబర్లను సరిపోలుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు కుటుంబానికి రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేయాలనే లక్ష్యంతో ఉన్న నేపథ్యంలో ఈ కసరత్తు జరుగుతోంది. ప్రభుత్వం మార్గదర్శకాలపై కసరత్తు పూర్తిచేసేలోపు... ఎన్ఐసీలో డేటా ప్రాసెసింగ్ ప్రక్రియను పూర్తిచేయనున్నారు.

మా క్యాంపస్‌కు రండి.. సమస్యలు పరిష్కరించండి

» ముఖ్యమంత్రికి బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల విజ్ఞప్తి

బాసర, జూలై 10: బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో నెలకొన్న పలు సమస్యలను విద్యార్థులు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు సీఎంను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థి అసోసియేషన్ కమిటీ సభ్యులు మంగళవారం రాత్రి స్వయంగా కలిశారు. తమ క్యాంపస్‌ను సందర్శించి, ట్రిపుల్‌ఐటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తమ విజ్ఞప్తికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని, త్వరలోనే బాసర ట్రిపుల్‌ఐటీని సందర్శిస్తానని చెప్పారని విద్యార్థులు తెలిపారు. కాగా, బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు రెండేళ్ల క్రితం పది రోజుల పాటు వివిధ సమస్యలపై పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాడు విద్యార్థులకు మద్దతు పలికారు. పోలీసు వలయాలను దాటుకొని వర్సిటీ గోడ దూకి లోపలికి వెళ్లి మరీ విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. నాటి సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని విద్యార్థులు ముఖ్యమంత్రికి మంగళవారం వివరించారు. రెగ్యులర్ వైస్ చాన్సలర్ నియామకం, 150 అధ్యాపక పోస్టులు భర్తీ, హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పన తదితర 19 సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వర్సిటీలో సమస్యలపై అవసరమైతే తన వ్యక్తిగత సలహాదారు జైపాల్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడాలని ముఖ్యమంత్రి తమకు చెప్పారని విద్యార్థులు వెల్లడించారు.



పద్మశ్రీ అవార్డు గ్రహీతలతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క

పద్మశ్రీ అవార్డు గ్రహీతలకు సీఎం సన్మానం

» ఒక్కొక్కరికి రూ. 25లక్షల చెక్కు అందజేత

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గడ్డం సమ్మయ్య, దాసరి కొండప్ప, వేలు ఆనందాచారి, కూరేళ్ల విఠలాచార్య, కేతావత్ సోంలాల్‌ను సన్మానించారు. ఒక్కొక్కరికీ రూ. 25లక్షల చెక్కును అందజేశారు. అనంతరం వారితో సీఎం కాసేపు ముచ్చటించారు. తమను సన్మానించి, చెక్కులు అందజేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌కు పద్మశ్రీ అవార్డు గ్రహీతలు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఆయా రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి ఇటీవల కేంద్రం పద్మశ్రీ అవార్డులు అందించిన విషయం తెలిసిందే.

క్రెడాయ్ ఈవెంట్‌కు రండి..

సీఎంకు క్రెడాయ్ ప్రతినిధుల ఆహ్వానం

రేవంత్‌తో అంతర్జాతీయ స్పిరిట్స్ అసోసియేషన్ ప్రతినిధుల భేటీ



హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆగస్టులో జరగనున్న క్రెడాయ్ రాష్ట్ర స్థాయి సదస్సు స్టాకన్-2024 కార్యక్రమానికి హాజరు కావాలని సీఎం రేవంత్‌రెడ్డికి క్రెడాయ్ ప్రతినిధులు ఆహ్వానం అందించారు. బుధవారం సచివాలయంలో క్రెడాయ్ తెలంగాణ చైర్మన్ మురళీ కృష్ణా రెడ్డి, అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఇంద్రసేనా రెడ్డి, కార్యదర్శి అజయ్, కోశాధికారి జగన్మోహన్ సీఎంను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమంలో దాదాపు 900 మందికిపైగా డెవలపర్లు పాల్గొననున్నారని తెలిపారు. అనంతరం అంతర్జాతీయ స్పిరిట్స్, వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. సచివాలయంలో ఆయనతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులు, ఇతర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతికుమారి పాల్గొన్నారు.

చిన్నారులు చనిపోతుంటే నిర్లక్ష్యమా?

(మొదటిపేజీ తరువాయి)

అంబర్‌పేట్‌లో ప్రదీప్(4), తాజాగా జూన్ 28న పటాన్‌చెరులో బిహార్ వలస కూలీల కుటుంబానికి చెందిన విశాల్(6) వీధి కుక్కల దాడిలో చనిపోయిన ఘటనలపై వచ్చిన కథనాలను హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. అలాగే వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదని.. వ్యాక్సినేషన్, ఆహారం లేక అవి మనుషులపై దాడులు చేస్తున్నాయని పేర్కొంటూ మరో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. వీటన్నింటిపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. స్టెరిలైజేషన్ కార్యక్రమం కొనసాగిస్తున్నామని, కుక్కల నియంత్రణకు కొత్త మార్గదర్శకాలు రూపొందించామని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు తెలిపారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసేందుకు మరింత గడువు ఇవ్వాలని కోరగా.. ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి ఘటనలు చాలా బాధాకరమని, పరిస్థితి విషమంగా ఉందని.. తక్షణమే చర్యలు తీసుకోవాలని వ్యాఖ్యానించింది. పిల్లలు చనిపోతుంటే నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని ఎట్టిపరిస్థితుల్లో సహించబోమని.. వారం రోజుల్లో నిపుణుల కమిటీ వేస్తారా? మమ్మల్ని వేయమంటారా? అని ప్రశ్నించింది. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది.

త్వరలోనే 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఖాళీగా ఉన్న 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నేడో, రేపో మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ జారీ చేయనుంది. కొత్తగా ఏర్పాటు చేయబోతున్న 8 వైద్య కళాశాలలకే 200 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు అవసరం. దీంతో ఆ వైద్య కళాశాలల్లోని ఖాళీల భర్తీపైనా సర్కారు దృష్టి సారించింది. విద్యా సంవత్సరం మొదలయ్యేలోగా అన్ని ఖాళీలను భర్తీ చేయాలని ఆరోగ్యశాఖను ఆదేశించింది. ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని 607 ఖాళీల భర్తీకి అనుమతి ఇచ్చింది. ఈ పోస్టులన్నిటిని వైద్య, ఆరోగ్య సర్వీసుల రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా భర్తీ చేయనున్నారు. కాగా, ప్రజారోగ్య సంచాలకుల పరిధిలోని ఆస్పత్రుల్లో 435 ఎంబీబీఎస్(సివిల్ అసిస్టెంట్ సర్జన్) పోస్టుల భర్తీకి ఇటీవల మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆ నోటిఫికేషన్‌కు బుధవారం ఉదయం వరకు 2400 దరఖాస్తులొచ్చినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. గురువారం సాయంత్రానికి దరఖాస్తుల గడువు ముగియనుంది. చివరి రోజు మరో వెయ్యి దరఖాస్తుల వరకూ వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రభుత్వ భూముల తాకట్టుకు సర్కారు యత్నం

» బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక రంగాన్ని సక్రమంగా నడపడం చేతగాని రేవంత్ సర్కారు నిధుల సమీకరణకు ప్రమాదకర మార్గం ఎంచుకుందని, ప్రభుత్వ భూములను ప్రైవేటు ఫైనాన్స్‌లకు తనఖా పెట్టే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. పరిశ్రమలకు ఇవ్వాల్సిన భూములను రాజకీయ ప్రయోజనాల కోసం తాకట్టుపెడితే.. కంపెనీలకు ఏమిస్తారు? కొత్తగా యువతకు ఉద్యోగాలు ఎట్లా వస్తాయి? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మతిలేని చర్య వల్ల తెలంగాణ ప్రగతి శాశ్వతంగా కుంటుపడే పరిస్థితి నెలకొందని బుధవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తెలంగాణ పరిశ్రమల శాఖకు చెందిన రూ.20వేలకోట్ల విలువైన 400ఎకరాలను ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలకు తనఖాపెట్టి రూ.10వేల కోట్లు సమీకరించాలని భావిస్తున్నట్లు తెలుస్తోందన్నారు. దీనికి మధ్యవర్తిగా ఒక మర్చంట్ బ్యాంకర్‌ను పెట్టి వారికి రు.100 కోట్ల కమీషన్ ఇచ్చేందుకు సిద్ధమైనట్లు చెప్పారు. కోకాపేట, రాయదుర్గం వంటి ప్రాంతాల్లో ఐటీ పరిశ్రమలు వస్తున్నాయని, అక్కడ 400ఎకరాలు ప్రైవేట్ సంస్థలకు తనఖా పెట్టడం అనాలోచిత చర్య అని పేర్కొన్నారు.

డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలంటూ ఆందోళన

» ఓయూలోపలువురి అరెస్టు..ఖండించిన కేటీఆర్, హరీశ్

తార్నాక/హైదరాబాద్, జూలై 10(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు బుధవారం కూడా ఓయూలో ఆందోళన కొనసాగించారు. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించిన బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు పిడిగుద్దులు గుద్దుతూ అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించారు. ఓ న్యూస్ చానల్ విలేకరిపై కూడా దురుసుగా ప్రవర్తిస్తూ అరెస్టు చేశారు. దీంతో పలు విద్యార్థి సంఘాల నాయకులు, మీడియా ప్రతినిధులు ఓయూ పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయించారు. దురుసుగా ప్రవర్తించిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యలపై స్పందించకపోవడాన్ని నిరసిస్తూ కోదండరాం ఇంటి ముట్టడికి పిలుపునిచ్చిన తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్(టీఎస్పీ) నాయకులను పోలీసులు ఓయూలో ముందస్తుగా అరెస్టు చేశారు. కాగా, ప్రజా పాలనలో జర్నలిస్టులకు రక్షణ లేదా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో ప్రశ్నించారు. పోలీసుల తీరు స్వేచ్ఛను కాలరాయడమేనని మాజీ మంత్రి హరీశ్‌రావు 'ఎక్స్'లో విమర్శించారు. కోచింగ్ సెంటర్ల లాభాల కోసమే డీఎస్సీ రద్దుకు డిమాండ్ చేస్తున్నారంటూ నిరుద్యోగులను అవమానించేలా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారని మాజీ ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్‌కుమార్ ఆరోపించారు. గత, ప్రస్తుత పాలకులు విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ విమర్శించారు.

సంస్మరణ వారోత్సవాలు నిర్వహించండి

» లేఖ విడుదల చేసిన మావోయిస్టు పార్టీ

చర్ల, జూలై 10: ఆపరేషన్ కగార్‌లో ఈ ఏడాది మొత్తం 106 మంది సహచరులను కోల్పోయామని మావోయిస్టు పార్టీ పేర్కొంది. అమరవీరుల చరిత్రను ప్రజలకు తెలిపేందుకు సంస్మరణ వారోత్సవాలను నిర్వహించాలని కోరింది. ఈ మేరకు గురువారం మావోయిస్టు పార్టీ దక్షిణ విభాగ బ్యూరో ప్రతినిధి సమత పేరుతో లేఖ విడుదలైంది. బస్తర్ డివిజన్‌లోని 7 జిల్లాల్లో నిర్వహించిన ఆపరేషన్ కగార్‌లో మావోయిస్టు పార్టీ ముఖ్య నాయకులు అమరులయ్యారని తెలిపారు. అమరులైన వారి చరిత్రలను ప్రజలకు తెలియజేయాలని, ఇందుకోసం జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ కగార్‌ను అడ్డుకునేందుకు ప్రజాయుద్ధాన్ని మరింత విస్తృతం చేస్తామన్నారు. ఈ ఏడాది మరణించిన మావోయిస్టు ముఖ్య నాయకుల వివరాలు, వారోత్సవాలను ఎలా నిర్వహించాలో సమత లేఖలో పేర్కొన్నారు.

ఎంజీఎంలో నిలిచిన టూడీ ఎకో పరీక్షలు

» తీవ్ర ఇబ్బందులు పడ్డ హృద్రోగులు

వరంగల్ మెడికల్, జూలై 10: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలోని కార్డియాలజీ విభాగంలోని టూడీ ఎకో పరీక్షలు నిలిచిపోవడంతో హృద్రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోగుల బంధువులు తీవ్రంగా ఆగ్రహించారు. ఆస్పత్రి అధికారుల అలసత్వాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. డాక్టర్లతో వాగ్వాదానికి దిగారు. ఫలితంగా ఎంజీఎం ఆస్పత్రిలో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా అంతటికి పెద్దాస్పత్రి అయిన ఎంజీఎంలో కార్డియాలజీ విభాగం పరిస్థితి అత్యంత అధ్వాన్నంగా ఉంది. ఈ విభాగంలో ఇద్దరే కార్డియాలజిస్టులు ఉన్నారు. గుండె పరీక్షలు చేసే వైద్య పరికరాలు కూడా చాలినన్ని లేవు. గుండె పనితీరును గుర్తించడంలో కీలకంగా పని చేసే టూడీ ఎకో పరికరాలు రెండే ఉన్నాయి. ఎంజీఎంకు రోజు 100 నుంచి 150 మంది హృద్రోగులు గుండె పరీక్షలు చేయించుకునేందుకు వస్తుంటారు. బుధవారం కూడా రోగులు పెద్ద సంఖ్యలో వచ్చారు. కానీ కార్డియాలజీ డాక్టర్లే లేరు. దీంతో టూడీ ఎకో పరీక్షలు చేసేవారే లేకుండాపోయారు. రోగులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పరీక్షల కోసం వార్డులో పడిగాపులు కాశారు. డాక్టర్ల జాడ లేకపోవడంతో ఆస్పత్రి అధికారులు టూడీ ఎకో పరీక్షలకు కోసం రోగులను కాకతీయ వైద్య కళాశాల ఆవరణలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి పంపించారు. అప్పటికే అక్కడ కార్డియాలజీ విభాగంలో టూడీ పరీక్షల కోసం రోగులు పెద్ద సంఖ్యలో వేచి ఉన్నారు. ఎంజీఎం నుంచి కూడా రోగులు రావడంతో వార్డులో రద్దీ పెరిగింది. సూపర్‌స్పెషాలిటీలోని డాక్టర్లు ఒకింత అసహనం వ్యక్తం చేస్తూ.. రోగులకు పరీక్షలు చేయడానికి నిరాకరించారు. దీంతో అక్కడా డాక్టర్లకు, రోగుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. చివరికి చేసేది లేక రోగులు టూడీ ఎకో పరీక్షలు చేయించుకోకుండానే నిరాశతో వెనుదిరిగి వెళ్లాల్సి వచ్చింది. రెండు రోజుల కిందటే వరంగల్ కలెక్టర్ ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించి ఆస్పత్రి పరిస్థితిపై ఆయా విభాగాల అధిపతులతో సమీక్షించారు. ఎంజీఎంలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అయినా పరిస్థితి ఎలాంటి మార్పు లేదని రోగులు మొత్తుకుంటున్నారు.

ఆల్మట్టికి 84 వేల క్యూసెక్కుల వరద

రెండ్రోజుల్లో దిగువకు నీటిని వదిలే చాన్స్

తుంగభద్రకు 27 వేల క్యూసెక్కులు..

మేడిగడ్డకు 41 వేల క్యూసెక్కుల ప్రవాహాలు

హైదరాబాద్/గద్వాల/మహదేవపూర్‌రూరల్/బయ్యారం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గోదావరి బేసిన్‌లో ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులకు వరద కొనసాగుతోంది. బుధవారం కృష్ణా బేసిన్‌లో ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు 84 వేల క్యూసెక్కుల వరద వచ్చింది. జలాశయం పూర్తి నీటినిల్వ సామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా... 81.44 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఈ జలాశయం నిండితే తెలంగాణ కీలక ప్రాజెక్టులకు నీరు విడుదల కానుంది. రెండ్రోజుల్లో ఆల్మట్టి నుంచి నీటిని విడుదల చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక తుంగభద్ర ప్రాజెక్టుకు 27,544 క్యూసెక్కుల వరద వచ్చింది. తుంగభద్ర నీటి నిల్వ సామర్థ్యం 100.86 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 25.17 టీఎంసీల నిల్వ ఉంది. శ్రీశైలం ప్రాజెక్టుకు 2,256 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. గోదావరి బేసిన్‌లోని మేడిగడ్డ బ్యారేజీకి 41 వేల క్యూసెక్కులు, తుపాకులగూడెం(సమ్మక్కసాగర్) బ్యారేజీకి 64 వేల క్యూసెక్కులు, దుమ్ముగూడెం(సీతమ్మసాగర్)కు 66 వేల క్యూసెక్కులు, అన్నారం బ్యారేజీకి 650 క్యూసెక్కులు, సుందిళ్లకు 956 క్యూసెక్కుల వరద రాగా.. వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు వదిలిపెడుతున్నారు. శ్రీపాద ఎల్లంపల్లికి 396 క్యూసెక్కులు, కడెం 464 క్యూసెక్కులు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 1,852 క్యూసెక్కులు, సింగూరులకు 300 క్యూసెక్కుల వరద రికార్డయింది.



ఇటీవలి వర్షాలతో మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారం పెద్ద చెరువు జలకళను సంతరించుకుంది. చెరువు పూర్తి సామర్థ్యం 16.03 అడుగులు కాగా, బుధవారం సాయంత్రం నాటికి 15 అడుగులకు నీరు చేరింది.

ఔషధాల కొనుగోలులో ఇష్టారాజ్యం!

1.31కోట్ల టీకాగ్రేలార్ మాత్రలకు ఇండెంట్.. గత మార్చి 21న పర్చేస్ ఆర్డర్ జారీ

» రూ.4.71కోట్ల వ్యయంతో 32.76 లక్షల మాత్రల కొనుగోలు
» రూ.9కు దొరికే ఔషధానికి రూ14.39 వెచ్చించిన టీఎస్ఎంఎస్ఐడీసీ
» 'యూనివర్సల్'లోకి స్పెషాలిటీ ఔషధం
» 1.46 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం
» ఐరన్ ఇంజక్షన్లతో 5.89 కోట్ల భారం



హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో కొందరు అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవైపు సర్కారీ దవాఖానాల్లో అత్యవసర, ప్రాణాపాయ మందులు సరిపడా లేని పరిస్థితి ఉంటే.. అన్ని ఆస్పత్రుల్లో వినియోగించని ఓ ఔషధాన్ని భారీ స్థాయిలో కొనుగోలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ మొత్తం వ్యవహారం వెనుక పెద్ద మొత్తంలో డబ్బు చేతులు మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని బోధన ఆస్పత్రులు, జిల్లా-ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీలకు వేర్వేరుగా విభాగాధిపతులు ఉంటారు. ఈ ముగ్గురిలో ఓ విభాగాధిపతి 1.31 కోట్ల టీకాగ్రేలార్ మాత్రలు కావాలని గత మార్చిలో టీఎస్ఎంఎస్ఐడీసీకి ఇండెంట్ పెట్టారు. దీన్ని చూసి అప్పుడు టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీగా ఉన్న కర్ణన్ ఆశ్చర్యపోయారు. అసలు ఆ ఔషధాన్ని అన్ని ఆస్పత్రుల్లో వినియోగించరు. అలాంటి డ్రగ్‌కు భారీగా ఇండెంట్ పెట్టడంపై అనుమానంతో కేవలం 25శాతం కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు మార్చి 21న పర్చేజ్ ఆర్డర్ నంబరు 10282400404 (2392/2కె2304/212/878) ద్వారా సిగ్నేచర్ ఫైటో కెమికల్ ఇండ్రస్ట్రీస్ నుంచి టీకాగ్రేలార్ 90 ఎంజీ మాత్రలను కొన్నారు. 32,76,600 మాత్రలకు రూ.14.39 చొప్పున రూ.4,71,56,827 వెచ్చించారు. వాస్తవానికి టీకాగ్రేలార్ అనేది స్పెషాలిటీ డ్రగ్. రక్తాన్ని పలుచన చేసేందుకు వినియోగిస్తారు. మందు పూసిన స్టంట్ వేయించుకున్న రోగులకు దీన్ని కార్డియాలజిస్టులు సిఫారసు చేస్తారు. అత్యవసరం కాని ఈ ఔషధాన్ని సదరు విభాగాధిపతి యూనివర్సల్ జాబితాలో చేర్చి మరీ.. భారీగా ఇండెంట్ పెట్టారు. తమిళనాడు మెడికల్ కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో ఈ డ్రగ్ స్పెషాలిటీ జాబితాలోనే ఉంది. ఇదే ఔషధాన్ని ఆ రాష్ట్ర వైద్యశాఖ యూనిక్యూర్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ నుంచి రూ.9కే కొనుగోలు చేసింది. మన దగ్గర దాన్ని రూ.14.39 పెట్టి కొన్నారు. అంటే ఒక్కో మాత్రకు అదనంగా రూ.5 చెల్లించారు. దీంతో రూ.1.46 కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇందులో సదరు విభాగాధిపతితో పాటు వైద్య ఆరోగ్యశాఖకే చెందిన మరి కొందరు పెద్దలు, టీఎస్ఎంఎస్ఐడీసీలోని కొందరు ఉద్యోగులు కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. ఆ ఇండెంట్ పెట్టించేందుకు పెద్దఎత్తున డబ్బులు చేతులు మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీఎస్ఎంఎస్ఐడీసీ నుంచి వెళ్లిపోయిన రెగ్యులర్ ఉద్యోగుల హస్తం కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఐరన్ ఇంజక్షన్ల కొనుగోలులోనూ ఇంతే...

ఇదొక్కటే కాదు.. ఫెర్రిక్ కార్బాక్సిమాల్టోస్ ఇంజక్షన్లను సైతం భారీ ధరకు కొనుగోలు చేశారు. రక్తహీనతతో బాధపడే గర్భిణులకు ఈ ఇంజక్షన్లు వాడతారు. కాగా, ఈ ఇంజక్షన్లకు సంబంధించిన పేటెంట్ ముగిసి.. జనరిక్ డ్రగ్‌గా ఇప్పటికే మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చింది. పేటెంట్ ఉన్న సమయంలో ఈ ఇంజక్షన్ ఒక్కోటి రూ.1485 పెట్టి టీఎస్ఎంఎస్ఐడీసీ కొనుగోలు చేసింది. ప్రస్తుతం ఇది జనరిక్ డ్రగ్‌గా మారడంతో మార్కెట్లో కేవలం రూ.178కే లభిస్తోంది. సరిగ్గా ఇదే ధరకు మధ్యప్రదేశ్ మెడికల్ కార్పొరేషన్ కొనుగోలు చేసింది. కానీ, పేటెంట్ సమయం ముగుస్తుందనగా టీఎస్ఎంఎస్ఐడీసీ అధికారులు హడావుడిగా 46వేల ఇంజక్షన్లను రూ.1,485 చొప్పున ఎంక్యూర్ ఫార్మాసూటికల్స్ లిమిటెడ్ నుంచి కొనుగోలు చేశారు. వైద్య ఆరోగ్యశాఖ వద్ద 50వేల ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నప్పటికీ వీటిని కొన్నారు. కొన్ని రోజులు ఆగి ఉంటే కేవలం రూ.92లక్షలకు వచ్చే 46వేల ఇంజక్షన్లకు ఏకంగా రూ.6.81కోట్లు ఖర్చు చేశారు. ఈ నెల 3వ తేదీనే ఇందుకు సంబంధించిన పర్చేజ్ ఆర్డర్ నంబరు 10282401042 (4282/2కె24-క్యూ1/ఎంహెచ్ఎన్-ఎఎంబీ/1)ను జారీ చేశారు. దీంతో అదనంగా రూ.5.89కోట్లు సర్కారుపై భారం పడింది. అత్యవసరం కాని ఈ ఔషధాన్ని కూడా పెద్ద తలకాయల ఒత్తిడితో టీఎస్ఎంఎస్ఐడీసీ కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని వైద్య వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

బ్యారేజీలు, పంప్‌హౌజ్‌ల నిర్మాణంలో జరిగిందేంటి?

» ఏఈ, ఏఈఈలను విచారించిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్
» నేడు పంప్‌హౌజ్‌ల నిర్మాణ సంస్థ ముఖ్యులకు పిలుపు.. విచారణ

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో బ్యారేజీలు, పంప్‌హౌజ్‌ల నిర్మాణం జరిగిన తీరుపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ బుధవారం విచారణ జరిపింది. వాటి నిర్మాణ సమయంలో విధులు నిర్వర్తించిన 40 మంది దాకా అసిస్టెంట్ ఇంజనీర్లు(ఏఈ), అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు(ఏఈఈ)లను ప్రశ్నించింది. ఆ బ్యారేజీలు, పంప్‌హౌజ్‌లు ఎలా కట్టారు? డిజైన్ల ప్రకారమే వాటి నిర్మాణం జరిగిందా? వంటి అంశాలపై ఆరా తీసింది. ఒక్కో బ్యారేజీలో పనిచేసిన వారిని ఒక్కో గ్రూపు చొప్పున.. మొత్తం బ్యారేజీల ఇంజనీర్లను మూడు గ్రూపులుగా విభజించి, ప్రశ్నించింది. ఇదే తరహాలో మూడు పంప్‌హౌజ్‌ల ఇంజనీర్లను 3 గ్రూపులుగా విభజించి విచారించింది. వీరంతా కమిషన్ ముందు తెలిపిన అంశాల ఆధారంగా వివరాలను అఫిడవిట్ల రూపంలో 10 రోజుల్లో సమర్పించాలని ఆదేశించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో సాంకేతిక లోపాలు, అవకతవకతలపై విచారణకు జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. పంప్‌హౌజ్‌ల నిర్మాణంపై విచారణ నిర్వహించే పరిధి కమిషన్‌కు లేకున్నప్పటికీ.. వాటి నిర్మిత ప్రాంతం ఎంపిక, నిర్వహణతో బ్యారేజీలపై పడిన ప్రభావాలను గుర్తించాలని కమిషన్ నిర్ణయించి, పంప్‌హౌజ్ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో పాటు ఏఈ, ఏఈఈలను విచారించినట్లు సమాచారం. అలాగే.. కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి(మేడిగడ్డ), సిరిపురం(అన్నారం), గోలివాడ (సుందిళ్ల) పంప్‌హౌజ్‌లను నిర్మించిన సంస్థకు చెందిన ముఖ్యులను కమిషన్ గురువారం విచారించనుంది.

రేవంత్ రెడ్డి పాలనలో...
అనాథలా హైదరాబాద్

జీహెచ్ఎంసీ, జలమండలిలో నిధుల లేమి

సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

రేషన్ కార్డుల జారీకి చర్యలు చేపట్టాలి

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



రాంనగర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి పాలనలో హైదరాబాద్ అనాథలా మారిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి విమర్శించారు. జీహెచ్ఎంసీ, జలమండలిలో నిధులు లేక సమస్యలు రాజ్యమేలుతున్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ ఖజానాకు 80 శాతం నిధులు హైదరాబాద్ నుంచే వస్తున్నా సీఎం జీహెచ్ఎంసీకి నిధులు కేటాయించడం లేదని, ఇతర ప్రాంతాలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్ బడ్జెట్‌ను హైదరాబాద్ అభివృద్ధికే కేటాయించాలన్నారు. నిధులు లేక జీహెచ్ఎంసీ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయలేకపోతోందని, బస్తీలు, కాలనీలు అంధకారంలో ఉన్నాయన్నారు. బిల్లులు చెల్లించకపోవడం వల్ల కాంట్రాక్టర్లు అనేక పనులు మధ్యలోనే నిలిపివేశారన్నారు. బుధవారం కిషన్ రెడ్డి అంబర్‌పేట నియోజకవర్గంలో పర్యటించారు. పలు బస్తీలు, కాలనీల్లో తిరిగి ఓటేసి గెలిపించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డ్రైనేజీ, కలుషిత నీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రోడ్లు వంటి సమస్యలను పలువురు ఆయన దృష్టికి తీసుకురాగా.. వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం ఆయన రామకృష్ణ నగర్‌లో విలేకరులతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించి ఏడు నెలలు కావస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. పదేళ్ల పాటు పాలన సాగించిన కేసీఆర్ ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, దాంతో పేద ప్రజలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఉచిత బియ్యం, ఇతర ప్రభుత్వ పథకాలు పొందలేకపోయారని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే కొత్త రేషన్ కార్డులు ఇస్తామని చెప్పిన రేవంత్.. నేడు కేసీఆర్ బాటలోనే నడుస్తున్నారన్నారు. వెంటనే అర్హులందరికీ రేషన్‌కార్డులు జారీ చేయాలన్నారు.

రైల్వే ప్రాజెక్టుల ప్రగతిపై సమీక్ష

హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో చేపట్టిన పలు ప్రాజెక్టుల ప్రగతిని బుధవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమీక్షించారు. దిల్‌కుషా అతిథి గృహంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌తో సమావేశమై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రారంభించిన పలు రైల్వే ప్రాజెక్టులు, రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనుల పురోగతిని తెలుసుకున్నారు. సికింద్రాబాద్, తిరుపతి రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

లోక్‌సభ ఎన్నికల్లో సీట్లెందుకు తగ్గాయ్?

» నేటి నుంచి కురియన్ కమిటీ విశ్లేషణ
» పార్టీ నేతల నుంచి అభిప్రాయాల స్వీకరణ
» ఈనెల 14 వరకు రాష్ట్రంలోనే మకాం

హైదరాబాద్, జూలై 10(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో సీట్లు ఎందుకు తగ్గాయన్నదానిపై నిజనిర్ధారణ కోసం పార్టీ జాతీయ నేత కురియన్ నేతృత్వంలో ఏఐసీసీ నియమించిన త్రిసభ్య కమిటీ.. బుధవారంరాత్రి హైదరాబాద్‌కు చేరుకుంది. కమిటీ సభ్యులు కురియన్, రఖిబుల్ హుసేన్‌లకు పార్టీ నేత, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్‌లు శంషాబాద్ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. మరో సభ్యుడు పర్గత్‌సింగ్.. ఈ నెల 12న హైదరాబాద్‌కు రానున్నారు. ఈ నెల 14 వరకూ రాష్ట్రంలోనే మకాం వేయనున్న కురియన్ కమిటీ గురువారం గాంధీభవన్‌లో పార్టీ నేతలతో సమావేశం కానుంది. ముందుగా పార్టీ ఓటమిపాలైన లోక్‌సభ నియోజకవర్గాల అభ్యర్థులు, ఇన్‌చార్జులు, ఆయా నియోజకవర్గాల పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతల నుంచి అభిప్రాయాలు సేకరించనుంది. ఆ తర్వాత పార్టీ ఓటమిపాలైన నియోజకవర్గాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో నాయకుల అభిప్రాయాలనూ సేకరించనుంది. రాష్ట్ర స్థాయిలో పీసీసీ అధ్యక్షుడూ అయిన సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీలతోనూ కమిటీ సభ్యులు చర్చలు జరపనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అనంతరం రాష్ట్రంలోని 9లోక్‌సభ స్థానాల్లో పార్టీ ఓటమికి గల కారణాలను, ఆయా నియోజకవర్గాల్లో పార్టీ నేతల పనితీరుపైనా కురియన్ కమిటీ.. అధిష్ఠానానికి నివేదికను సమర్పించనుంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రకారం రాష్ట్రంలోని 12 లోక్‌సభ సీట్ల పరిధిలో కాంగ్రెస్‌ఆధిక్యత ప్రదర్శించగా.. తెలంగాణలోని మైనార్టీ ఓటర్ల శాతం, పదేళ్లపాటు కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం పట్ల ప్రజల్లో సహజంగా ఏర్పడే వ్యతిరేకత వల్ల తెలంగాణలో పార్టీ 14సీట్లు గెలుచుకుంటుందని ఏఐసీసీ అంచనా వేసింది. ఈ మేరకు టార్గెట్ పెట్టుకుని పని చేయాలని రాష్ట్ర నాయకత్వాన్ని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదేశించారు. అయితే ఎన్నికల్లో కాంగ్రెస్ 8 ఎంపీ సీట్లకే పరిమితమైంది. తెలంగాణ నుంచి ఆశించిన మేరకు సీట్లు రాకపోగా.. 2019 ఎన్నికలతో పోలిస్తే బీజేపీ సీట్లు రెట్టింపు కావడంపై అసంతృప్తి చెందిన అధిష్ఠానం.. తెలంగాణలో ఆశించిన మేరకు సీట్లు రాకపోవడంపై కారణాలను విశ్లేషించాలని కురియన్ నేతృత్వంలో కమిటీని నియమించింది. అయితే బీఆర్ఎస్ ఓట్ షేర్ బీజేపీకి బదిలీ కావడం కాంగ్రెస్ ఓటమికి ఓ కారణమని ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి.. అధిష్ఠానానికి వివరణ ఇచ్చారు. బలహీనమైన అభ్యర్థుల ఎంపికా ఒక కారణమన్న అభిప్రాయలూ వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కురియన్ కమిటీ విచారణపై పార్టీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



సికింద్రాబాద్‌లో గెలిచేవాడిని: వీహెచ్

లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ సీటు తనకు ఇచ్చి ఉంటే గెలిచేవాడినని వి.హన్మంతరావు అన్నారు. పార్టీ టికెట్ విషయంలో తనకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సీట్లు తగ్గడంపై కురియన్ కమిటీ.. ముందుగా వ్యూహకర్త సునీల్ కనుగోలును కలవాలని సూచించారు. ఎనిమిదేళ్లుగా తనకు ఒక్క పదవీ ఇవ్వలేదని, రాజ్యసభకు అవకాశం ఇస్తే బాగుంటుందన్నారు.

వీడియో/టెలీ కాన్ఫరెన్స్‌లో హాజరవుతా

» నేను ఇప్పట్లో భారత్‌కు రాలేను
» ఆరోగ్యం కుదుటపడేదాకా అమెరికా వదిలి వెళ్లొద్దని డాక్టర్లు చెప్పారు
» ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు
» దర్యాప్తు అధికారులకు ఈ-మెయిల్

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): "నేను ఇప్పట్లో భారత్‌కు రాలేను. వీడియో లేదా టెలికాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరవ్వగలను" అని ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్, ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్‌రావు స్పష్టం చేశారు. ఈ మేరకు దర్యాప్తు అధికారులకు ఈ-మెయిల్ ద్వారా సందేశాన్ని పంపారు. క్యాన్సర్‌కు తాను చికిత్స తీసుకుంటున్నందున.. ఆరోగ్యం కుదుట పడేవరకు అమెరికా వదిలి వెళ్లొద్దని వైద్యులు సూచించారని ఆయన వివరించారు. "కేసులో నా ప్రమేయంపై జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. బీపీ, గుండె సమస్యలు పెరిగాయి" అని ఆయన దర్యాప్తు అధికారులకు పంపిన ఈ-మెయిల్‌లో వెల్లడించారు. సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు అధికారులు ఇప్పటికే నలుగురు పోలీసు అధికారులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే.! పదుల సంఖ్యలో పోలీసు సిబ్బంది, ప్రైవేటు వ్యక్తులను విచారించి, వారి వాంగ్మూలాలను నమోదు చేసుకున్నారు. ఇటీవలే పూర్తి ఆధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్‌రావు ఇల్లు, ఇతర ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. అమెరికాలో ఉన్న ప్రభాకర్‌రావు తిరిగి ఎప్పుడు వస్తారంటూ దర్యాప్తు అధికారులు ఆయన కుటుంబ సభ్యులను ప్రశ్నిస్తూనే ఉన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రభాకర్‌రావు ఈ-మెయిల్ పంపినట్లు తెలుస్తోంది. "నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నేను జూన్ 26న భారత్‌కు తిరిగి రావాల్సింది. కానీ, అనారోగ్య కారణాలతో వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఉన్నాను. సమయం ప్రకారం చికిత్స తీసుకోకుంటే.. సమస్యలు తలెత్తుతాయి. ఆరోగ్యం కుదుట పడేదాకా అమెరికా వదిలి వెళ్లొద్దని వైద్యులు సూచించారు" అని ప్రభాకర్‌రావు ఈ-మెయిల్‌లో వెల్లడించారు. కాగా.. ఈ కేసు నమోదైన తొలినాళ్లలో.. మార్చి 22, 23 తేదీల్లో కూడా ప్రభాకర్‌రావు హైదరాబాద్ పోలీసులతో వాట్సాప్ కాల్‌లో మాట్లాడారు. ఆ సమయంలో కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. ఎస్ఐబీ చీఫ్‌గా తాను ఎలాంటి తప్పు చేయలేదని, ఎవరినీ తప్పు చేయమని ఆదేశించలేదని పేర్కొన్నారు. తన ఆరోగ్యం కుదటపడగానే హైదరాబాద్‌కు వచ్చి, దర్యాప్తు అధికారులకు సహకరిస్తానని చెప్పారు. ఇప్పుడు మాత్రం ఆరోగ్య కారణాల రీత్యా వీడియో కాన్ఫరెన్స్ లేదా టెలికాన్ఫరెన్స్‌లో అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. దీంతో.. తదుపరి ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే దానిపై దర్యాప్తు అధికారులు సమాలోచన చేస్తున్నారు. దీనిపై న్యాయ నిపుణుల సలహాలు తీసుకున్నాక.. ఓ నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

జడ్జి, కుటుంబ సభ్యుల పేర్లు ఎలా రాస్తారు?

» మీడియా తీరుపై హైకోర్టు అభ్యంతరం

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో హైకోర్టు జడ్జి, కుటుంబ సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు ప్రచురించడంపై హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఫోన్‌ట్యాపింగ్ కేసును రిపోర్టింగ్ చేసేటప్పుడు సంయమనం పాటించాలని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు సూచించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాయకులు, ప్రముఖులు, వ్యాపారులతోపాటు హైకోర్టు జడ్జి ఫోన్‌ను సైతం ట్యాప్ చేశారని వచ్చిన వార్తలను హైకోర్టు సూమోటోగా స్వీకరించి, విచారిస్తోంది. ఈ పిటిషన్‌పై సీజే జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ టి.వినోద్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్ ఆధారంగా పలు పత్రికల్లో (ఆంధ్రజ్యోతి కాదు) హైకోర్టు జడ్జి, వారి కుటుంబసభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు ప్రచురితం అయ్యాయి. దీనిపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని కౌంటర్ దాఖలు చేసినందున ప్రస్తుతానికి ఎలాంటి ఆదేశాలు ఇవ్వడం లేదని.. మీడియా సంయమనం పాటిస్తుందని విశ్వసిస్తున్నామని పేర్కొంది. తదుపరి విచారణ 23కు వాయిదా వేసింది.

బీసీ స్టడీ సర్కిళ్లకు రూ.6.25 కోట్లు

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని తెలంగాణ బీసీ స్టడీ సర్కిళ్ల నిర్వహణకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు రూ.6.25 కోట్లకు పాలనాపరమైన అనుమతులిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

డా.వైఎస్సార్‌హెచ్‌యూ కళాశాలల్లో
బీఎస్సీ(ఆనర్స్) హార్టికల్చర్

పశ్చిమ గోదావరి జిల్లా, వెంకటరామన్నగూడెంలోని డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ (డావైఎస్సార్‌హెచ్‌యూ)-'బీఎస్సీ ఆనర్స్ హార్టికల్చర్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. వర్సిటీ కళాశాలలు సహా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు అనుబంధ కళాశాలలు ఈ ప్రోగ్రామ్‌ని అందిస్తున్నాయి. బైపీసీ స్ట్రీమ్, ఎన్ఆర్ఐ అండ్ ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్, ఇండస్ట్రియల్ స్పాన్సర్‌షిప్ కోటాల కింద అడ్మిషన్స్ నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



బైపీసీ స్ట్రీమ్

ఈ స్ట్రీం కింద మొత్తం 541 సీట్లు ఉన్నాయి. వీటిలో 13 'పేమెంట్' సీట్లు; 168 'కేటగిరీ ఏ' సీట్లు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. ఏపీ ఈఏపీసెట్ 2024 ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్(వెంకటరామన్నగూడెం, అనంతరాజుపేట, పార్వతీపురం, చిన్నలతరపీ, పులివెందుల)క్యాంపస్‌లు; అనంతపురంలోని శ్రీకృష్ణ దేవరాయ కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్, జేసీ దివాకర్ రెడ్డి హార్టికల్చరల్ కాలేజ్; ప్రకాశం జిల్లాలోని కదిరి బాబూరావు కాలేజ్ ఫర్ హార్టికల్చర్, ఎస్ఎస్ కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్‌లలో అడ్మిషన్స్ పొందవచ్చు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/నేచురల్ సైన్సెస్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ తప్పనిసరి. 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా

దీని కింద 15 శాతం సూపర్‌న్యూమరరీ సీట్లు ప్రత్యేకించారు. మొత్తం 56 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏపీ ఈఏపీసెట్ ర్యాంక్‌తో పనిలేదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. రిజర్వేషన్‌లు వర్తించవు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ స్ట్రీమ్(బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులు) లేదా ఎంబైపీసీ స్ట్రీమ్(మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులు)తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. అభ్యర్థులు పదోతరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకూ ఆంగ్ల మాధ్యమంలో చదివి ఉండాలి. లేని పక్షంలో ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ టెస్ట్(ఐఈఎల్‌టీఎస్/టోఫెల్) స్కోర్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- అభ్యర్థులు పూర్తిచేసిన దరఖాస్తుతోపాటు సంబంధిత ఎన్ఆర్ఐ వీసా-పాస్‌పోర్ట్-ఆదాయం ధృవీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కేటగిరీకి విద్యార్థి తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధృవీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

ఇండస్ట్రియల్ స్పాన్సర్‌షిప్ కోటా

దీని కింద 2 శాతం సీట్లు ప్రత్యేకించారు. మొత్తం 8 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ/ఎంబైపీసీ స్ట్రీమ్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- అభ్యర్థులు పూర్తిచేసిన దరఖాస్తుతోపాటు స్పాన్సర్ సంస్థకు సంబంధించిన సేల్స్ ట్యాక్స్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, పాన్ కార్డ్, గత మూడేళ్ల ఆడిటెడ్ బ్యాలెన్స్ షీట్, ఇన్‌కం ట్యాక్స్ రిటర్న్ స్టేట్‌మెంట్, ఇన్‌కార్పొరేషన్ సర్టిఫికెట్, అసోసియేషన్ మెమొరాండమ్, స్పాన్సర్‌షిప్ లెటర్ జతచేసి కింది చిరునామాకు పంపాలి.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** బైపీసీ స్ట్రీమ్‌నకు జనరల్ అభ్యర్థులు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు రూ.500 చెల్లించాలి. ఎన్ఆర్ఐ, స్పాన్సర్డ్ కోటాలకు జనరల్ అభ్యర్థులు రూ.1500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.750 చెల్లించాలి.
- **ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 9
- **చిరునామా:** రిజిస్ట్రార్, డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, వెంకటరామన్నగూడెం - 534101, పశ్చిమగోదావరి జిల్లా
- **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

ఆంధ్రజ్యోతి
దిక్సూచి

హైదరాబాద్ ● గురువారం 11 జూలై 2024

diksuchi@andhrajyothy.com

జాబ్ కార్నర్

యూకో బ్యాంకులో అప్రెంటిస్‌లు

కోల్‌కతాలోని యునైటెడ్ కమర్షియల్ బ్యాంక్, ప్రధాన కార్యాలయం, మానవ వనరుల విభాగం.. దేశవ్యాప్తంగా యూకో బ్యాంకు శాఖల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 544

పోస్టు: అప్రెంటిస్

ఖాళీలు: 544(ఏపీలో 7, తెలంగాణలో 8 ఖాళీలు ఉన్నాయి)

అర్హత: ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత

వయసు: 2024 జూలై 16 నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, బీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

స్టయిపెండ్: నెలకు రూ.15,000

శిక్షణ వ్యవధి: ఏడాది

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ రాత పరీక్ష, లోకల్ లాంగ్వేజ్ టెస్ట్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా **చివరి తేదీ:** జూలై 16


వెబ్‌సైట్: https://ucobank.com/en/



డీఎస్సీ(ఎస్‌జీటీ) మోడల్ ప్రశ్నలు

తెలుగు

1. ఆరు ఇంద్రగణాలు, రెండు సూర్య గణాలు ప్రతి పాదము నందు గలది
   1. తేటగీతి 2. ఆటవెలది 3. కందము 4. సీసము
2. ఈ కిందివాటిలో అలంకారాలను గుర్తించండి
   ఎ. బాసర కీర్తి పాలసముద్రం
   బి. బాసర కీర్తి పాలసముద్రం వలె అనంత వినీలాకాశంలో విహరించుచున్నది
   సి. బాసర కీర్తికి బాసర కీర్తియే సాటి
   1. రూపకం, లుప్తోపమాలంకారం, అనన్వయం
   2. రూపకం, పూర్ణోపమా, అనన్వయాలంకారం
   3. అనన్వయాలంకారం, ఉపమాలంకారం, రూపకాలంకారం
   4. స్వభావోక్తి, రూపకాలంకారం, ఉపమాలంకారం
3. శ్రీకృష్ణ దేవరాయలు తన పరాక్రమంతో రాజ్యాన్ని విస్తరింప చేశాడు. మహామంత్రి తిమ్మరుసు వలన మరింత బలోపేతుడయ్యాడు. ఈ వాక్యాలలోని 'తో', 'వలన' వంటి వాటిని ఇలా పిలుస్తారు.
   1. క్రియలు 2. అన్యదేశ్యాలు
   3. విభక్తి ప్రత్యయాలు
   4. ద్రుత ప్రకృతికములు
4. సమప్రాధాన్యం గల వాక్యాలు కలిపి ఒక వాక్యంగా ఏర్పడితే అది?
   1. అప్రధాన వాక్యం 2. సామాన్య వాక్యం
   3. సంయుక్త వాక్యం 4. సంశ్లిష్ట వాక్యం
5. ద్విపాద మకుటం గల శతకం
   1. దాశరథి 2. ఆంధ్రనాయక
   3. వేమన 4. తెలుగు బాల
6. రామాయణాన్ని జనప్రియ రామాయణం పేరుతో రచించింది?
   1. వావికొలను సుబ్బారావు
   2. గుడిపాటి వెంకటాచలం
   3. పుట్టపర్తి నారాయణాచార్యులు
   4. యథావాక్కుల అన్నమయ్య
7. 'ఖేదము' వ్యతిరేక పదము
   1. క్రోదము 2. చోదము 3. మోదము 4. శోధము
8. శివ తన జీవిత లక్ష్యం రెండు వేల కిలోమీటర్ల దూరంలో ఉందని అన్నాడు. (ప్రత్యక్ష కథనం/పరోక్ష కథనం)
   1. శివ "నా జీవిత లక్ష్యం రెండు వేల కిలోమీటర్ల దూరంలో ఉంది" అని అన్నాడు.
   2. శివ "తన జీవిత లక్ష్యం రెండువేల కిలోమీటర్లు ఉంది"అన్నాడు
   3. శివ "నా జీవితం రెండు వేల కిలోమీటర్లు అన్నాడు"
   4. తన జీవిత లక్ష్యం రెండువేల కిలోమీటర్లు అన్నాడు శివ
9. మంచి పుస్తకాలు కొనే అలవాటు చేసుకోండి. ఇది ఏ వాక్యం?



   1. ప్రేరణార్థక వాక్యం 2. సామర్థ్యార్థక వాక్యం
   3. ఆత్మార్థక వాక్యం 4. విధ్యర్థక వాక్యం
10. తెల్లని పొలంలో నల్లని విత్తనాలు చేతితో చల్లుతారు. నోటితో ఏరుతారు?(ప్రహేళిక)
    1. అక్షరాలు 2. అన్నం
    3. మినుములు 4. సీతాఫలం
11. బాలసాహిత్యంలో విశేష కృషి చేసినవారికి అమెరికన్ లైబ్రరీ అసోసియేషన్ వారు ఇచ్చే న్యూబెరి మెడల్ అనే విశిష్ఠ పురస్కారం అందుకున్న ఏకైక భారతీయుడు?
    1. గోనబుద్దారెడ్డి 2. ధనగోపాల్ ముఖర్జీ
    3. పరవస్తు చిన్నయసూరి
    4. బహుజనపల్లి సీతారామాచార్యులు
12. వర్తమాన అసమాపక క్రియతో కూడిన సంశ్లిష్ట వాక్యానికి ఉదాహరణ
    1. శ్రీనివాస్ ఏడ్చి పరిగెత్తుతున్నాడు
    2. శ్రీనివాస్ ఏడుస్తూ పరిగెత్తుతున్నాడు
    3. శ్రీనివాస్ ఏడ్వలేక పరిగెత్తుతున్నాడు
    4. శ్రీనివాస్ ఏడ్వాలనుకొని పరిగెత్తుతున్నాడు.
13. కిందివానిలో దాశరథి కృష్ణమాచార్యులు రచించిన 'తిమిరంతో సమరం'ను వరించిన పురస్కారం?
    1. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు
    2. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు
    3. ఉత్తమ అనువాద పురస్కారం 4. పైవన్నీ
14. "లాకృతి" అనే పదము ఉదాహరణ గల సంధి?
    1. గుణ సంధి 2. సవర్ణ దీర్ఘ సంధి
    3. యణాదేశ సంధి 4. ఋలనల సంధి
15. 'ఎ టైమ్‌లెస్ స్ప్రింగ్'ను 'అనాది సోతస్సు' పేరుతో తెలుగులోకి అనువదించింది?
    1. జిడ్డు కృష్ణమూర్తి 2. అనంతమాత్యుడు
    3. అరుణ్‌మోహన్ 4. భద్రిరాజు
16. బుర్రకథకు పితామహుడు
    1. మునిపల్లె సుబ్రహ్మణ్య స్వామి
    2. ఆదిభట్ల నారాయణదాసు
    3. షేక్ నాజర్ 4. మంగరాజు
17. 'సులభ గ్రాహ్యమగుట' అనే అర్థంలో వాడే జాతీయం?
    1. అందెవేసిన చెయ్యి 2. అల్లారు ముద్దుగా
    3. కాకతాళీయం 4. కరతలామకం
18. నేను వారితో చెప్పాను ఇప్పుడు మీతో చెప్తున్నానులో పురుషులు...
    1. ఉత్తమ, ప్రథమ, మధ్యమ
    2. ఉత్తమ, మధ్యమ, ప్రథమ
    3. మధ్యమ, ఉత్తమ, ప్రథమ
    4. ప్రథమ, ఉత్తమ, మధ్యమ

సమాధానాలు

1) 4 2) 4 3) 3 4) 3 5) 2 6) 3 7) 3
8) 1 9) 4 10) 1 11) 2 12) 2 13) 2
14) 3 15) 3 16) 3 17) 1 18) 1

ENGLISH

There are about two hundred and forty different kinds of snakes in India. There are very small snakes, like the blind snakes and big ones like Pythons and Cobras. All snakes are not poisonous; only a few snakes like the Cobra, the Krait and the Viper are poisonous. Even some of the poisonous snakes willhurt us only if we hurt them.

Some of the nonpoisonous snakes are the blind snakes, the Vine snakes and the Cat snakes. These are commonly seen by people. Sometimes, blind snakes can be seen near water taps and they cause a lot of fear in people. These snakes mainly eat ants. The Vine snakes have a smooth deep green color. They are usually about a meter in length. The Cat snakes are brown in color. These have large eye and long thin bodies.

These nonpoisonous snakes are useful to man as they eat rats and other harmful animals.

1. **In India there are ....**
   1. More than five hundred different kinds of snakes
   2. About two hundred and forty different kinds of snakes
   3. About fifty different kinds of snakes
   4. A hundred and forty different kinds of snakes
2. **The poisonous snakes hurt us only when ....**
   1. They are hungry 2. We hurt them
   3. They are caught and put in a cage
   4. We hate them
3. **These snakes mainly eat ants. In this sentence 'these' refers to ....**
   1. All nonpoisonous snakes
   2. All poisonous snakes
   3. Blind snakes 4. Vine snakes
4. **The Cat snakes have ....**
   1. Bodies like the Vine snakes
   2. Eyes like the blind snakes
   3. Color like the Vine snakes
   4. Have a smooth deep green color
5. **............. of the snakes are not poisonous**
   1. A few 2. Some 3. Most 4. Any
6. **In the following sentence a wrong article is used. It is underlined. Replace it with the correct article from the choices given.**
   This is a news I hate to hear
   1. One 2. An 3. The 4. No article
7. **Smoking is injurious to health.**
   1. Adverb 2. Verb
   3. Adjective 4. Noun
8. **In which of the following sentences are all prepositions used correctly?**
   1. I am not sure if I can accept of the post, as I am still looking at a house to live in
   2. I am not sure if I can accept the post, as I am still looking for a house to live in
   3. I am not sure if I can accept of the post, as I am still looking for a house to live on
   4. I am not sure if I can accept of the post, as I am still looking out a house to live by
9. **They had completed the work without much delay. (Choose the passive form)**
   1. The work was completed by the them without much delay
   2. The work was been completed by them without much delay
   3. The work was being completed by them without much delay
   4. The work had been completed by them without much delay.
10. **In the following sentence, the under lined parts use the wrong tense form of the verb. Replace it with the correct choice from the forms given.**
    It was crazy to drive that: you would kill somebody.
    1. Could kill 2. Would have killed
    3. Can have killed
    4. Could have killed
11. **Tick the correct sentence?**
    1. He learns English on Sundays
    2. He is learning English on Sundays
    3. He has learnt English on Sundays.
    4. He was been learning English on Sunday.
12. **Which of the following statement is not a complex**
    1. As soon as he completed the work, he went out for a walk
    2. No sooner had he completed the work than he went out for a walk
    3. If he had completed his work, he would have gone out for a walk
    4. He had not only completed his work but also went for a walk.
13. **Which of the following sentences are rightly punctuated.**
    1. He said to me " What are you doing?"
    2. He said to me, "What are you doing?"
    3. He said to me,"what are you doing"?
    4. He said to me "What are you doing"?
14. **This small table /(A) will collapse /(B) if you will stand (C)/ on it (D).**
    1. A 2. B 3. C 4. D
15. **The priest said ,"God is omni present."(change into reported speech.)**
    1. The priest said that God is omnipresent
    2. The priest said that God was omnipresent
    3. The priest said that God has been omnipresent
    4. The priest said that God had been omnipresent
16. **Find out the correct meaning of the following PHRASAL VERBS which are underlined.**
    I can't make out what you are saying.
    1. Underline 2. Understand
    3. Explain 4. Prepare
17. **The ascused was not found guilty and was___**
    1. Removed 2. Dismissed
    3. Punished 4. Discharged
18. **Formal language is used in ____**
    1. Letters to relative 2. Official letters
    3. Friendly letters 4. All are correct

సమాధానాలు

1) 2 2) 2 3) 3 4) 1 5) 3 6) 3 7) 3
8) 2 9) 4 10) 4 11) 1 12) 4 13) 2
14) 3 15) 1 16) 2 17) 4 18) 2

ప్రశ్న పత్రాన్ని హైదరాబాద్‌లోని బాసర ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన శీలం దేవేందర్‌రెడ్డి నేతృత్వంలో సీనియర్ ఫ్యాకల్టీ బృందం రూపొందించింది.

లిటిల్స్




తెలివైన కళాకారుడు

జయపురాన్ని పాలించే రాజు గోవింద వర్మకు కళలు అంటే ఎంతో ప్రీతి. తన రాజ్యంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన కళాకారులకు విలువైన బహుమతులు ఇచ్చి సన్మానిస్తూ ఉండేవాడు. ఒక రోజు గోవింద వర్మ తన కొలువులో ఒక సవాలు విసిరాడు. కుంచె మరియు రంగులు లేకుండా బొమ్మగీయగల చిత్రకారుడికి ఘనమైన సన్మానంతో పాటు వెయ్యి బంగారు నాణాలు బహుమతిగా ప్రకటించాడు. కానీ అతని ఆస్థానంలో చిత్రకారులంతా 'కుంచె, రంగులు లేకుండా చిత్రం ఎవరైనా ఎలా



గీయగలరు?' అనుకుని మౌనంగా ఉండిపోయారు. ఒక మారుమూల గ్రామంలో నివసించే కోటయ్య అనే పేద కళాకారుడికి మాత్రం ఎలాగైనా ఈ సవాలుకు జవాబు చెప్పి రాజు గారి మెప్పు పొందాలి అనిపించేది. అతను ఇలా ఆలోచిస్తూ ఉండగా అతని ఇంట్లో ఉన్న దీపం గూట్లో పైన ఉన్న తెల్లని గోడకు నల్లగా మసి పట్టడంగమనించాడు. ఆ మర్నాడ అతను కుంచె, రంగులు లేకుండానే బొమ్మ గీయగలనని రాజు గారి దర్శనానికి అనుమతి కోరాడు. అనుమతి లభించి రాజుగారి ఎదుటికి వెళ్లి, తన చేతి సంచీలోనుంచి ఒక దీపం మరియు తెల్ల కాగితం తీసి ఆ కాగితం నిండా దీపపు మసి పట్టేటట్లు చేసి, తర్వాత ఆ కాగితం మీద నేర్పుగా తన వేళ్లతో రాజుగారి చిత్రం గీశాడు. అతని సమయస్ఫూర్తికి రాజుగారు మెచ్చి, ఇచ్చిన మాట ప్రకారం ఘనమైన సన్మానంతో పాటు వెయ్యి బంగారు నాణాలు కానుకగా ఇచ్చి పంపాడు.


6 తేడాలు గుర్తించండి!



దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 355

			6	7			1	3
				5			2	
					3	4		
	3				7			2
7		4				5		8
5			4				6	
		8	9					
	2			8				
6	9			3	1			

సుడోకు - 354 సమాధానం

7	8	3	1	9	6	5	4	2
1	5	6	4	2	7	3	8	9
4	2	9	5	3	8	7	1	6
5	3	1	8	4	9	6	2	7
8	6	2	7	5	1	4	9	3
9	7	4	2	6	3	1	5	8
6	4	5	9	7	2	8	3	1
3	9	8	6	1	5	2	7	4
2	1	7	3	8	4	9	6	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.